ఆంధ్ర సచిత్ర వారపత్రిక




ANDHRA PATRIKA
ILLUSTRATED WEEKLY

25 నయాపైసలు



"ఆలోచనకు అంతులేదు"

ఫోటో — ఎస్. వి. సత్యనారాయణ, సికింద్రాబాదు


అవి వట్టిమాటలేం కావు— 5½ కోట్ల కప్పులకు పైగా బ్రూక్ బాండ్ టీని త్రాగుతున్నారు!
మీకు బాగా తెలుసు— త్వరగా సరఫరా చేయడమే బ్రూక్ బాండ్ టీ తోట వదును తాజాదనపు రహస్యం!
రా, రా, విను— ఇతర బ్రాండు లన్నిటికంటె బ్రూక్ బాండ్ టీనే చాలమంది త్రాగుట గొప్ప విశేషమేంటి చెప్పు!
అన్ని వేళలా
బ్రూక్ బాండ్
టీనే
త్రాగి ఆనందించండి
Brooke Bond
Roses Blend
Brooke Bond
Leaf Tea
బ్రూక్ బాండ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్
BB 269R

సంవత్సర చందా
రు. 13-0-0
విడిప్రతిక 25న.పై.

ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక

సంపుటము 52
సంచిక 53
27-8-58

Founder : K. NAGESWARA RAO

విలంబి శ్రావణ శుద్ధ త్రయోదశి బుధవారం

విషయానుక్రమణిక

ముఖచిత్రం :
ప్రభావారి
'ఆడపెత్తనం'లో
రాజసులోచన

భారతరాజధానిలో

ఆంధ్రాస్పోర్ట్స్‌క్లబ్

శ్రీ తురగా కృష్ణమోహన్‌రావు

ప్రధానమంత్రి వచ్చి ప్రారంభోత్సవం చేసేనేగాని, పనులు ప్రారంభించడం గౌరవహీనమని వ్యక్తులు, సంస్థలు భావించే రోజులివి. ప్రచారంవల్లనే ప్రపంచం నడుస్తూందనే అభిప్రాయమే దీనికి కారణం. పెళ్ళిపల్లకి ముందు మంగళవాద్యాలుండడం మంచిదే, పెళ్ళే లేకపోతే కేవలం మంగళవాద్యాలతో తృప్తిపడి ప్రయోజనం ఏమిటి? జమీందారుగారికి మోపాలే లేకపోతే సంపంగినూనెతో పనేమిటి? వ్యక్తులను, సంస్థలను కష్టించి పనిచేయమనండి: ఫలితాలను సాధించమనండి: ప్రచారం దానంతటదే వస్తుంది.

పనులేమీ చేయకుండానే, పత్రికాప్రకటనలతో తృప్తిపడే సంస్థలెన్నో దేశంలో కనుపిస్తున్న ఈరోజుల్లో ప్రచారంతో నిమిత్తం లేకుండా, నిశ్శబ్దంగా తన కార్యక్రమంలో నిమగ్నమైన సంస్థ తటస్థపడితే, ప్రాణంలేచి వస్తుంది "దీనిని గురించి వ్రాయాలి: దేశంలో ఈ సంస్థ పేరుప్రతిష్ఠలు పెరగాలి" అనిపిస్తుంది. కలం పరుగులిడుతుంది.

"ఆంధ్ర స్పోర్ట్సుక్లబ్" పేరు మీరు వినుండరు: అది భారతదేశ రాజధాని నగరంలో, కొత్తఢిల్లీలో, ఉంది. నిశ్శబ్దంగా, ప్రచారసాధనాలతో నిమిత్తంలేకుండా, పని చేస్తూంది. ఆంధ్రుల అవసరాలను కేంద్ర ప్రభుత్వాధికారులకు నచ్చచెప్పగల ప్రముఖులు మనకు రాజధాని నగరంలో లేరని, అందువల్లనే కేంద్రప్రభుత్వం మనపై శీతకన్ను వేస్తుంటుందని మనం వాపోతూంటాం. అనేక విషయాలలో అది నిజమేనవడంలో సందేహంలేదు. కాని ఆటలపోటీల విషయంలో ఆంధ్రులకు అన్యాయం జరక్కుండా చూస్తూంటుంది ఈ సంస్థ. స్థాపించి రెండుసంవత్సరాలు పూర్తిగా కాలేదు ఇంకా. కాని ఈలోగానే తన జన్మను సార్థకం చేసుకుంది. "ఇంకా చాలా చేసేవాళ్ళం! కాని ఢిల్లీలో నెగ్గాలంటే, హైదరాబాదుకూడా సమర్థించాలి మమ్మల్ని," అన్నాడు ఆ సంస్థ ప్రతినిధి ఒకరు నాతో.

'ఆంధ్ర స్పోర్ట్సుక్లబ్' సంస్థలో ఉత్సాహవంతులైన యువకులున్నారు; అనుభవజ్ఞులైన పెద్దలున్నారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖలో ప్రధానమంత్రికి పార్లమెంటరీ కార్యదర్శి శ్రీ సాదత్ అలీఖాన్ అధ్యక్షులు. 'హిందూస్థాన్ టైమ్స్' ఆంగ్ల దినపత్రికలో సహాయ సంపాదకులు, యువకులు, శ్రీ కె. వి. గోపాలరత్నం ఈ సంస్థకు కార్యదర్శి. 'విజ్జీ'గా అంతర్జాతీయ క్రికెట్ రంగంలో పేరుప్రతిష్ఠలు సంపాదించుకొన్న 'పద్మభూషణ్' డా. విజయానంద్; సి. కె. నాయుడుగా ప్రసిద్ధికెక్కిన శ్రీ కొటారి కనకయ్యనాయుడు; పశ్చిమ ఇండీస్ దీవులకు చెందిన శ్రీ జి. ఎస్. సైన్సెట్; అక్కౌంట్సు, ఆడిట్ శాఖలో ఉన్నతపదవి నిర్వహించిన శ్రీ పింగళి రాఘవరావు; జలవిద్యుచ్ఛక్తి సంస్థకు చెందిన డా. కె. ఎల్. రావు; సుప్రీంకోర్టు న్యాయమూర్తి శ్రీ బచ్చు జగన్నాధదాసు; యూనియన్ మంత్రి శ్రీ కె. సి. రెడ్డి. కంపెనీలా పరిపాలనా సంఘానికి అధ్యక్షులు శ్రీ తెన్నేటి విశ్వనాధం; రక్షణ మంత్రిత్వశాఖ కార్యదర్శి, మాజీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, శ్రీ ఓ. పుల్లారెడ్డి; గవర్నరు శ్రీ పవార్ - ఈ పేర్లు చాలా? వీరందరు 'ఆంధ్ర స్పోర్ట్సు క్లబ్' సంస్థకు పోషకులు. వీరేకాదు. ఆంధ్రదేశంనుంచి ఎన్నికైన పలువురు పార్లమెంటు సభ్యులున్నారు. ఆంధ్రులున్నారు; ఆంధ్రేతరులున్నారు. ఇంతమంది పెద్దల ఆశీర్వచనాలతో 'ఆంధ్ర స్పోర్ట్సుక్లబ్' ముందుకు సాగుతూంది.

"ఏ దేశమేగినా, ఎందు కాలిడినా—" అన్నాడు వైతాళికుడు శ్రీ రాయప్రోలు సుబ్బారావు. ఆంధ్రులసంస్థ ఎక్కడున్నా, ఏ దేశంలో అభివృద్ధి సాధిస్తున్నా అది ఆంధ్రులకు గర్వకారణమే. ఆంధ్రులు ఏయే దేశాలకేగినా, ఏయే దేశాలలో వేళ్ళు పాతుకుపోయినా; ఆంధ్రులసంస్థలు మరే యే దేశాలలో స్థాపించబడినా, మరే యే దేశాలలో వేళ్ళు పాతుకుపోయినా— ఆంధ్రులు తమ ఉత్సాహాన్ని, అనుభవాన్ని ఆ సంస్థల అభివృద్ధికి అంకితం చేయడంలో ఆశ్చర్యంలేదు. మరి ఆంధ్రేతరులు ఆంధ్రుల



శ్రీ కె. వి. గోపాలరత్నం; సర్దార్ మజీథియా, కొటారి కనకయ్య నాయుడు


★ ఆంధ్రా స్పోర్ట్స్ క్లబ్ ★

సంస్థలను ఎందుకు సమర్థించాలి? చరిత్ర రెండుపుటలు వెనక్కి తిప్పుదామా?

రెండు సంవత్సరాల క్రితం విషయం. 1956-వ సంవత్సరం జూన్ 17-వ తేదీ ఆదివారం. ఢిల్లీ ఆంధ్ర వనితామండలివారు భరణీవారి "విప్రనారాయణ" ఎగ్జిబిషన్ ప్రాంతంలో వున్న థియేటర్ లో ప్రదర్శింపబడుతుందని ప్రకటించారు. తెరమీద తెలుగుముఖాలు చూడాలని, తెలుగు మాటలు పాటలు ఆలకించాలని తెలుగువారందరూ — వేలమంది బయలుదేరారు. ఏ కారణంవల్లనో "విప్రనారాయణ" చిత్రం రాలేదు. వెళ్ళినవారి ఉత్సాహం పై నీళ్ళు జల్లినట్టైంది. ఇళ్లకు వెళ్లినవాళ్ళు వెళ్లిపోయారు. మిగిలినవాళ్ళు, చేతిలో మిగిలిన కాలాన్ని, ధనాన్ని వెచ్చించడంకోసం చుట్టుపక్కల ఉన్న కాఫీహోటళ్లకు చేరారు. 'ఆంధ్ర స్పోర్ట్సు క్లబ్' స్థాపించాలనే భావం ఆసమయంలో ఒకరిద్దరు ముగురు వ్యక్తులకు కలిగింది. సంస్థ ఈనాటికి పెరిగి పెద్దదయింది. విప్రనారాయణుడు-అక్కినేని నాగేశ్వరుడు అదృశ్యుడైనా ఆంధ్రులకు మేలు కలిగించాడు.

పద్దెనిమిదో శతాబ్దపు ఆంగ్ల సాహిత్య చరిత్ర చదివినవారందరికీ కాఫ్యాలయాల ప్రాముఖ్యత తెలుస్తుంది. ఇరవయో శతాబ్దపు తెలుగు సాహిత్యచరిత్ర కొంతవరకైనా మదరాసు కాఫీహోటళ్లలో కల్పించబడింది. ప్రస్తుత పరిస్థితినిబట్టిచూసే హైదరాబాదు కాఫీహోటళ్లు, 'చాయ్‌ఖానాల' చరిత్రకెక్కుతున్నాయి. 'ఆంధ్రుల చరిత్ర నిర్మాణంలో మాకు కూడా ఒక భాగం ఉండాలి సుమా!' అని హెచ్చరిస్తూంది ఢిల్లీలో ఒక కాఫీహోటలు. ఈ హెచ్చరిక విని ఆశ్చర్యపడకండి; అజ్ ఢిల్లీ దూర్ నహీం హై!

శ్రీ సి. వామనమూర్తి, శ్రీ ఎ. చక్రవర్తి, శ్రీ కె. వి. గోపాలరత్నం-వీరు ముగ్గురు 1956-వ సంవత్సరం జూన్ 19-వ తేది ఆదివారంనాడు, విప్రనారాయణుడి దర్శనం కానందువల్ల కలిగిన నిరుత్సాహాన్ని దిగమ్రింగుకోడానికి ఆ కాఫీహోటలుకు చేరిన కొద్ది క్షణాలలో ఈ ఉత్సాహజనకమైన అభిప్రాయం కలిగింది. ముగ్గురూ యువకులే. భారతీయ క్రీడారంగంలో — కాదు ప్రపంచ క్రీడారంగంలో — ఆంధ్రుల పేరు మారుమ్రోగాలన్న ఉత్సాహం గలవారే. ప్రసిద్ధాంధ్ర వైతాళికుని కంఠం కలిపి "చాటదేవు, చాటదేవు ఆంధ్రులమహోజ్జ్వల చరిత్ర" అని పాట పాడేరు. అంతే కాదు, "చాటబోదు ఆంధ్రుల మహోజ్జ్వల చరిత్ర" అన్నారు. 'తథాస్తు' అన్నారు భారత రాజధాని నగరవాసులైన పెద్దలు, ఆంధ్రులు.



శ్రీ సి. శంకరరావుకి సర్దార్ సుర్జిత్ సింగ్ మజీథియా బహుమతి ఇస్తున్న చిత్రం; చిత్రంలో ఎడమప్రక్కన వున్నవారు హిందూస్థాన్ టైమ్స్ పత్రిక సహాయ సంపాదకుడు శ్రీ కే. వి. గోపాలరత్నం.

సరిగ్గా వారంరోజుల తర్వాత—మరో ఆదివారంనాడు—1956 వ సంవత్సరం జూన్ 24 వ తేదీన కన్ను తెరచింది ఆంధ్ర స్పోర్ట్సు క్లబ్. శ్రీ సి. వామనమూర్తి అధ్యక్షులయ్యారు. ఢిల్లీ క్రికెట్ లీగుకి అనుబంధ సంస్థగా నమోదు చేయబడింది—లీగు పోటీ ఆటలో మూడు 'డివిజను'లంటూ ఉంటాయి. కొత్తగా చేరిన సంస్థ ఎటువంటిదైనా 'సి. డివిజన్' లోనే చేరాలి. ఆ తరువాత సంస్థలు క్రమంగా 'సి' నుంచి 'బి' కి; 'బి' నుంచి 'ఎ' కి చేరుకొంటాయి. ప్రతీ డివిజన్ లోనూ పోటీలు ఆడివిజనులోని సంస్థల మధ్యనే జరుగుతాయి. మొదటి సంవత్సరం గడవకముందే 'ఆంధ్ర స్పోర్ట్సు క్లబ్' ఒక విజయం సాధించింది.


1956 వ సంవత్సరం సెప్టెంబర్ 22 వ తేదీన ఆంధ్ర స్పోర్ట్సు క్లబ్ కీ సమాచార ప్రసార మంత్రిత్వశాఖకి చెందిన క్రికెట్ క్లబ్ కీ మధ్య పోటీ ఆట జరిగింది. ఆంధ్ర స్పోర్ట్సు క్లబ్ దళానికి కెప్టెన్: శ్రీ ఆర్. వి. ఎస్. రామారావు. ఆంధ్ర క్లబు సాధించిన విజయం ఢిల్లీ క్రికెట్ లీగ్ అధికారులకు ఆశ్చర్యాన్ని, సంతోషాన్ని కలిగించింది. ఈ విజయం ఒక్కసారిగా ఈ ఆంధ్రుల సంస్థకి 'బి' డివిజన్‌లో స్థానం లభింపచేసింది. మొదటి సంవత్సరములోనే ఇటువంటి విజయం లభించడం ఢిల్లీ క్రికెట్ లీగ్ చరిత్రలోనే అపూర్వం. ఏ సంస్థ చరిత్రలోనైనా అపూర్వమే నేమో?

ఈ పోటీ ఆటలోనే ఆంధ్రులకి గర్వకారణమైన మరో విషయం. మన సంస్థలో సభ్యుడు, యువకుడు, శ్రీ సి. శంకరరావు ఆరు పరుగులు మాత్రం వదిలి తొమ్మిది వికెట్లు సాధించాడు. ఆటలో ఒకదశలో ఒక పరుగుకి ఆరు వికెట్లు సాధించాడు. ఇది ఢిల్లీ క్రికెట్ లీగ్ చరిత్రలోనే కాదు, భారత క్రికెట్ చరిత్రలోనే అపూర్వమట! అప్పట్లో కేంద్ర రక్షణశాఖ ఉపమంత్రి, భారత కంట్రోల్ బోర్డు ఉపాధ్యక్షుడు సర్దార్ సుర్జిత్ సింగ్ మజీథియా శ్రీ సి. ఎస్. రావుకి స్వహస్తాలతో బహుమతి అందచేశారు.

'ఆంధ్రస్పోర్ట్సుక్లబ్' ఢిల్లీ ఆంధ్రుల క్రీడాభిలాషను పెంపొందించడంలో తృప్తి పడవచ్చు. ఢిల్లీ క్రీడారంగంలో ఆంధ్రులకు

(49-వ పేజీ చూడండి)

ఢిల్లీ లేఖ



శ్రీకృష్ణ

ప్రజాస్వామ్యానికి అగ్నిపరీక్ష

భారత దేశంలో ప్రజాస్వామ్యానికి అగ్నిపరీక్ష జరుగుతోంది. దేశంలో ఇటీవల జరిగిన సంఘటనలు పార్లమెంటు ప్రారంభ సమావేశాలు ఈవిషయాన్ని ఋజువు చేస్తున్నాయి, ప్రధాన మంత్రి ఇంటి ఎదురుగా జీవితభీమా ఉద్యోగులు నిరాహారదీక్ష సాగిస్తున్నారు. కోర్కెలను చెల్లడిచేయటానికి నిరాహారదీక్ష ముఖ్య సాధనంగా పరిణమించింది. బలాత్కారంగా ఒప్పించటానికే నిరాహారదీక్ష ఉపయోగపడుతోంది. బ్రిటిష్ వారిపై దీన్ని ప్రయోగించినపుడు అంతా అది చాలా మంచిసాధనమని మురిసి పోయారు. మానవ కారుణ్య కారణంగా అది ఫలించటంమాని, ఇప్పుడు ప్రతివారూ నిరాహార దీక్షలకు దిగుతున్నారు.

ఢిల్లీలో చట్ట విరుద్ధంగా కట్టిన కట్టడాలు యాభైవేలకు పైగా ఉన్నాయి. వీటిలో కొన్నిటిని ప్రభుత్వ స్థలాలలో కట్టారు. మునిసిపల్ కౌన్సిలర్ల మద్దతుమూలంగా ఈ కట్టడాలను ఇప్పుడు చట్టబద్ధం చేస్తున్నారు. ఒకతప్పు మరోతప్పుకు దారితీస్తుంది. తప్పుల తోరణం తయారవుతుంది. అహమదాబాదులో చట్ట విరుద్ధంగా నిర్మించిన ఒక స్మారక చిహ్నంపై అల్లర్లు కొనసాగాయి. వచ్చినబాధేమీ ఉంటే బాగా చదువుకుని మామూలుగా రాజ్యాంగద్ధంగా వ్యవహరించే పార్లమెంటు సభ్యులే కొందరు ఈ చట్ట విరుద్ధమైన కట్టడాన్ని సమర్థించారు.

ప్రజాస్వామ్యాన్ని స్వలాభంకోసంవాడుకోటం కమ్యూనిస్టుల ఎత్తుగడల్లోకల్లా బ్రహ్మాండమైనది. కేరళలో వారు రాజ్యాంగసమ్మత పద్ధతులద్వారా అధికారంలోకి వచ్చారు. రాజ్యాంగపద్ధతులలోనే ఇప్పుడు కార్మికులను తమచేజిక్కించుకుంటున్నారు అధికారం హస్తగతమైన తర్వాత,అధికారంలో స్థిరపడేందుకు కమ్యూనిస్టుపద్ధతు లవలంబిస్తారు. పార్లమెంటులో మాట్లాడుతూ శ్రీ డాంగే రాజకీయహత్యలను ప్రత్యేకంగా నిరసించలేదు. కాంగ్రెసు ప్రభుత్వాలున్న రాష్ట్రాల్లో కూడా రాజకీయ హత్యలు జరుగుతూనే ఉన్నాయని ఆయన అన్నారు. ఒకటి మాత్రం స్పష్టమవుతోంది. ప్రధాన మంత్రి ఆదర్శవాదాన్ని, ఆవేశాన్ని కమ్యూనిస్టులు శుభ్రంగా ఉపయోగించుకుంటారు.

రాబోయే 'రాబీ' పైరు ఉద్యమాన్ని విజయవంతం చేసేందుకుగాను, అర్థబలాన్ని, అంగబలాన్ని సమన్వయం చేసుకుని, దీనితో సంబంధమున్న వివిధశాఖల ప్రయత్నాలన్నిటినీ సమీకరించాలని కేంద్ర ఆహార, వ్యవసాయశాఖ మంత్రి రాష్ట్ర ప్రభుత్వాలకు జరూరు విజ్ఞప్తి చేశారు.

గోధుమ పండించే ఉత్తరాది రాష్ట్రాలలో 'రాబీ' పైరులో అధికోత్పత్తి ప్రోత్సహించేందుకుగాను ఉపాధ్యాయులను, విద్యార్థులను, వలంటీర్లను 'మెరుపు దళాలు'గా ఏర్పాటుచేసి పంపించాలని ఆగస్టు నెల మొదట్లో వచ్చిన ఒక సూచనకు

★ న్యూ ఢిల్లీ లేఖ ★

చాలా ప్రచారం జరిగింది. అధికోత్పత్తిని ప్రోత్సహించటానికి ఆహారధాన్యాల ధరలకు ఒక కనిష్ఠమితిని నిర్ణయించాలనే సూత్రాన్ని కూడా ప్రభుత్వం అంగీకరించిందని మరొక వార్త తెలుపుతోంది.

రెండవ పంచవర్ష ప్రణాళిక క్రింద జరిగిన పనిని, జరుగనున్న పనిని సమీక్షిస్తూ ప్లానింగ్ సంఘం ప్రచురించిన పుస్తకం 47 వ పేజీలో ఇలా ఉంది:

'మొదటి ప్రణాళికలో 85 లక్షల ఎకరాలను సాగుచెయ్యాలని లక్ష్యం నిర్ణయించబడగా, 68 లక్షల ఎకరాలకే నీటిపారుదల ఏర్పాట్లు సిద్ధంచేయబడినాయి. అయితే నిజంగా సాగయినభూమి నలభైలక్షల ఎకరాల చిల్లరమాత్రమే."

18 లక్షల ఎకరాలకు సిద్ధంగాఉన్న నీటి ఏర్పాట్లను ఉపయోగించుకోనే లేదని ప్లానింగ్ సంఘం తెలిపింది.

ప్లానింగ్ సంఘం తాలూకు సలహాదార్లు ఇంత భారీయేర్పాట్లను ఎందుకు ఉపయోగించుకోలేదో పరిశీలించేందుకు పర్యటన చేసి ప్రభుత్వానికి నివేదికలు సమర్పించారు. శ్రీ ఎమ్. ఎస్. శివరామన్ (ఐ. సి. ఎస్.) బీహారు పరిస్థితులను ఇలా సమీక్షించారు:—

బీహారులో

మొదటి ప్రణాళికా కాలంలోని స్కీముల క్రింద 8 లక్షల 62 వేల ఎకరాల భూమిని సేద్యం చేయటానికి నీటివసతులు సిదంచేయబడినవి. ఇంత భూమిలోనూ 1957-58 సం॥ లో సాగైనభూమి 4 లక్షల 49 వేల ఎకరాలు మాత్రమే. మొదటి అంచనాల ప్రకారం ఒక్కొక్క గొట్టపు బావిక్రింద 100 ఎకరాల్లో ఖరీఫ్ పంట, 200 ఎకరాల్లో రాబీ పంట, 100 ఎకరాల్లో వేసగిపంట పండించవచ్చునని అనుకున్నారు. అందుచేత ఉత్తర బీహారులో 1 లక్ష, 80 వేల ఎకరాలు, దక్షిణ బీహారులో 1 లక్ష, 98 వేల ఎకరాలు సాగుచేయవచ్చునని అనుకున్నారు. కాని నేటివరకూ సాగైనది ఉత్తర బీహారులో అనుకున్న దానిలో నూటికి 30 వంతులు, దక్షిణ బీహారులో 60 వంతులు మాత్రమే. 2 లక్షల 17 వేల ఎకరాలువృథాగా ఉండిపోయాయన్నమాట."

1957 లో తాను కొన్ని సూచనలు చేశానని, వాటిని అనుసరించినట్లయితే పరిస్థితి బాగుపడేదనీ, రాష్ట్రప్రభుత్వం వాటిని అంగీకరించటమైతే అంగీకరించింది గాని అనుసరించలేదని శ్రీ శివరామన్ అన్నారు.

మధ్యప్రదేశ్‌లో

మధ్యప్రదేశ్ పై నివేదికలో శ్రీ ఎమ్. ఆర్. భిడే (ఐ. సి. ఎస్) ఇలా అన్నారు:

"భోపాల్ ప్రాంతంలో చాలా భూమిని సాగుచేయటానికి వీలైన నీటి వసతులున్నాయి. కాని సాగైనది చూస్తే చాలా తక్కువ. అక్కడి రైతు చీకటి పడింతరవాత నీరు వాడుకోడు. బోదికాలవలుతవ్వుకోటానికి ముందుకు రాడు. మహాకోసలలో కూడా నీరు పొలంనుంచిపొలానికి పావలసిందేతప్ప రైతులుబోదికాలవలుతవ్వుకోరు. బోదె కాలవలు తవ్వుకుని తీరాలని రైతును నిర్బంధించే శాసనమేదీ రాష్ట్రంలో ఇంతవరకూ లేదు. అదీ గాక నీరు వాడుకుంటేనే రైతులు నీటి తీరువ చెల్లింస్తారు. లేకపోతే లేదు. నీటి పారుదల ఏర్పాట్లు ఉన్నందుకుగాను శిస్తు చెల్లించాలనే నిర్బంధమేమీ లేదు

ఉత్తర ప్రదేశ్‌లో

ఉత్తర ప్రదేశ్ పై నివేదికలో శ్రీ శివరామన్ ఇలా వ్రాశారు:

"అధికారులతోనూ, రైతులతోనూ మాట్లాడి చూశాను. నీటివసతులను రైతులెందుకు ఉపయోగించుకోవటంలేదంటే, బోలెడు కారణాలు చెప్పుకొచ్చారు. మైలు పొడుగున ఇటికలతో కట్టిన కాలవ అంతబాగా పనికిరావటంలేదనీ. మరొక మైలు పొడుగున ఇటికెలగట్లు కడితే బాగా ఉపయోగిస్తుందనీ చెప్పారు. అందుచేత ఒక వెయ్యి గొట్టపు బావులకు, అదనంగా మరొక మైలు పొడుగున ఇటికెలగట్లు కట్టటానికి 77 లక్షల 45 వేల రూ.ల ఖర్చుతో మరొక స్కీమును తయారు చేశారు."

పశ్చిమ బెంగాల్‌లో

పశ్చిమ బెంగాల్ పై నివేదికలో శ్రీ శివరామన్ ఇలా వ్రాశారు. నిర్బంధంగా నీటి తీరువను వసూలుచేసే పద్ధతి లేకపోవటం వల్లనే నీటి వినియోగం తగ్గిపోయిందని దామోదర్ లోయ కార్పొరేషను అధికారులు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులుకూడా అభిప్రాయపడ్డారు. బోదె కాలవలను తవ్వుకోవలసిన బాధ్యత రైతులదేనని నేను ముఖ్యమంత్రితో చర్చలు జరుపుతున్నప్పుడు సూచించారు. పశ్చిమబెంగాల్ పంచాయతీ శాసనం ప్రకారం ఈ బాధ్యతను పంచాతీలకు అప్పగించటానికి వీలున్నది."

ఒరిస్సాలో

ఒరిస్సాపై ఈయన ఇలా అన్నారు.

"ఒరిస్సా నీటివసతుల బిల్లు ఇప్పుడు రాష్ట్ర శాసనసభ పరిశీలనలో ఉన్నది. దీని ప్రకారం బోదెకాలవలను పంచాయితీలు త్రవ్వించలేకపోయినప్పుడే కాదు, ఎప్పుడవసరమనిపిస్తే అప్పుడలా తవ్వించే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వమే స్వీకరించుతోంది."

లిన్‌లిత్‌గో ప్రభువు వైస్రాయిగా ఉన్న కాలంలో ప్రారంభమైన అధికాహారోత్పత్తి ఉద్యమం కథలో పైన ఉదహరించినది ఒక ప్రకరణం. ఈ కథలో ఇంకొక పాత్ర కమ్యూనిటీ అభివృద్ధి సంస్థ. అయినప్పుడు, ఉపాధ్యాయుల, విద్యార్థుల, వలంటీర్ల "మెరుపుదళాల" ఆవశ్యకత ఎందుకు కలిగిందో పరమాత్ముడికే ఎరుక!

దేశంలో ఆహారం బాగా పండించాలనే ఉత్సాహం రాష్ట్రప్రభుత్వాలకూ, రైతులకూ ఎంచేత లేదో కారణాలు కనుక్కుందామనే జిజ్ఞాస ఎవరికీ లేకపోవడం శోచనీయం.

శాసనాలు చేసో, ధరలను కంట్రోలు చేసో ఏదో విధంగా రకరకాల పంటలను క్రమబద్ధం చెయ్యాలనే ప్రయత్నం ఇంతవరకూ జరగలేదు. బ్రిటిష్ హయాంలో, ఆహారం పంటలను ప్రోత్సహించేందుకుగాను జనుముపంటను అదుపుచేసి క్రమబద్ధం చేశారు. వేరుసెనగ, చెరుకులాంటి వ్యాపారపుపంటలను కూడా అలాగే అదుపు చేయటానికి ఎందుకు ప్రయత్నం జరగలేదో తెలియదు. ఏవో రాజకీయకారణాలు పెట్టుకుని చెరకు ధరలను విపరీతంగా పెరగ

(56 వ పేజీ చూడండి)

ఆంధ్రసచిత్రవారపత్రిక
బాలల సంఘం

ఆంధ్ర సచిత్ర వారపత్రికలో 1958 జులై 1-వ తేదీ నుంచి 'బాలలసంఘం' స్థాపించాము. జులై 1-వ తేదీ నాటికి 15 సంవత్సరాలవయస్సు నిండని, ఐదేళ్ళ వయస్సుకు తక్కువ గాని ప్రతి తెలుగుబాలుడూ, బాలికా సభ్యత్వం పొందవచ్చు. సభ్యత్వానికి రుసుమేమీ చెల్లించవలసిన పనిలేదు. తెలుగు బాలబాలికలందరూ వెంటనే సభ్యులుగా చేరి సచిత్ర వారపత్రిక అప్పుడప్పుడు నిర్వహించే చిన్న చిన్న పోటీలలో పాల్గొని "సంఘం" ఆశయాలను జయప్రదం చేయడానికి సహాయపడతారని ఆశిస్తున్నాము.

గమనిక

పదకొండు మొదలు 15 సంవత్సరాలవరకూ వయస్సుగలవారిని 'A' వర్గంగానూ, ఆరు మొదలు 10 సంవత్సరాల వయస్సువరకూ గల వారిని 'B' వర్గంగానూ విభజించడం జరుగుతుంది

ముఖ్య విషయాలు

సభ్యులుగా చేరదలచిన బాలబాలికలు చేయవలసిందొకటే. దీనితోపాటు ఒక సభ్యత్వపు దరఖాస్తును ముద్రిస్తున్నాము. అందులోని ఖాళీస్థలాలను మీ వివరాలతో జాగ్రత్తగా నింపి (కొట్టివేతలు, తుడుపులు వుండకూడదు.) ఆ అచ్చు దరఖాస్తును తిన్నగా కత్తిరించి కవరులో:

సంపాదకుడు,
ఆంధ్ర పత్రిక సచిత్రవారపత్రిక,
తంబుచెట్టివీథి, మద్రాసు-1.

అనే చిరునామాకు పంపాలి. కవరుమీద వెనకవైపు "సచిత్ర వారపత్రిక బాలల సంఘం" అని స్పష్టంగా వ్రాయాలి. మామూలు కాగితాలమీద వ్రాసిపంపే దరఖాస్తులను స్వీకరించము.

ఒక్కొక్క దరఖాస్తుమీదా ఒక్కొక సభ్యుని, లేదా; సభ్యురాలి పేరుమాత్రమే వుండాలి. సభ్యత్వపు దరఖాస్తును సచిత్ర వారపత్రికలో సాధ్యమైనంతవరకు వారం వారం ప్రచురిస్తుంటాము.

సభ్యులుగా చేర్చుకున్నట్లు ఒక్కొకరి పేరా విడివిడిగా ఒక్కొక సభ్యత్వపు కార్డును పంపుతాము. ఆకార్డుమీద సభ్యత్వ క్రమాన్ని సూచించే ఒక సంఖ్య వుంటుంది. ముందు ముందు సభ్యులుగాని, సంఘంగాని జరిపే ఉత్తర ప్రత్యుత్తరాలలో ఆసంఖ్యను ఉదహరిస్తూండడం జరుగుతుంది.

పదిహేనేళ్ళ వయస్సుపడి కృతి కాగానే, ఆతేదీతో బాలల సంఘంలో సభ్యత్వం దానంతటదే రద్దయిపోతుంది.

లక్ష్యాలు

(1) సభ్యులుగాచేరే బాలబాలికలను ఆరుమొదలు పదేళ్ళవరకూ ఒక వర్గంగానూ (B), పదకొండు మొదలు పదిహేనేళ్ళవరకూమరొకవర్గంగానూ (A), విభజించిఉభయ వర్గాలకూ విడివిడిగా అప్పుడప్పుడు రెండురకాల పోటీలు నిర్వహించి ప్రథమశ్రేణిలో నెగ్గేవారికి మాకుతోచిన బహుమతుల నివ్వడం. (ఈ విషయంలో పోటీనిర్వహణకర్తలదే తుదినిర్ణయం)

(2) సభ్యులలో వారివయస్సుకు తగినట్లుగా రచనాశక్తినీ, పఠనాశక్తినీ, కళాభిమానాన్నీ యథాశక్తి పెంపొందచేయడం.

(3) చిత్రలేఖనం, నృత్యం, అభినయం, గాత్రం వీణ, వయొలిన్ మొదలయిన లలితకళలలోనూ, వ్యాయామక్రీడలలోనూ ప్రత్యేక అభిరుచీ, ప్రవేశం కనబరిచే బాలబాలికలను బహుమతులద్వారానూ తదితర విధంగానూ ప్రోత్సహించడం.

(4) ఏ ప్రాంతంలో నివసిస్తున్నవారైనప్పటికీ తెలుగు బాలబాలికలందరిమధ్యా స్నేహ సమైక్యభావాలను పెంపొందజేయడం.

(5) ఉన్నత పాఠశాలలలో చదివే విద్యార్థులకు ఉచిత విద్యార్థివేతనాలను బహూకరించడం. (దీనికి సంబంధించిన వివరాలను ముందుముందు ప్రకటిస్తాము.) ★

ఆంధ్ర సచిత్ర వారపత్రిక
బాలల సంఘం
[సభ్యత్వపు దరఖాస్తు]

GROUP
A లేక **B**

సభ్యుని (సభ్యురాలి) పూర్తిపేరు (విడివిడి అక్షరాలలో) ....

ఏండ్లు : నెలలు :

పుట్టినతేదీ. నెల, సంవత్సరం : జులై 1 నాటికి వయస్సు ....

తండ్రి. లేక. సంరక్షకుని పూర్తి పేరు : ....

ఊరిపేరు, జిల్లా, తాలూకా, పోస్టు [వీథి: నెంబరు] ....

* చదువుతున్న తరగతి. లేక. ఫారము ; ....

పాఠశాల పేరు ....

ప్రధానోపాధ్యాయునిపేరు (తెలిస్తే) ;

ఆర్యా :

ఆంధ్ర సచిత్ర వారపత్రిక బాలల సంఘములో నన్ను సభ్యునిగా/సభ్యురాలుగా చేర్చుకొన ప్రార్థన. పైన వ్రాసిన విషయాలన్నీ యదార్థములు.

ఇట్లు

[తేదీ : -1958]

(సంతకము)

* సరా : ఏ పాఠశాలలోనూగాక ఇంటివద్దనే ట్యూషన్ చెప్పించుకొనే బాలబాలికలు కూడా సభ్యులుగా చేరవచ్చు. 'చదువుతున్న తరగతి' అనే విషయానికి ఎదురుగా 'ప్రైవేట్ స్టడీ' అని వ్రాయాలి.

సంచిక: **27-8-58** | ఈ దరఖాస్తు **30-8-58** నాటికి పూర్తి వూకు చేరాలి

★ కొందరు సభ్యుల పేర్లు ★

[ఆంధ్ర సచిత్రవారపత్రిక బాలలసంఘంలో సభ్యులుగా చేరినవారిలో మరికొందరి పేర్లను ఇక్కడ ప్రచురిస్తున్నాము.]

1. శంకర్ (నిర్మల్, ఆదిలాబాద్ జిల్లా) 2. పసలి క్రిష్ణమూర్తి (మద్రాసు) 3. కటారి రంగస్వామి (నందికొట్కూరు, కర్నూలుజిల్లా) 4. తూముశేటి బాలక్రిష్ణన్ శేషగిరి (కర్నూలు) 5. కె. శివమూర్తి (మద్దికెర, కర్నూలుజిల్లా) 6. పప్పు భోగేశ్వరరావు (ధవళేశ్వరం తూ. గో. జిల్లా) 7. గొట్టుముక్కల లక్ష్మీనారాయణరాజు (కొవ్వాడ ప. గో. జిల్లా) 8. కాజా రాజ్యలక్ష్మి (మూల్పూరు, గుంటూరుజిల్లా) 9. అవ్వారి వెంకటరత్నం (తెనాలి, గుంటూరుజిల్లా) 10. కొంపల్లి గౌరీశంకర్ (ఒంగోలు, గుంటూరుజిల్లా) 11. పఠాన్ ఖాదర్ ఖాన్ (దుగ్గిరాల, గుంటూరుజిల్లా) 12. చెవూరి కనకమాణిక్యమ్మ (పెనుగొండ ప. గో జిల్లా) 13. గోపు అండాళ్లు (విజయవాడ) 14. చావలి వెంకటచైనులు (కాకినాడ) 15. వల్లూరి రాంబాబు (కాకినాడ) 16. శిష్ట్లా సుబ్రహ్మణ్యం (గుడివాడ, క్రిష్ణాజిల్లా) 17. దేవు విజయలక్ష్మి (విజయవాడ) 18. బొమ్మిడి నిర్మల (ఇనగుదురుపేట, క్రిష్ణాజిల్లా) 19. తాళూరి నాగమాలి (జగ్గయ్యపేట, క్రిష్ణాజిల్లా) 20. బంగారు హరనాధ్ (రాజమండ్రి)

21. ప్రయాగ గృహలక్ష్మి (రాజోలు తూ. గో. జిల్లా) 22. డొంకాడ విద్యాసాగర్ బాబు (పెద్దాపురం తూ. గో. జిల్లా) 23. రాళ్ళపల్లి వెంకటరమణ (విజయవాడ) 24. గొల్లపూడి చినతిరుపతి (ధర్మవరం, అనంతపురంజిల్లా) 25. ధూళిపాళ శ్రీనివాస విజయలక్ష్మీప్రసాద్ (చిలకలూరిపేట, గుంటూరుజిల్లా) 26. మధుర లక్ష్మీనారాయణశాస్త్రి (కొత్తపేట, తూ॥ గో॥ జిల్లా) 27. కూరపాటి స్నేహలతాదేవి (అనకాపల్లి, విశాఖజిల్లా) 28. మంచిరాజు కమల (కుమారదేవం, ప॥ గో॥) 29. దేగులపాడు పాటీలు లోకనాధరెడ్డి (అనంతపురం) 30. బొల్లా హేమకుమారిదేవి (మందూరు, గుంటూరుజిల్లా) 31. ఆమంచి మనోరమ (రాజోలు, తూ॥ గో॥ జిల్లా) 32. ఏ. సీతారామశర్మ (తాడిపత్రి, అనంతపురంజిల్లా) 33. జవంగుల నాగరత్నం (గుంటూరు) 34. నాగళ్ళ ఉషారాణి (మునిపల్లె, గుంటూరుజిల్లా) 35. అల్లాడి విశ్వేశ్వరరావు (రాజమండ్రి) 36. ఉద్దగిరి ప్రభాకరరావు (కొల్లేరు ప॥ గో॥ జిల్లా) 37. ఈమని సత్యవతి (ఒంగోలు, గుంటూరుజిల్లా) 38. గట్టుపల్లి సీతారామరావు (మసులాలాపేట, నెల్లూరుజిల్లా) 39. కస్తూరి వెంకుబాబు (ఇంటూరు, గుంటూరుజిల్లా) 40. పశాసేని శేషశాయి (సంథిపూడి తూ॥ గో॥ జిల్లా)

41. కె. శ్యామల రుక్మిణి (చింతలపాడు కృష్ణా జిల్లా) 42. నాగుబోయన ఆంజనేయులు (రావినూతల, గుంటూరుజిల్లా) 43. మందలపు ఝాన్సీభాయి (లబ్బీపేట, కృష్ణాజిల్లా) 44. ఘండికోట లక్ష్మీనారాయణ దీక్షితులు (తణుకు, ప॥ గో॥ జిల్లా) 44. మాదిరెడ్డిజగన్నాధరావు వుయ్యూరు(కృష్ణాజిల్లా) 45. మాగంటి వేదవతి (విజయవాడ) 46. ప్రగడ సత్యనారాయణ (బూరగాం, శ్రీకాకుళం జిల్లా) 47. యల్లాప్రగడ అప్పాజీ (రేపల్లె) 48. సాగిరాజు కమల (నిడదవోలు ప. గో. జిల్లా) 49. మల్లాప్రగడ సరోజనీదేవి (చోడవరం విశాఖజిల్లా) 50. ఎస్. రామమోహన్ (కడప) 51. చెన్నుభొట్ల కళ్యాణి (తుని తూ.గో. జిల్లా) 52. మామిడిపూడి జయంతి (సికింద్రాబాదు) 53. జి. శేషాంబ (అమలాపురం తూ. గో. జిల్లా) 54 ఆవంచ వెంకట నరసింహారావు (హైదరాబాదు) 55. వంగూరి చిట్టెంరాజు (కాకినాడ) 56. పగడాల ప్రభాకరరావు (ఒంగోలు గుంటూరుజిల్లా) 57. జి. అన్నపూర్ణ (విశాఖపట్నం) 58. లంక ఆంజనేయ విజయ (తెనాలి గుంటూరు జిల్లా) 59. వండూరి కృష్ణప్రసాద్ (మద్రాసు) 60. బంగారు కృష్ణప్రసాదు (పాలకొల్లు ప. గో. జిల్లా.)

61. అంబటిపూడి కమలాదేవి (మద్రాసు) 62. వేదుల రామాబాయి (కలకత్తా) 63. కుప్పిలి దుర్గాప్రసాదరావు పట్నాయక్ (యానాంపేట, శ్రీకాకుళం జిల్లా) 64. జగతాలమ్మకు (కొవ్వూరు ప. గో. జిల్లా) 65. వందివాడ నాగేంద్రనాద్ (మచిలీపట్నం) 66. తటవర్తి గురునాధరావు (విశాఖపట్నం) 67. చొప్పకట్ల శ్రీరామమూర్తి (నిజామాబాదు) 68. నలితం మోహన్‌రావు (మరాడం శ్రీకాకుళంజిల్లా) 69. పి. అంజనీదేవి (మొగలిచర్ల, వరంగల్ జిల్లా) 70. పుచ్చా చాణుక్య (విజయవాడ) 71. చెలూరు సత్యనారాయణ (సూళ్లూరుపేట) 72. ఎస్. యి. రాజకుమారి (పుత్తూరు, చిత్తూరుజిల్లా) 73. పి. రమణారెడ్డి (క్రిష్ణాజీగూడెం, వరంగల్ జిల్లా) 74. గారపాటి సతీ అనసూయ (తాడిపర్రు ప. గో. జిల్లా) 75. తామవరపు సూర్యప్రకాశరావు (ఓలేరు, గుంటూరుజిల్లా) 76. తమిరి సత్యశేషగిరిరావు (పెద్దాపురం, తూ. గో. జిల్లా) 77. అనంతి వరపన్న (హైదరాబాదు) 78 డి. రామిరెడ్డి (నందికొట్కూరు, కర్నూలుజిల్లా) 79. యు. రామదాసు (గుంటూరు) 80. వి. భవానీదేవి (చిత్తూరు).

81. మేకల సుబ్బారావు (ఉప్పులూరు, క్రిష్ణాజిల్లా) 82. కిలారిసంపత్ గౌరీదేవి (విజయవాడ) 83. కస్తూరి ప్రమీలారాణి (తెనాలి, గుంటూరుజిల్లా) 84. సోమంచి హరగోపాల్ (అత్తిలి, ప. గో. జిల్లా) 85. మైనంపాటి రామమోహన్ (విజయవాడ) 86. యలమర్తి శివసత్యానంద ప్రసాద్ (రాజమండ్రి) 87. కోనూరి రమాదేవి (ఘాగ్గవరం, క్రిష్ణాజిల్లా) 88. తొగరపు నరశింహమూర్తి (చింతలపూడి ప. గో. జిల్లా) 89. జోస్యుల శారద (ఖర్గపురం, మిద్నాపూర్ జిల్లా బీహారు) 90. ముడుంబి రామానుజాచారి (రాజమండ్రి) 91. వై. విజయభాస్కరరెడ్డి (కోవెలకుంట్ల కర్నూలుజిల్లా) 92. తమ్మన పల్లయ్య (కాకినాడ) 93. ఏడిద వెంకట శశిలక్ష్మి (విజయవాడ) 94. పర్వతం వరలక్ష్మి (డిప్పకాయలపాడు ప. గో. జిల్లా) 95. తురిమెళ్ల సత్యవతి (రాయఘుడ ఒరిస్సా) 96 గబ్బిలు వెంకటరమణమూర్తి (కొవ్వూరు ప. గో. జిల్లా) 97. ఫీతింరాజు వెంకటేశ్వరరావు (మోపర్రు కృష్ణాజిల్లా) 98. కృత్తివెంటి సత్యక్రిష్ణ (విజయవాడ) 99. సీతింరాజు రాజగోపాల్ (షాదీనగర్ మహబూబ్‌నగరంజిల్లా) 100 ధూళిపాళ సీతారామారావు (పెదదేవం ప. గో. జిల్లా)

101. అట్లూరి సరళ (ముదినేపల్లి క్రిష్ణాజిల్లా) 102. గొట్టాపు రామమోహన్‌రావు (భీమడోలు ప. గో. జిల్లా) 103. మేడా వెంకట కుసుమకుమారి (గంగానమ్మపేట గుంటూరుజిల్లా) 104. శేఖమూరి గోపాల క్రిష్ణమూర్తి (గుడివాడ క్రిష్ణాజిల్లా) 105. కె. క్రిష్ణయ్యగుప్త (మహబూబ్‌నగర్) 106 కె. సత్యనారాయణ (నందికొట్కూరు కర్నూలుజిల్లా) 107. ఎస్. తిమ్మారెడ్డి (గూడూరు కర్నూలు జిల్లా) 108. సజ్జా కమలకుమారి (మద్దూరు క్రిష్ణాజిల్లా) 109. పి. ఆదినారాయణ్ (తిరుపతి చిత్తూరుజిల్లా) 110. రాంబార్కి సత్యనారాయణ (బొబ్బిలి, శ్రీకాకుళంజిల్లా) 111. ఎస్ శివాజీ (కొండాపురం శ్రీకాకుళంజిల్లా) 112 పాలుగుళ్ల భాస్కరరెడ్డి (వరవ కర్నూలుజిల్లా) 113 వి. మురళీధరం (నంద్యాల కర్నూలు జిల్లా) 114. ఎస్ సీతమ్మ (గూడూరు, కర్నూలుజిల్లా) 115. శ్రీపతి విమలకుమారి (అత్తిమాంజేరిపేట, తిరుత్తణి) 116. తెన్నేటి మైధిలీదేవి (విజయవాడ) 117. జామిర్ల నరశింహదాసు (కలకత్తా) 118. ఎస్ వీరాస్వామి (నెల్లూరు) 119. పలికిల

రామబాయి (జంషెడ్‌పూర్, బీహారు) 120. చతుర్వేదుల లక్ష్మీవర్ధని (నార్తురాజుపాళెం నెల్లూరుజిల్లా)

121. పుట్టగుంట వెంకటేశ్వరరావు (విజయపురినారు. నల్లగొండజిల్లా) 122. టి. ప్రమీలాదేవి (చీరాల, గుంటూరుజిల్లా) 123. అవ్వారి రాజరాజేశ్వరిదేవి (బెల్లంకొండ, గుంటూరుజిల్లా) 124. తటవర్తి వెంకటరమణి భాస్కరభవాన్లు (ధవళేశ్వరం,తూ. గో. జిల్లా) 125. ముప్పన దుర్గాప్రసాద్ (పెద్దాపురం తూ. గో. జిల్లా) 126. వెంపటి స్వరాజ్యబాల (భీమవరం ప. గో. జిల్లా) 127. శ్రీ దంతులూరి బుచ్చిబాబు (తుంపాల. విశాఖజిల్లా)128. కొప్పినీడి వీర. వెంకట సత్యనారాయణ (రాజమండ్రి) 129. దోనేపూడి శరత్‌కుమార్ (తెలుగురావు పాలెం (క్రిష్ణాజిల్లా) 130. మన్నె అరుణశ్రీ (గండిగుంట, క్రిష్ణాజిల్లా) 131. గడియారం సుశీలాదేవి (పామర్రు కృష్ణాజిల్లా) 132. నందుల పరంజ్యోతి (రాజమండ్రి) 136. కొత్తపల్లి రవికుమార్ (కొవ్వూరు, ప॥ గో) 134. వేలూరి సుమతి (చిరివాడ, కృష్ణాజిల్లా) 135. ఏ. బాలీశ్వరయ్య (కొల్లాపూర్, మహబూబ్‌నగర్ జిల్లా) 136. తాడికొండ ఛాయా జయశ్రీ (ఉండి, ప॥ గో॥ జిల్లా) 131. ఈమని శౌరకుమార్ (సికింద్రాబాదు) 138. పిన్నంరాజు నరసింహం (తెనాలి, గుంటూరుజిల్లా) 139. యెరుబండి సూర్యప్రభావతి (ఈదరాడ తూ. గో. జిల్లా) 140. బందరు సీతారామ చెన్నకేశవరావు (మచిలీపట్నం)


141. జరుబుల సీతారావమ్మ (సంతరావూరు, గుంటూరుజిలా) 142. మామిడన్న సత్యలక్ష్మి (భీమవరం. ప. గో. జిల్లా) 143. మామిడన్న వెంకట లక్ష్మీనరసింహం (భీమవరం ప. గో. జిల్లా) 144. నూనె రంగనాయకులు (గుంటూరు) 145. కె. సంపత్ కుమార్ (కరీంనగర్) 146. అనుబోలు బలరామచౌదరి (ముద్దినాయనపల్లి అనంతపురంజిల్లా) 147. ఖాకిరాల అరుణకుమార్ (హన్మకొండ వరంగల్ జిల్లా) 158. కొప్పుల ఆనందరాణి (గొల్లప్రోలు, తూ. గో. జిల్లా) 149. డి. అరుణలత (మచిలీపట్నం) 150. బొగ్గవరపు చినపున్నయ్య (ఉప్పులపాడు, గుంటూరుజిల్లా) 161. గంటి మదనమోహన్ (కాకినాడ) 152. తెన్నేటి కమలాకరరావు (పోరంకి(క్రిష్ణాజిల్లా)153. రామినేని పద్మావతి తోట్లపాలెం, గుంటూరు జిల్లా) 154 సి. వి. పి. సత్యప్రకాష్ (హైదరాబాదు) 155. దద్దాల అమల నాయకమ్మ (బొమ్మిడి, ప. గో. జిల్లా) 156. టి. ఉషారాణి(మద్రాసు) 157. పట్నాయకుని రామాంజనేయులు (పాలకొండ శ్రీకాకుళం జిల్లా) 158. యర్రమిల్లి సత్యేంద్రనాథ్ (అగిరపల్లి కృష్ణాజిల్లా) 159. నాయన వరలక్ష్మి (పాయకరావుపేట, విశాఖజిల్లా) 160. వాడ్రేవు పాపయ్య పంతులు (రాజోలు, తూ. గో. జిల్లా)

161. సెదాన అప్పలస్వామి (సాలూరు, (శ్రీకాకుళంజిల్లా) 162. హోతా ప్రభావతి (మదనపలి) 163 చావలి అంజనలక్ష్మి కామేశ్వరి (సికింద్రాబాదు) 164. దండమూడి సుభాస్ చంద్రబోస్ (కపిలేశ్వరపురం కృష్ణాజిలా) 165. ఆవాల సింహాచలం (సాలూరు శ్రీకాకుళంజిల్లా) 166 యాసెన గుంట్ల శంభూప్రసాద్ (నరసరావుపేట, గుంటూరుజిల్లా) 167, కలిగొట్ల కుసుమ కుమారి (ధవళేశ్వరం, తూ. గో. జిల్లా) 168 గుర్రం పవిత్ర (ఒంగోలు గుంటూరు జిల్లా) 169. గూడూరు బసవరాజు (వేణివీరాపురం బళ్లారిజిల్లా) 170. రెంటచింతల మురళీకృష్ణ (మద్రాసు) 171 ఆలా ఆంజనేయులు (యేడుగుండపాడు) గుంటూరు జిల్లా) 172 బి. రామచంద్రారెడ్డి (భూమయగరిపల్లి, కడపజిల్లా) 173. కొ...గారి శివరామప్రసాద్ (వల్లటూరు గుంటూరుజిల్లా) 174. ఎమ్. వి. బి. ఎన్. ప్రభాకర (వలపర్ల, గుంటూరు జిల్లా) 175. దేవరకొండ సత్యశంకర్ (తణుకు, ప. గో. జిల్లా)

176. కృత్తివెంటి బాలాకుమారి (భీమవరం ప. గో. జిల్లా) 177. బి. వేదవల్లి (తెనాలి, గుంటూరుజిల్లా) 178. జి. నారాయణ (కామారెడ్డి, నిజామాబాద్ జిల్లా) 179. హెచ్. రామచంద్రరావు (కామారెడ్డి, నిజామాబాద్ జిల్లా) 180. పి. నరసింహారెడ్డి (కామారెడ్డి, నిజామాబాద్ జిల్లా.)

181. వారణాసి హరిహరనాథ్ (పొన్నూరు, గుంటూరుజిల్లా) 182. శిరం వెంకటసత్యసూర్యనారాయణ (కాకినాడ) 183. పెడికొండల సదాకృపాళీబాయి (మచిలీపట్నం) 184. దేశిరాజు సంపూర్ణ లక్ష్మీనరసమ్మ (చేబ్రోలు, గుంటూరుజిల్లా) 185. జి. వి. ఎల్. ఎన్. దివాకరరావు పట్నాయక్ (రాజమండ్రి) 186. మీనుగ సుబ్బలక్ష్మమ్మ (చంద్రగిరి, కడపజిల్లా) 187. లింగముల సూర్యకుమారి (కాకినాడ) 188. పాటూరి శ్రీరామ వెంకటసత్యనారాయణ (రాజమండ్రి) 189. సుబ్బుకనకరాజు

(55-వ పేజీ చూడండి)



అనుభూతుల నీడలు

మన జీవితంలో కొన్ని కొన్ని సంఘటనలు బలవత్తరమైన ప్రభావాలను వదిలిపెట్టి భూతకాలపు తెరల వెనుకకు నిష్క్రమిస్తాయి. అలాటి ప్రభావాలు మన మనస్సులో అనుభవరూపంలో శాశ్వతంగా జ్ఞాపకం ఉంటాయి. ఒకరి అనుభూతి మరొకరికి సామాన్యంగానే కనిపించవచ్చు. అదే యింకొకరి జీవితంలో అనుభవానికి వచ్చినప్పుడు దానికి ప్రాధాన్య మిస్తారు.

కొన్ని సంవత్సరాలక్రిందట నా విద్యార్థి జీవితంలో జరిగిన ఒక సంఘటనవల్ల నేను పొందిన అనుభూతి మీ కందరికీ సామాన్యంగానే కనిపిస్తుంది. కాని అదే మీ జీవితాలలో కలిగినప్పుడు...?

* * *

కాలం: మూడు సంవత్సరాల భూతకాలం.

సమయం: మిట్ట మధ్యాహ్నం.

అట్టే జనసంచారం లేదు. బస్సుకోసం నిరీక్షిస్తున్నాను. నల్లటి తారురోడ్డుమీద తారు కరిగి, దానిమీద సూర్యరశ్మిపడి వింత రంగుల్ని సృజిస్తోంది. ఎండ తీవ్రత భరించలేక రావిచెట్టుమీద కాకి అప్పుడప్పుడు తడి ఆరిన గొంతుతో బాధగా, బద్ధకంగా అరుస్తోంది. దూరంనుంచి రెండెడ్ల బళ్లు వస్తున్నట్లు ఎడ్ల మెడపట్టీల మువ్వల శ్రావ్యనాదం సూచిస్తోంది. రాబోయే వేసవికాలానికి నాందిగా అవతరించిన యీ విచిత్ర ప్రకృతిని తిలకిస్తూ, మత్తుగా నిలుచున్నాను.

పరస్పర విజిగీషతో ఏదో కనిపించని దానికోసం శ్రమ నెరుగక పరుగులెత్తే యీ ప్రపంచం నిశ్శబ్దంగా, స్తబ్ధతతో నిద్రపోతోంది యీ మధ్యాహ్న సమయంలో.

ఈ ఆలోచనల్లో నే నుండగా, సన్నని గొంతు వెనుకనుంచి పిలిచింది "సార్..."

ప. గోపీచంద్

మత్తుగా నిద్రపోయే మహారాజుగారిని వైతాళికులు పాడి నిద్రలేపినట్లు, యీ పిలుపు నన్ను జాగ్రదవస్థలోనికి మరో ప్రపంచంనుంచి యీ లోకానికి ఆహ్వానించింది.

బద్ధకంగా, వొళ్ళు విరుచుకొని వెనక్కి తిరిగి చూశాను. ఓ ఎనిమిదేళ్ల అమ్మాయి చిరిగిపోయిన పావడలోనుంచి, మాసిపోయిన కాయితం పేలిక ముందుకుచాచింది. అప్రయత్నంగా అందుకున్నాను. అర్థమైంది. ఆ కాగితం ఆమె హృదయసర్వస్వ నివేదిక! ఆ అమ్మాయి కళ్ళ నీడల్లోకి పరిశీలనగా చూశాను. లోకం సరిగా అర్థంకాని ఆ పసిపిల్ల బాధగా నావైపుచూసి, తల వొంచుకుంది. నన్ను సరిగా తలఎత్తి చూడలేని ఆమెను నేను పరిశీలనగా చూడడం యిష్టం లేక నేలచూపులు చూస్తూ మెల్లిగా అడిగాను

"ఏం చదువుతున్నావమ్మా?"

ఏదో అస్పష్టంగా గొణిగింది. ఆ గొంతు రోజుల తరబడి ఉపవాసాలు చేస్తేగాని వినిపించని హీనస్వరం.

"మరి ఇవాళ బడికి వెళ్లలేదేం?"

ఇదొక తెలివితక్కువ ప్రశ్న. కార్యానికి కారణం తెలిసికూడా వేసిన అనాలోచిత ప్రశ్న! ఆమె సమాధానం ముందే నాకు తెలుసు.

ఆ అమ్మాయి ఒకసారి తల ఎత్తి, నావైపు కొంచెం తీక్షణంగా చూసి, ముఖం కిందికి దించేసుకుని వణుకుతున్న గొంతుతో పొడిగా అంది.

"జీతం కట్టలేదు సార్. పేరు తీసేశారు."

నాలాగ అడిగిన ఎందరికో మామూలుగా, అలవాటుగా జవాబు చెప్పినట్లే నాకుకూడా చెప్పింది. ఇంక పనికిరాని ప్రశ్నలతో ఆ పసి మనస్సును వేధించడం యిష్టంలేక, డబ్బు ఆ అమ్మాయి చేతిలో పెట్టి బస్సువస్తే యింటికి వచ్చేశాను.

ఆ వేళ కాలేజీకి వెళ్లలేదు.

ఆ సాయంత్రం మా రామం వచ్చాడు మా యింటికి. ప్రొద్దుటి సంఘటన వాడితో చెప్పాలనుకున్నా, చెప్పలేదు. కారణం ముందే మీకు చెప్పాను. "ఒకరి అనుభూతి మరొకరికి సామాన్యంగానే కనిపించవచ్చు. అదేయింకొకరి జీవితంలో అనుభవానికి వచ్చినప్పుడు దానికి ప్రాధాన్యమిస్తారు." ఈ సత్యమే నాకు వాగ్బంధం చేసింది. ఒకవేళ చెప్పినా యీ కథ రామం హేళనకు పాత్రమౌతుందన్నది నిజం. సానుభూతిని కోరి నేను చెప్పే యీ సంఘటన సులభంగా ఒక హేళనతో వాడు కొట్టిపారెయ్యడం నాకిష్టంలేదు.

"ఇలాటి వ్యక్తులు సంఘానికి చీడపురుగులు. వీటికోసం కోటివిద్యలు వీళ్ళకు బాగా తెలుసు. చదువుపేరుతో డబ్బుదండుకొని పొట్టపోసుకుంటుంటారు. నీలాటివాళ్లు వీళ్ల జిత్తులకు లొంగిపోయి డబ్బునీ, మనస్సుని పాడుచేసుకోడమే చివరకు మిగిలేది... కాబట్టి నువ్వు..." ఈ ధోరణిలో వాడు సలహాలాటి ఉపన్యాస మిస్తాడు. అది నాకు రుచించదు. అందుకే చెప్పడం విరమించుకున్నాను.

తెలవారి పోయాక మళ్ళీ యీ వూరు వచ్చాను. సాయంత్రం అలా వెళ్తుంటే ఏదో పరిచితమైన గొంతు నన్ను ఆపివేసింది వెనక్కి తిరిగి చూశాను. మళ్లీ ఆ అమ్మాయే! చాలా కృశించిపోయింది. బాగా పొడుగైంది. పుట్టినప్పటినుంచీ దారిద్ర్యం, కష్టాలు ఆమె జీవితాన్ని నివాసంగా చేసుకోడంవల్ల మొహంలో దైన్యం ముద్రవేసుకుని కూర్చుంది. బెదురుతూ, బెదురుతూ నన్ను చూసి కాయితం ముందుకు చాచింది. మునుపటి కాయితం బాగా శిథిలావస్థలో వుండడంవల్ల! దాన్ని ఒక పలచటి అట్టమీద అతికించింది. దానిమీద పెన్సిలురాత చెరిగిపోయి అక్షరాలు అస్పష్టంగా వున్నాయి. ఆమె నన్ను గుర్తించలేదు ఔను. ఆ పసిజీవితంలో ఆమెకు నాలాటివాళ్ళెందరు తటస్థపడ్డారో! వారి తిట్లనీ, నిందల్నీ, తిరస్కారాల్నీ, హేళనలనూ సహించడం అలవాటు చేసుకుంది. ఆ లేతవయస్సులోనే జీవితానుభూతులు ఆమెను లోకజ్ఞానంవైపు దారితీస్తున్నాయి. జాలిగా చూశాను. భయం ఆ విశాలనేత్రాల్లో లాస్యం చేసింది. నిట్టూర్చాను.

“స్కూల్లో చేరావా అమ్మా?”

లేదని తల వూపింది. కారణం కోసం అన్వేషించడం అనవసరం.

“మీ యిల్లెక్కడ?”

అడగాల్సిన ప్రశ్నలు ఏమీ లేనప్పుడూ, త్వరగా తట్టనప్పుడూ మనం మామూలుగా వేసే అనవసర ప్రశ్నలలో ఇది వొకటి! దూరంగా మినుకు మినుకు మని గుడిదీపాలు వెలిగే గుడిసెల వంక వేలు చూపింది. అటు పంవైతా దట్టంగా పొగమంచు కమ్ముకుంది. అందులో ఆ అమ్మాయి ఇల్లు ఏదో స్పష్టంగా నాకు తెలియలేదు.

“మీ నాన్న కేం పని?”

కొంచెం సేపు మొహం దించుకొని,

“నాన్న లేడు” అని బరువుగా అంది. లోతైన బావిలో మొయ్యలేనంత పెద్ద బండరాయిని దొర్లిస్తే ఆ అగాథంలో నుంచి మనకు వినిపించే ఒక విధమైన గంభీర ధ్వని వంటిది ఆమె సమాధానం. నేను బాధపడ్డాను. ఆమె పసిమనస్సును గత విషాద సంఘటనలవైపు సింహావలోకనం చేయించానని పశ్చాత్తాప పడ్డాను. నిశ్శబ్దాన్ని భేదిస్తూ ఆమె అంది:

“మా అమ్మా, అక్కా నేనూ వుంటున్నాం. మా అక్కకి చాలా జబ్బుగా వుంది మందుకోసం డాక్టరు దగ్గరికి వెళ్తే, డబ్బివ్వనిదే మందివ్వనన్నారు. కార్పొరేషన్ ఆస్పత్రిలో మందిచ్చారు. కాని దానివల్ల ప్రయోజనం కనిపించలేదు.” ఆపింది. ఉన్నట్టుండి, కట్టలు త్రెంచుకున్న ప్రవాహంలాగ బావురుమని ఏడుస్తూ,

“సార్, మా అమ్మ కనక చచ్చిపోతే మాగతి ఏమిటి సార్?” అంది. అదే! ఈ ఆలోచనే నాకు తట్టలేదు. ఔను, నిజమే!

“ఏమిటి”? అని నా హృదయం మళ్ళీ నన్నే ప్రశ్నించింది.

ఆమె వెక్కి వెక్కి ఏడుస్తూ,

“మా నాన్న చేసిన అప్పులకి, బాకీదార్లు మొన్న వచ్చి పెద్ద అలరిచేసి మా టైలరింగ్ మెషీను తీసుకుపోయారు. ఇంతకాలం అదే మాకు ఆధారం. ఇంక మాగతి ఏమిటి? దీనితో మా అమ్మ మరీ బెంగపడిపోయింది. మా అక్క ఎప్పుడూ దిగులుగా వుంటోంది.”

పాపం! తన మనస్సులో చెలరేగే క్షోభనంతా అప్పుడికి నివేదించినట్లు చనవుగా ఒక ముక్కూ, మొహం తెలియని అపరిచితునితో చెప్పుకుంటోంది! ఆమె బాధను అర్థం చేసుకోగలిగినా అసమర్థుణ్ని! కొన్ని కొన్ని విషయాలు మనకి బాగా అర్థమౌతాయి. అవి సత్వరపరిష్కారానికి ప్రేరేపిస్తాయి మన మనస్సుని. అయినా మనం వాటి పరిష్కారానికి పూనుకోం. బద్ధకిస్తాము. ఈ దౌర్బల్యం నా పేదతికి కారణం. ఏదో జ్ఞాపకం వచ్చినట్లు, ఆ అమ్మాయి భుజంమీద చెయ్యివేసి,


“పద, మీయింటికి వస్తాను” అన్నాను.

ఆమె ఆశ్చర్యచకిత అయింది. ఆమె సంకోచాన్ని దూరం చేస్తూ,

“పాపం, మీ అమ్మ ఎలావుందో. ఆలస్యం చెయ్యకు. పద” అన్నాను ఆత్మీయతతో.

ఆ అమ్మాయి లేడిలాగ పరిగెత్తింది. ఆమెవెనుక తలవంచుకొని నడుస్తున్నాను. సందచీకటి అలుముకుంటోంది. గుడిసెలు సమీపించకొద్దీ పొగమంచు దూరదూరాలకు గాలిలో కరిగిపోతున్నట్టు కనిపిస్తోంది. అక్కడక్కడ బండికాడనుంచి తాత్కాలికంగా విముక్తిపొందిన ఎద్దులు బరువుగా, సంతోషంగా, స్వేచ్ఛతో వదిలే నిశ్వాసం ‘బుస్సు’ మని వినిపిస్తోంది. దూరంగా కొత్తవాళ్ళను దబాయించే అధికారస్వరంతో కుక్కల మొరుగూ, ఎక్కడిదో ఏదో కీచుగొంతు పాడే పాతకాలపు పాటా అస్పష్టముగా వినవస్తున్నది. ఆ అమ్మాయి ఒక గుడిసెలోకి దారితీసింది, అలవాటుగా ఎన్నో మలుపులు తిరుగుతూ. ఇంట్లోకి వెళ్ళబోతూ నావైపు బెదురుతూ, బెదురుతూ చూసింది. అడుగులో అడుగు వేసుకుంటూ లోపలికి వెళ్ళి నిల్చున్నాను. అంతా కటిక చీకటి. చిన్న గుడ్డిదీపం, అంత్యకాలం సమీపించే జీవిలాగ వెలగలేక వెలుగుతోంది. కటిక నేలమీద చావుబ్రతుకులతో ద్వంద్వయుద్ధం చేస్తున్న రోగి బాధగా మూలుగుతూ పడివుంది. ఆ అమ్మాయి వాళ్ళ అమ్మకాళ్ల దగ్గర చతికిలబడి, తల్లివైపు ఆందోళనగా చూస్తోంది. ఒక చీకటి మూలలో స్త్రీవంటి ఆకారం జుట్టు విరబోసుకొని నిలబడి వుండడం చూసి, హఠాత్తుగా ‘కెవ్వు’మని అరవబోయాను. నా భయాన్ని కనిపెట్టి, ఆ అమ్మాయి ‘అరవకద్దు’ని చేతితో సంజ్ఞ చేసింది. మధ్యమధ్య

ఆరోజుల్లో ఇలా జరిగివుంటే... (2)



“రాజకుమారు డేమవుతాడు? బ్రహ్మరాక్షసిని సంహరిస్తాడా? రాజకుమారిని చేబడతాడా?...మిగతా కథ వచ్చేఏడాది చదవండి...”

★ అనుభూతుల నీడలు ★

కోగి మాట్లాడే సంధిపేలాపన సంఘంలోని వాలాటి అసమర్థులకు పెట్టే శాపవాక్యాలో లేకపోతే తన మానసిక వేదనను భాషా రూపంలో వ్యక్తంచెయ్యలేక అలాగ తెలుపుతోందో. చాలాసేపు నిర్ణయించుకోలేక, ఆలోచన మానివేసి శిలావిగ్రహంలాగ నిలబడ్డాను. తరవాత, చాలాసేపు అయాక ఏదో తప్పుచేసి, శాపం తగిలివానిర్లక్ష్యంగా నవ్వుకుంటూ రంగంనుంచి నిష్క్రమించే పాషాణహృదయుడిలాగ బయటికి వచ్చేశాను! నా రాకపోకల్ని ఎవరూ గమనించినట్లే లేదు.

* * *

మా బంధువుల పెళ్ళినుంచి మళ్లీ యీ వూరు కొలరోజులయాక వచ్చాను. ఆ అమ్మాయినీ, ఆ యింటినీ ఎంత మరిచి పోవాలన్నా సాధ్యపడలేదు. సందడిగా పెళ్లింట్లో అందరూ కలకలలాడుతూంటే, ఏదో నేరం చేసిన అపరాధిలాగ మొహం చాటుచేసుకుని, అందర్నీ తప్పుకుంటూ తిరిగేవాణ్ని.

"ఏరా, మనస్సుని పట్నంలో వదిలిపెట్టి వచ్చావా?" అని చాలా మంది నవ్వారు. రాత్రి నిద్రపట్టనివ్వక ఆ అమ్మాయి దుఃఖిస్తూ "మా అమ్మచచ్చిపోతే మా గతి ఏమిటిసార్?" అనే గద్గద కంఠంతో నిలవేసి ప్రశ్నించేది! ఈ పెళ్ళికి వస్తే గతాన్ని మరిచిపోవచ్చుననుకున్నాను. కాని బలవత్తరమైన ప్రభావాన్ని కలిగించిన యీ సంఘటన, ప్రయత్నపూర్వకంగా తెచ్చిపెట్టుకునే నా ఆనందాన్ని ఓడించేది!

ఆ అమ్మాయి గురించి నేనెందుకు ఇంత విచారపడాలి? అని తర్కించుకునే వాణ్ని. కొన్ని కొన్ని భావాలు తర్కానికి లోబడకుండానే మన మనస్సులో పనిచేస్తూంటాయి. ఒక పెద్ద సంఘటన ఒక్కొక్కప్పుడు మనల్ని చలింపజెయ్యలేదు. కాని ఒక చిన్న సంఘటన ఒక్కొక్కప్పుడు మరచిపోలేనంత ప్రగాఢానుభూతిని మన హృదయాల్లో శాశ్వతంగా వదిలిపెట్టి గతంలోకి తప్పుకుంటుంది. మానవుడి మేధాసంపద, తార్కిక శక్తి యీ ప్రగాఢ ప్రభావాల కారణాన్ని నిర్ణయించలేవు, అందుకనే నా విషాదానికి కారణాన్ని అన్వేషించడం మానివేశాను.

ఈవూరు వచ్చినరోజే ఆత్రుతతో ఆ అమ్మాయి యింటికి బయలుదేరాను. మునిమాపు. ఆ పరిసరాలు నాకు చిరకాలంనుంచి పరిచితమైనవే! నాకు అక్కడ గుడిసెలు కనిపించలేదు! నా కాశ్చర్యం కలిగింది. ఎవరో యిద్దరు కాలవగట్టుమీద కూర్చుని వుంటే అడిగాను. రెండుమూడుసార్లు అడిగితేనేగాని చెప్పలేదు. వాళ్ళు ఎవరో ఆస్థలం కొన్నారట. అక్కడవుండే గుడిసెల వాళ్ళని ఆచోటువదిలి వెళ్ళిపోవాలని నోటీసిచ్చారట. ఆతరువాత నేనడిగే ప్రశ్నలు వాళ్ళని కాదన్నట్టు వూరుకున్నారు. అలాగ జరుగుతుందని నేననుకోలేదు. తల చేత్తో పట్టుకొని అక్కడ పడిపోయిన మొండిగోడ నానుకుని కూలబడిపోయాను. అలాగ ఎంతసేపు, వున్నానో నాకు తెలియదు. ఎగిరిపోయే ఒక గబ్బిలం కాళ్ళతో తన్ని నన్ను సమాధిలోనుంచి లేపింది. గుడ్డివెన్నెలలో ఒక ముసిలాయన నన్ను సమీపించి నా మొహంలోకి తొంగి చూశాడు.

"ఎవరు బాబూ?" అన్నాడాయన.

"నేను... నేనే!" లేచి వెళ్ళిపోబోయి, ఆగి ఆశగా అడిగాను.

"ఇక్కడ ఒక చిన్నఅమ్మాయి వుండేది ఆ అమ్మాయీ, వాళ్లూ ఏమయారు తాతా?".


ఆయన చుట్ట తాపీగా ముట్టించి అగ్గిపుల్ల వెలుతుర్లో నన్ను నిదానంగా చూసి అన్నాడు.

"వాళ్లాబాబూ, ఆ చదువుకునే పిల్లేనా? పాపం, వాళ్ళఅమ్మ పోయిందిగా. ఆపిల్లలిద్దరూ ఎక్కడికి వెళ్ళిపోయారో తెలీదు" అని వెళ్ళిపోతూ, ఏదో జ్ఞాపకం వచ్చినవాడిలాగ దారిలో ఆగి కంఠస్వరాన్ని తగ్గించి, రహస్యం చెబుతున్నట్లు అన్నాడు:

"శవాన్ని మొయ్యడానికి కూడా ఎవరూ రాలేదు పాపం, బాబూ ఇదంతా వాళ్ళ కర్మ! కర్మని అనుభవించకుండా తప్పించుకునిపోవడం శ్రీరాముడికే సాధ్యం కాలేదు"...అంటూ వేదాంతి లాగ వెళ్ళిపోయాడు.

కర్మ! కర్మ!! ప్రతి విషయాన్నీ కర్మతో ముడిపెట్టి తృప్తిపడడం ఒక దురాచారమైపోయింది. లోకంలో జరిగే అన్యాయాలకూ, అధర్మాలకూ కూడా

(49-వ పేజీ చూడండి)



(నాటకం)

ప్రఖ్యా శ్రీరామమూర్తి

(గత సంచిక తరువాయి)

రఘు : నాకు ఆకలిదహించుకుపోతోంది. మీకెలా వుందోగాని! (ట్రే టేబులుమీద పెట్టి, లోపలిగది వేపే చూస్తూ) ఓరేయ్ రంగా! ఇవాళ అమ్మగారికోసం కనిపెట్టుక్కూర్చోలేంకాని మిగతావికూడా పట్రా (వాచీచూసుకుని) అబ్బా – పదకొండూ ఇరవై అయిపోయింది!

సుజాత : (తనవాచీ చూసుకుని) పదకొం డుంబావు.

శేఖర్ : (తనవాచీచూసి) నాదాంట్లో పదకొం...

[రంగడు కాఫీపాట్, కప్పులూ సాసర్లు తెచ్చి టేబులుమీద పెడ్తాడు. వాడివెనకాలే సరళవస్తుంది. దాంట్లోంచి రవంతలక్కి జారిపోయినట్లు కొస్త నీరసంగా, సంతృప్తిగా కనిపిస్తుంది]

సరళ : (వాచీచూసుకుంటూవస్తూ) అబ్బ పదకొండూ ఇరవై అయింది. ఇంకా రాలే మీనాక్షీ గారు?

రఘు : వ్వ్...ఎక్కడికెళ్ళి వట్టబ్బా అసలిది?.. ఓ వేళ అక్కడికి వెళ్ళిందేమో...

సుజాత : ఎక్కడికి?

రఘు : వాళ్ళ సిస్టరుగారింటికి. అక్కడికి ఫోన్‌చేస్తే తెలుస్తుందిగా.

శేఖర్ : (ఆదుర్దాగా) ఎందుకూ-ఫోన్ అనవసరం.

రఘు : ఏం?

శేఖర్ : అబ్బే-ఏముందీ-ఏం లేదు...

[నిస్సహాయంగా సుజాతవంక చూస్తాడు-ఆమెముఖం పక్కకు తిప్పుకుంటుంది]

రఘు . అక్కడవుండదని నీకు ముందే తెలుసన్లేవుందే!

శేఖర్ : నాకేం తెలుసు?...పూరికే... ఈ పాటికల్లా వచ్చేస్తుందరా అని...

సరళ : (అతి తెలివిగా) లేకపోతే ఆవిడ కూడా నిన్నొదిలిపెట్టి లేచిపోయిందేమో-!

[శేఖర్ ఎగిరిపడి లేస్తాడు. రంగడు కంగారుగా లోపలికి పరుగెత్తుతాడు]

రఘు : (అదిరిపడి) what?

సరళ : (పకపకనవ్వుతూ) నాటకంలో లిల్లీలాగా! (రఘు వైపుతిరిగి) కోకూ!

రఘు : (సర్దుకుని.మందహాసంతో)ఏమిటి?

సరళ : కోకు! 'కోకు' అంటే ఫ్రెంచి భాషలో మోసపోయిన మొగుడు అని!

[సుజాత, శేఖర్ ఏంతోచక – తమ వెలవెలబాటు కనిపించనీయడానికి ధైర్యం చాలక అటూ యిటూ నడయాడుతూ ఏదో పని చేస్తుంటారు]

రఘు. (వాలుకుర్చీలో కేర్లబడి పకపక నవ్వుతూ) మైడియర్ సరళా! ఒక్క ఫ్రెంచి అనువాద నాటకంలో వేషంతోటే మొత్తం భాష, తత్వం అంతా మాస్టర్ చేశావే!

సరళ : (టేబులుమీదనుంచి రఘు వైపు వంగి అతనికేసే చూస్తూ) కో-కూ! కోకు – కో-కూ!

రఘు : (నవ్వుతూ) ఇష్ – ఊరుకో కోకిలా!

సరళ : కోకు – కోకూ! ఎంత బాగుంది! సౌండ్ కూడా ఎంత మ్యాజికల్‌గా వుందో చూడండి – కో-కు...కోకు-కోకూ!

రఘు : (లేచి ప్లేట్లు అందరి ముందు సర్దుతూ) ఇదుగో-పోయి ఏ కొమ్మమీనా ఎక్కి కూర్చోరాదూ? నీ కుహూ కుహూధ్వనివింటే ఏ బావ కైనా కొస్త ఇన్స్పిరేషనైనా వస్తుందేమో!

శేఖర్ : అవును – మెయ్యడాని! లేత మామిడిచిగుళ్ళనే గడ్డికూడా దొరుకుతుంది.

సరళ : ఏయ్—

శేఖర్ : అంహాంహాం – 'చిగురుమామిడి లోని చిన్నికోయిలైవు......'

సుజాత : (సరళ ముందుకు ఒక ప్లేటు తోస్తూ) ఏమో – నిజంగా – మీనాక్షీ నిజంగా నే...లిల్లీలాగా—నాటకంలో లాగే.........ఎవరితో నైనా—

శేఖర్ : (కలవరంతో) ఏయ్ సుజీ! ఏమిటీ...ముందూ వెనకా చూసి మాట్లాడాలి కొస్త.

సరళ : కోకు! కోకూ!

రఘు : (ఆపిల్ ముక్కలు చేతినిండా పట్టుకొని సరళవైపు చేజాచి) ద్రాక్ష పళ్ళంటే నీకిష్టమేనా రాణీ?

సరళ : (ఒక్కముక్క తీసుకుంటూ) కర్టెన్. End of Act one! మొదటి అంకం ఆఖరు! ఇతి ప్రథమాంకః!

శేఖర్ : ప్రేక్షకులు బైటికిపోతారు— బాబీ రాణీతో రొమాన్సు మొదలెడతాడా అని పరస్పరం ప్రశ్నించుకుంటూ!

[ఫలహారాలు కానిస్తూ మాట్లాడుకుంటారు].

రఘు : ఫ్రాన్స్‌లో అడుక్కుంటారేమో అలా. మనదేశంలో జనం ఇంకా అంత దిగజారిపోలేదు. అది మన సెంటిమెంట్‌కే ఎగనెస్ట్.

శేఖర్ : తుడుంచాలి సార్. ఒక చిన్న సవరణ—మనదేశంలో పైకి అనే ధైర్యం లేక అలా జరిగితే బాగుండునని ఆశిస్తూ మనసులోనే గుంజాటన పడుతూ పోతారు. సరేనా?

సరళ : ఎవళ్ళసంగతెలావున్నా నేను కవయిత్రిని. వీటన్నిటికీ అతీతంగా వుంటాను. అదీగాక అసలప్పుడు బాబీ తల్లకిందులైపోయి చాలా అన్‌హేపీ (Unhappy)గా వుంటాడు!

రఘు : ఆసంగతి నీకేం తెలుసు?

సరళ : ఏం? కాదంటావా?

రఘు : నాకు తెలీదుమరి.

సరళ : అదేమిటి—నువ్వేసిన వేషం సంగతే నీకు తెలీదా?

రఘు : ఈ రచయితలు ఏదో రాసి పారేస్తారు. రాసింతర్వాత ఏమిటండీ ఈ కారక్టరంటే వాళ్ళే Explain చెయ్యలేరు. బాబీ సంగతి చూడండి—స్క్రిప్టు ప్రకారం

మనిషిలో మనిషి

వాడు టెలిఫోన్ రిసీవరుతీసి పక్కన పెటేసి 'సగం సీరియస్ గా సగం తమాషా గా' "ద్రాక్షపళ్లంటే నీ కిష్ట మేనా రాణీ" అని అడుగుతాట్ట. దీనినిబట్టి మనిషి Unhappy గా వున్నాడని మీరనుకోవాలి. పైగా ఇంకోటి— ఆ 'సగం సీరియస్ గా సగం తమాషా గా' అనే భావం తీసుకురావడానికి నానా చావూ చచ్చి ఓగోజు రిహార్సల్లో టైచేస్తే అప్పుడు సుజాత ఏమందో తెలుసా? వాంతి వస్తోందా యేమిటి—మొహమలా పెట్టావ్ అంది!

శేఖర్ : అబ్బ పోనీండయ్యా—చచ్చీ చెడీ ఎలాగో అలా నాటకం వేసొచ్చి మన మే మన నాటకాన్ని ఆడిపోసుకోవడమా? అపని విమర్శకులకి వదిలేద్దురూ బాబూ.

సుజాత: వుండు శేఖర్—బాబీ అంటే నేను లెక్ చేస్తాను.

రఘు: థేంక్యూ సుజీ. చూశావురా శేఖర్! మనం అంటే ఈ వయసు ఆడవాళ్లకూడా ఆకర్షణే!

శేఖర్ : నువ్వుకాదు లేవోయ్_సుజాత లైక్ చేసేది బాబీని!

సుజాత : రెండూ ఒకటేలే!

రఘు :నో నో నో. అలా అనుకుంటే నువ్వు చాలా పొరబడుతున్నావన్న మాట! నిజం చెప్పాలంటే బాబీ-రాసింది రాసి నట్టుగా చూస్తే-చాలానీచపాత్ర! ఏమాత్రం ఇంటరెసింగ్ గా లేని పాత్ర అది!.

సరళ : మరి నువ్వు వేస్తే చాలా బాగుం టేది ఆ వేషం?

రఘు: సరే—ఆ సంగతి వేరు.

సరళ : అఁహాఁహా-ఆవేషంలో నువ్వు చాలా బాగున్నావ్.

సుజాత : పర్ ఫెక్ట్ గా ఫిట్ అయ్యావ్!

సరళ: తూచినట్లు! చాలా ఫాసినేటింగ్ గావుంటే!

సుజాత: కారక్టరు కూడా చాలా కన్వి న్సింగ్ గావుంది!

రఘు: No no. It is not at all a convincing character. అది వాస్తవిక తకు చాలాదూరమైన పాత్ర. వాడికి-వాడికి కాళ్లు లేవు—దమ్ముల్లేవంటాను!

సుజాత : అలా అన్నంతమాత్రాన సరి పోదే—

రఘు : అలాంటి వాణ్ణి జీవితంలో ఒఖ్ఖ ణ్ణిచూపించండి చూస్తాను! 'మనుషులూ— తల్లకిందులు కావడం' అనేది మనస్సులో పెట్టుకుని రచయిత ఏకంగా తల్లకిందులుగానే నుంచునే వ్యక్తినొకణ్ణ సృష్టిం చాడు వాడికి శారీరకంగా నెత్తిమీద బొప్పి ఒకటిపెట్టి మానసికంగా ఆర్టిస్టనీ పెర్వ ర్టనీ మసిపూసి మారేడు కాయ చేశాడు. చూడండి ఎంత కాంప్లికేటెడ్ కారకరో! పైగా వీటన్నిటికీ తోడు అతి తెలివికూడా నూ—ప్రతి సంగతీ తనకు ముందే తెలుసని!

సరళ : ఏసంగతి?

రఘు : అది ఇది అని లేదు. వాడికే ది తెలిసుండాలని రచయిత అనుకుంటే అద ల్లానూ! ఆఫస్ట్ ఆక్ట్ లోనే చూడరదూ--

శేఖర్ : ఓహ్ మైగాడ్! ఇహ కథా సంగ్రహం కూడా చెప్తావేమిటి మాకిప్పుడు?

రఘు : లిల్లీ నన్ను వదిలేసి లేచి పోతోం దని ప్రేక్షకులకు తెలుసు—కాని ఆసంగతి బాబీకి కూడా తెలుసునని వాళ్లకి తెలీదు. చివరికి తెరపడే ముందు ఆసంగతి బైటపడేసరికి...well...అక్కడ డ్రమె టిక్ ఎఫెక్ట్ బాగానే వచ్చిందనుకో...అం తవరకూ ఒప్పుకుంటాను...

[సుజాత కిసుక్కున నవ్వుతుంది—రఘు పడుతున్న గంద్రగోళానికి.]

శేఖర్ : ఇంకేమిటయ్యా నువ్వు ఒప్పు కోంది? ఏమిటీ నీ కంప్లైంట్?

రఘు : (కాస్త ఇరకాటంలో పడి-అంత లోనే నిలదొక్కుకుని) అఁహాఁ— నేనసలు చెప్పదలచుకున్నది వాడి రియాక్షన్సుగురించి

శేఖర్ : ఐనా అదేదో లైట్ ప్లే. అంత సీరియస్ గా తీసుకో నక్కర్లేదు దాన్ని.

రఘు : ప్రేక్షకులు తీసుకోనక్కరేదుసరే కాని మనం సీరియస్ గా తీసుకు తీరాలిగదా అఁ—? ఆ రియాక్షన్స్ అన్నీ కూడా చూడు ఎంత అసహజంగా వున్నాయో!

సుజాత : ఉదాహరణకి—?

రఘు : ఫస్ట్ ఆక్ట్ లో ఆ ఫేర్ వెల్ సీను వుంది చూడు—నువ్వెళ్లిపోతావ్. నువ్వు ఇంకెవడిదగ్గరకో పోతున్నట్టు నాకు తెలుసు. తెలిసికూడా నువ్వు మళ్లీ తిరిగివస్తావని నేను రాజుకు ధైర్యం చెప్పాలట! ఆ తర్వాత ఓ జలాన్ సీను! మధ్య మధ్య 'జీవితం నిజంగా ఎంత బ్యూటిఫుల్!' అని ప్రవచనాలు! ఎంత అన్నాచురల్ గా వుందో చూడండి! (సుజాత వైపు చూస్తూ) అఫ్ కోర్స్— అప్పటి దాకా నువ్వు వెళ్లిపోతున్న సంగతి నాకు తెలిసినటు ఆడియన్సుకు తెలీనుకో- కాని నాకదేం హెల్ప్ చేస్తుంది?

సరళ: (ద్రాక్షపళ్లు తింటూ) అలాంటి చోటేకదా నటుల ప్రతిభ బైటపడేది!

శేఖర్ : ఇదుగో—ఇది నీకు చాలా అతీత మయిన విషయం గాని ఆ ద్రాక్షపళ్ళ పని పూర్తిచెయ్యి, నీకెందు కొచ్చింది.

రఘు : (లేచి నెమ్మదిగా స్టేజి క్రాస్ చేస్తూ) హుఁ! ఆ ఫస్ట్ ఆక్ట్ చివర మరీ ఘోరం! తను ప్రేమించిన పిల్ల ఇంకోడితో లేచిపోయిందని తెలుసు-తెలిసి దానికి తగ్గటు రియాక్ట్ కాకపోగా ఎంత చచ్చు పెదమ్మైనా 'ద్రాక్ష పళ్లంటే నీకిష్ట మేనా?' అని అడుగుతాడా!?

సుజాత : నువ్వైతే ఏంజేస్తావ్?

రఘు : నేననే యేమిటి నువ్వైనా అంతే ఆయిల్లోరణరంగంచేస్తావ్! చేతి కందిందల్లా పట్టుకు ఛిన్నాభిన్నం చేస్తావ్!

[సుజాత, శేఖర్ క్రీగంటచూసుకుంటారు]

నీకు పిచ్చి-పిచ్చెక్కిపోతుంది!

సుజాత : ఆఁహాఁ—!?

రఘు: లేకపోతే నిజమైన మనిషి ఎవడైనా అలా వూరుకుంటాడా? వాడిలో. అగ్ని పర్వతం బద్దలవదూ? ఉద్రేకం కట్లుతెంచుకు

ప్రవహించదూ? సప్తసముద్రాలూ ఏకమై
నట్లు ఘూర్ణిల్లదూ మనిషి?...ఏం చేసినా
చెల్లుకపోయినా, ఎవడైనాఆబావి గాడిలా
తలఒగ్గి నోరుమూసుకు కూర్చుంటాడా?
ఛా...పైగా 'అదెలాగో తిరిగి వస్తుందని
నాకు తెలుసుగా' అని ఓకుంటి సాకు!
నాటకం రాసినాయన బావికి ఏదో
గ్యారంటీ బాండు రాసిచ్చినట్లు!

సుజాత: కాని నేను నిజంగానే తిరిగి
వస్తాకదా!

రఘు (తూస్కారంగా నవ్వుతూ సుజాత
తలమీద తట్టుతూ) అవును - తప్పకుండా
తిరిగొస్తావ్. అలాంటి నాటకం అది! 'అది
తిరిగొస్తుంది' అని నేనంటే వచ్చినట్లు
తిరిగొస్తావ్. లేకపోతే ఆ నాటకం అంతా
గాన్ ఫట్! మూడో అంకమే వుండదు!...
(అటు తిరిగి టెలిఫోనుకేసి వెళ్తూ) వాళ్ళకి
ఫోన్ చేసి చూస్తాను. ఇంకా మీనాక్షీ
రాకపోవడం విచిత్రంగానే వుంది...

సరళ: (ఆపిల్ కొరుక్కు తింటూ)
అవును-చూడగాచూడగా చాలా చెత్తరాత
అనిపిస్తోంది.

శేఖర్: లోపం ఎవరిదంటావ్?

సుజాత: రాసిన వాళ్ళదిమటుకు కాదు.

రఘు: వేసిన వాళ్ళ దసలే కాదు.

సరళ: నా అభిప్రాయం రాసిన వాళ్లది
కూడా కొంత వున్నదని.

శేఖర్: ఇంతకూ ఇది రాసిందెవరసలు?

సుజాత: ఆర్థర్ మెక్కీ అని...

సరళ: కాదు-ఆంద్రీ రొసీన్.

రఘు: ఇద్దరూనూ. ఆంద్రీరొసీన్
ఫ్రెంచిలో రాస్తే ఆర్థర్ మెక్కీ దీన్ని
ఇంగ్లీషులో రాశాడు.

శేఖర్: ఐతే అవ్వి కూడా చదివావేమిటి
సరళా నువ్వు?

సరళ: తెలుసులోకి వచ్చేసరికి నాపోర్షన్
శాగాకట్ అయిపోయిందేమోనని అనుమాన
మేసి అవ్వి తీసిచూశాను.

శేఖర్. ఓ! నీబాధ అదా! ఐనా నీకు
ఫ్రెంచొంవచ్చు—ఇంగ్లీషే కూడబలుక్కు
చదువుతావ్?

సరళ: నాపోర్షను బంతులు లెక్కబెట్టి
చూశాను.

రఘు: ఏమిటిది—ఇంకా రాలేదు
మీనాక్షీ...వాళ్ళకి ఫోన్ చేసి చూస్తాను.

[అంటూ ఫోన్ కేసి వెళ్తాడు.]

[సుజాత లేచి కవరు చేతిబట్టుకుని రఘు
వైపు ఓఅడుగు వేస్తుంది. శేఖర్ ఆమెను
ఆగమని చేతో సైగచేస్తాడు. సుజాత మళ్లీ
కూర్చుని కవరు తిరగేసి కాల దాస్తుంది.
ఈలోగా రఘు రిసీవరుఎత్తి ఒక నెంబరు
డయల్ చేస్తాడు—]

హలో...ఎవరు—లలితేనా? నేను రఘు
పతిని...అవునూ—మీనాక్షీగాని అక్క
డుందా?...లేదు--ఇంకా ఇంటికిరాలేదు-
థియేటర్నుంచి మీరంతాకలిసి వెళ్లారను
కుంటున్నాను...ఐతే ఎక్కడికి పోయి
వట్టిది?...(వింటూంటాడు)

శేఖర్: (సుజాతతో మెల్లిగా)లాభం
లేదు సుజీ—మనవల్ల కాదనుకుంటాను.

సుజాత: ఏసంగతీ చెప్పకుండా పోవడం
కూడా న్యాయంకాదు శేఖర్.

సరళ: మీమంత్రాంగం ఏమిటిమధ్య?

శేఖర్: ఏంలేదు.

రఘు: (ఫోన్లోకి) ఏమోమరి...అదే
అర్థంకావడంలేదు.

సుజాత: ఆఁ ఆఁ—నాకో ఐడియా
తోచింది—

సరళ: (విగరగా) ఏమిటా ఐడియా?

రఘు: (సరళకేసి చూసి) ష్—కాస్సేపు
మాట్లాడకండి ఫోను సరిగా వినిపించడం
లేదు...ఊఁ—ఏమిటి లలితా అంటు
న్నావ్?...(వింటూంటాడు)

శేఖర్: (సుజాతతో) ఏమోనబ్బా—
వాడితరహా చూస్తుంటే మనిషిని పట్టగలమా
అని నాకు భయమేస్తోంది.

[రఘు మళ్లీ వాళ్లని నిశ్శబ్దంగా వుండమని
సైగ చేస్తాడు]

సరళ: మీరు మాట్లాడుకునేదేమిటో
ఒక్కముక్క బోధపడటం లేదు నాకు.

శేఖర్: నీకు బోధపడకూడదనే మా అభి
ప్రాయం లే.

సరళ: (ఈసడింపుగా) ఓహో! అంత
అచ్చ తెలుగు మాటాడగలరనుకో లేదు లే.

రఘు: (ఫోన్లోకి)ఆల్ రైట్ థేంక్స్.
చూస్తాం ఇంకాస్సేపు. గుడ్ నైట్! (ఫోన్
దించేసివచ్చి కూర్చుంటాడు) అక్కడా లేదు
మీనాక్షీ.

సుజాత: రఘూ—సరళ చెప్పింది నిజమై
వుండగుగదా?...

రఘు: ఏమిటది?

సుజాత: మీనాక్షీ నిన్నువదిలేసి...

సరళ: కోకు! కోకూ!

రఘు: (చాలతేలిగ్గా తీసుకునినవ్వుతూ)
ఐతే దారుణమే నే!

సుజాత: ఈయిల్లు రణరంగం చేస్తావా?
చేతికందినవన్నీ చిన్నాభిన్నం చేస్తావా?

సరళ: ఆహా, అగ్నిపర్వతం బద్దలౌతుంది-

రఘు: బావిఐతే—

శేఖర్: అబ్బ—ఇహానవ్వాఆపెయ్యం
డయ్యా ఆ బావిగాడి గొడవ! కాస్సేపుమన
గొడవలు మాట్లాడుకుందాం పట్టండి.

సరళ: అవును-అవ్వైతేనే ఇంటరెస్టింగ్
వుంటాయి. (Fact is stranger than
fiction) అన్నారు చూడండి.

సుజాత: మనమిప్పుడు మాట్లాడుకుంటు
న్నది మనల్నిగురించేగా. మనం వేసే వేషా
లన్నీ మనలాంటివే!

రఘు: అంటే పెళ్లాలులేచిపోయే బావి
గాడిలాంటి మొగుళ్ళమైన్ అంటావా నేను
కూడా?

[శేఖర్, సుజాత గాబరాపడి సర్దుకుంటారు]

సుజాత: ఆఁ... (శేఖర్ వంక చూస్తూ)
అహాఁ...

రఘు: బాప్. అర్థంలేదు.

శేఖర్: అవును. అర్థంలేదు.

రఘు: మరింకా నాకూ వాడికీ పోలి
కెక్కడ?

శేఖర్: (త్వరత్వరగా) నా అభిప్రాయ
మేమిటంటే—మన తత్వాలకి సరిగ్గా విరుద్ధ
మైన వేషాలు వేస్తూంటాం మనం అని!

సరళ: అదెలా? అలాఐతే మనం
కారెక్టర్స్ కి న్యాయం ఎలా చెయ్య
గలుగుతాం?

శేఖర్: నువ్వున్నావనుకో-నువ్వు నాస్త
వానికి కవికాదు-కాని నీకన్నో అ...

మనిషిలో మనిషి

లున్నాయి ... వాటిల్లో కవిత్వం ఒకటి కావచ్చు-అందుకనే నాటకంలో కవయిత్రిగా బాగా రాణించ గలిగావ్!

సరళ : నేను రియల్‌గా కవినికాదని ఎవరు చెప్పారు నీకు? నేను ఆశువుగా చెప్పిన ప్రణయగీతాలూ విరహగేయాలూ నువ్వెప్పుడైనా విన్నావా? అదీగాక స్టేజి మీద నేచేస్తున్నది వేరు—నేచర్ అంతా తరిచి తరిచి ఆర్టు అంతా స్టడీచేసి గ్రహించిన నిగ్గు స్టేజిమీద ప్రదర్శిస్తాను.

సుజాత : చూశావా మరి—ఆర్ట్ ఎలా వున్నా ముందు నీ ప్రకృతి కూడా నీకు సహాకరించింది. నువ్వు నిక్కే స్టేజిమీద నటించుకున్నావ్. అలాగే రఘు కూడానూ!

రఘు : This is absolute nonsense నువ్వు చెప్పేదాంట్లో ఏం అర్థం లేదు. బాబీ చాలా Weak character. ఏదో లోకల్ ట్రెయిన్‌లో ఎవరో వృద్ధ రసికురాలు వాడికి చక్కిలిగింతలు పెట్టిందనుకో అప్పుడు బాబీ ధైర్యం చేసి దానికాలు చితక తొక్కగలడా? వాడేదో కలలుగంటూ కూర్చునేవాడు-లేదా భయపడి అంతకుముందు స్టేషనులోనే దిగిపోయేవాడు! అంతేగాని అంత ధైర్యం చేసి—

సుజాత : ఎగ్జాక్ట్‌లీ! బాబీ వెనక్కు తిరిగి ఆమనిషి ముఖంలోకి ధైర్యంగా చూస్తూ ఏమిటీ నీ వుద్దేశం? అని ధైర్యంగా అడగలేదు. దాంతో పోట్లాట పెట్టుకుని దానిపరువు తీసే సాహసం అతనికిలేదు. నలుగురూ తన వంక చూస్తారని బెదురు! నలుగురూ నవ్వి పోతారని భయం! ఇక గత్యంతరం లేక అసమర్థ దౌర్జన్యంతో దొంగపోటుగా దానికాలు తొక్కుతాడు!

సరళ : అవును సరిగ్గా అదే బాబీ తరహా!

సరళ : ఐతే మటుకేం కసి తీర్చుకోడం కదా ప్రధానం?

సుజాత : తీరిందా కసి?...తన స్నేహితురాలు-తనదగ్గర పనిచేసే మనిషి-పై పెచ్చు తను మనసారా ప్రేమించేపిల్ల లిల్లీమనసు అర్థం చేసుకోలేక అందుకోసం పెద్ద పద్మవ్యూహమంత ప్లాను వేసి తన పెళ్ళికబురు ప్రపంచానికంతకూ చాటించి చివరికి బోర్లపడ్డ బాబీలాగే ఈయన కూడా వొద్దు వొద్దను కుంటూనే నలుగురికళ్ళల్లోపడి నలుగురి చేతా చివాట్లుతిని చివరికి కోర్టులో ఫైను కూడా వేయించుకున్నాడు పిచ్చి మాలోకం!

సరళ : అవును పాపం-ఖర్మకొద్దీ!

రఘు : (చిన్నగా నవ్వి, మందహాసం చేస్తూ

(42-వ పేజీ చూడండి)

కళ్యాణరాత్రి

ఉదయం ఇంకా అయిదైనా కాలేదు. దూరాన దూదేకుల సాయిబుగాడుకు చేస్తున్న నమాజుసాధన, చలిని చీల్చుకొని వచ్చి చెవుల్లో విద్యుత్తులా గుచ్చుకుంటోంది. మధ్య మధ్య ఒక్కొక్క కోడి మాత్రం 'కొక్కొరోకో' అని అరుస్తోంది. ముందు ఇంటి ముసలమ్మ వీధిలో పేడనీళ్లు చల్లుతూ కోడల్ని పేరుపెట్టి పిలుస్తోంది. గోపాలానికి తిరిగి నిద్రపట్టడం లేదుగాని, లేవాలనీ లేదు. రాత్రి పన్నెండు వరకూ కూతురిపెళ్ళి విషయం భార్యతో వాదించాడు. ఆమె ఎంత చెప్పినా ఆ సైకిలు షాపు సుబ్బారాయుడికి పససేమిరా యివ్వనన్నాడు. ఆమెకు బుద్ధిచెబుతాననిఉదయమే బెంగుళూరు ప్రయాణం పెట్టుకున్నాడు. అటుపిమ్మట ప్రక్కలోని పిల్లవాడు ఏడ్చి ఏడ్చి ఏ రెండింటికో పడుకోనిచ్చాడు. వాని యేడ్పు అప్పుడేనా ఆదమరచి నిద్ర పోదామా అనుకుంటే, ఆమనుకు కాస్తా సాయిబు గోడుకు నమాజు సాధనతో చెడి పూరుకుంది. గోపాలం నిజానికి శాంత స్వభావం గలవాడు కాబట్టే తన దుర దృష్టానికి ఇతరులను కర్తలుగా చేయలేదు. అతడు ఆలోచనా రహితుడై అలాగే పడుకున్నాడు. పెరటిలోని కొబ్బరి ఆకుల సందుల్లోంచి గాలిరివ్వుమని దూసుకుపోతూంది. మేష్టారు సీతారామయ్య సముద్రంలో స్నానంచేసి వచ్చి, సంధ్యావందనం గట్టిగా వల్లిస్తూ ఆదారిన పోతున్నాడు.

గోపాలం లేచి కూర్చున్నాడు, చిటికె వేసి ఆవులించాడు. ఒక్కసారి ఒళ్లువిరుచుకుని, ప్రక్కలోని చిరుగులకంబళి కుర్రవాడికి కప్పి, సన్నగా భార్యని పేరుపెట్టి పిలిచాడు. అప్పటికే ఆమె స్నానం కూడా ముగించి మండుతూన్న పొయ్యిముందు జుట్టు విడదీసుకుంటూ 'మేలుకొలుపులు' పాడుకుంటూంది. గోపాలం వంటిల్లు సమీపించి, "మాడు వెళ్ళబోయేది చెల్లెలి యింటికి చెయ్యబోయేది రాచకార్యం. ఈ వేళ కాఫీ దానికి అనుగుణ్యంగా వుండాలి. ఇదిగో అయిదు నిముషాలలో వస్తున్నాను" అని నిష్క్రమించాడు. అతడు తిరిగి వచ్చేసరికి గృహలక్ష్మి ఓ తవ్వెడు కమ్మటికాఫీ గ్లాసులో పెట్టివుంచింది. గోపాలం దాన్ని గడగడా త్రాగి, తేల్చి, చేపాటికర్ర చంకన పెట్టుకొని, సంచీ చేతికి తగిలించుకుని రోడ్డు ఎక్కాడో లేదో, బస్సు సిద్ధంగా వుంది. గోపాలం ఎక్కడమే తడవు దుమ్ము రేపుతూ బస్సు కదిలింది.

గోపాలం చెల్లెలు రాజమ్మని చూసి ఎనిమిదేళ్లయింది. పెళ్లి అయిన తర్వాత ఆమె తిరిగి ఇక్కడకు రాలేదు. తాను అంత కన్నా పోలేదు. ఏం దగ్గర ప్రయాణాలా ఇప్పుడెక్కితే ఇంకోగంటకి దిగడానికి? బెంగుళూ రెక్కడ-బెండమూర్లంక ఎక్కడ?

జయంతి శ్రీరామమూర్తి

ఆపైన ఆమెకు అక్కడ జరిగినట్లు ఇక్కడ జరుగుతుందా? "ఇదీ ఒకందుకు మంచిదే, నా దారిద్ర్యాన్ని చూసే అవకాశం ఆమెకు కలగలేదు" అనుకున్నాడు గోపాలం. ఈనాడంటే తానిలా అపోయియాడు గాని తమదీ ఒకప్పుడు బ్రతికిన సంసారమే. అందుకనే 'నా' అన్నవాళ్లెవరూ లేకపోయినా, వున్న రెండెకరాలూ అమ్మేసి రాజమ్మ పెళ్ళి దూమ్‌ధామ్‌గానే చేశాడు గోపాలం.

రైలు గుంతకల్లు దాటి క్షణ క్షణానికీ బెంగుళూరికి దగ్గర పడుతూంది. గోపాలం పై బెర్తులో కాళ్లుచాపుకు పడుకున్నాడే గాని నిద్ర అన్నది దగ్గరకు రావడంలేదు. ఇంక ఒక్కరాత్రి!! తెల్లవారితే రాజమ్మని చూడవచ్చు. చిన్నప్పుడు చిలిపి చేష్టలు చేసిన రాజమ్మ. తాటి ముంజెలకు మారాం చేసి తన ఒడలంతా రక్క వేసిన రాజమ్మ. అన్నట్లు బెంగుళూరులో తాటి ముంజెలు దొరుకుతాయా? ఆమె ఈనాడు లక్షాధికారి భార్య. బెంగుళూరు వెళ్ళివచ్చిన తన మిత్రులందరూ ఆమె సౌభాగ్యాన్ని ఎంతో పొగిడారు. విశాలమైన భవంతి, కార్లు, వంటవాడు, నౌకర్లు, చాకర్లు...రాజమ్మ వెకటిలా వుందో, లేదో? ఎలా వుంటుంది. ఇప్పుడామె ఇద్దరు పిల్లల తల్లి, తనంత సవతి కొడుకు, పాపం, రెండో పెళ్లివాడి కిచ్చి తాను చెల్లెలి గొంతుకోయ్యలేదు గదా! లేదు, రామయ్య యేమంత ముసలివాడూ, ముడికివాడూ కాదు. గోపాలం బుర్రలో మళ్ళీ ఒక సందేహం పొడచూపింది. తన కూతురిపెళ్ళి రాజమ్మ సవతి కొడుకుతో చెయ్యాలని గదా తనకోరిక! ఇది సాధ్యమవుతుందా? తానేం కట్నమియ్యగలడు? అలాయిచ్చే స్తోమతువుంటే ఇంతదూరం ప్రయాణమెందుకు? మళ్ళీ అతనికి సుబ్బారాయుడు జ్ఞాపకం వచ్చాడు. అయితే అతడూ వయసుకు చిన్నవాడేగాని చేసేవృత్తి సైకిలుషాపు. ఇలాంటివృత్తి తన యింటా వంటాలేదు. అందుకే కుర్రదీ, కుర్రదాని తల్లీ వొప్పుకున్నా, తాను వొప్పుకోలేదు. గోపాలం ఒక్కసారి తల ఝాడించాడు.

"ఏమిటీ భ్రమ? కుర్రది నాకూతురు, అంటే రాజమ్మకి సాక్షాత్తూ మేనకోడలు. కుర్రవాడామె కుమారుడు. రాజమ్మ లక్షాధికారిణి కావచ్చు. కాని మొదట నాచెల్లెలు గదా! తన మేనకోడలంటే ఆమెకంత బాధ్యత వుండదా? ఏది ఏమైనా ఈ సంబంధం రైటు చేసి తీరుతాను" అనుకున్నాడు గోపాలం.

బెంగుళూరులో రైలు దిగగానే సంచీ చేతికి తగిలించుకుని జట్కాలో ఎక్కి కూర్చున్నాడు గోపాలం. రాజమ్మని చూడాలనే తహతహ అతని తొందరచేస్తూ వుంది. తిన్నగా "శంకరపురం, నాలుగో క్రాసు" అన్నాడెల్లాగో. జట్కా టకటకా పడుస్తూపోతూంది. బాలభానుని స్వర్ణకాంతిలో వేలాది జనం తమదే నందిన చరిత్ర లకు అటూ యిటూ యంత్రాల్లాగా నడచి



అతి సౌందర్య తిలకంగా నుండుటకు
ఆకర్షణీయమైన సౌందర్య వికాసముతో మనోహరముగా
పొద్దు పుచ్చుడు. సంవత్సరాంతమున్ను సంతృప్తిగాను,
చల్లగాను, పరిశుభ్రంగాను ఉండుటకు. చర్మమును
పోషించునట్టిది, పౌడరు ఆధారమునకు దివ్యమైనట్టిది
యగు "'హేజ్‌లైన్' స్నో" ను ఉపయోగించుడు.
ఇది చోర-నిరోధక సీలుతో ప్యాక్ చేయబడి వచ్చుచున్నది.
"'HAZELINE' SNOW"
(TRADE MARK)
"'హేజ్‌లైన్' స్నో" (ట్రేడ్ మార్కు)
బరోస్ వెల్‌కమ్ ప్రాడక్ట్

★ కళ్యాణతార ★

పోతున్నారు. వాళ్లలో చాలామంది చిర పరిచితులలాగ కనుపించారు. గోపాలం బహుశా వాళ్లని కలలో చూసివుంటాడు! జీవితంలో ఒక్కొక్కప్పుడు ఏది నిజమో, ఏది స్వప్నమో తేల్చుకోవడం కష్టం. నిజానికి గోపాలం జీవితం అంతే. జట్కా వచ్చి ఒక విశాలభవనం ముందు ఆగేవరకూ గోపాలం అలాగే కలలు కంటున్నాడు. అందమైన గేటు ప్రక్కన చలువరాతిపలకపై "రాజ్యలక్ష్మీనిలయం" అన్న అక్షరాలు అతనిదృష్టిని ఆకర్షించాయి. నిజానికి రాజమ్మయిల్లు ఇంతపెద్దదని అతనికి తెలియదు. జట్కా వెళిపోయింది. గేటు ప్రక్కన అటూయిటూ పచారు చేస్తున్నాడేగాని లోనికి వెళ్లడానికి ధైర్యం చాలలేదు గోపాలానికి. ఆఖరికి ఎలాగో తెగించి లోపల అడుగు పెట్టబోయేసరికి "ఎవరు మీరు?" అన్నాడు గూర్ఖావాడు.

"నేను మీ అయ్యగారి బావమరిదిని" ...గోపాలం. "ఏమిటి నిదర్శనం? కార్డువుందా?" అన్నాడు గేటుకీపరు. గోపాలానికి తలకొట్టివేసినట్లయింది. అతగాడితో ఎలా వాదించడం? బహుశా తన యజమాని బావమరిదికి కూడా కారువుండి తీరాలని అతని వూహ కాబోలు! అటువంటి పరిస్థితులలో "ఏం పరీక్షిస్తున్నావురా భగవంతుడా" అని ఒక్కసారి ఉసూరన్నాడు. ఇంతలో దేవుడే పంపినట్లు ఓ బిస్కటురంగు కారు లోపల ప్రవేశించడమూ, కాపలావాడు సలాం పెట్టడమూ జరిగింది. గోపాలం ఒకసారి "బావగారూ!" అని అరుస్తూ లోనికి పరుగెత్తాడు కారు వెంబడి.

గోపాలానికి ఆయింట్లో స్వాగతం బాగా జరిగిందని చెప్పాలి. అతనికి ప్రత్యేకంగా మేడమీద గది బసగా యిచ్చారు. అన్నివేళలా ఇద్దరు మనుషులు అతనికేం కావాలో పని కట్టుకు చూస్తుండేవారు. నిజానికి వాళ్లు అస్తమానం తనను కనిపెట్టుకు వుండడం నచ్చలేదు గోపాలానికి. తాను వచ్చిన పని చేసుకు పోవాలనివుంది. కాని, రాజమ్మ దర్శనం దొరకడం కష్టంగావుంది. ఆమె ఉదయం భర్తప్రక్కన కనుపించిందే గాని చిరునవ్వు విసిరి వూరుకుంది. యోగక్షేమాలు బావగారే ప్రశ్నించేరు.

సాయంకాలం అతడు నిద్ర లేచేసరికి కాఫీ ట్రేలోవచ్చి టేబిలుమీద వుంది. అతడు లేచి బట్టమార్చుకుని, "మీ అమ్మగారు క్రిందవున్నారా?" అన్నాడు పనిమనిషితో.

"లేరు. అయ్యగారితో పార్టీకి వెళ్లారు" అని జవాబు.

గోపాలం తిరిగి ప్రశ్నించలేదు. కాఫీ త్రాగి వరండాలో అటూ యిటూ పచారు చేస్తుండగా డ్రైవరు వచ్చి "మిమ్మల్ని ఊరంతా త్రిప్పమన్నారు అయ్యగారు. కారు సిద్ధంగావుంది, రండి" అన్నాడు. గోపాలం మనసు కారులో కూర్చున్న తరువాతకూడా స్థిమితపడలేదు. రెక్కలు కట్టేసిన పక్షిలా, బందాలు బిగించిన పశువులా, సంకెళ్ళుపడ్డ ఖైదీలా బాధపడుతున్నాడు. అతని బుర్రలో కూతురు పెళ్ళి విషయం కరుడుగట్టి వుంది. ఆ విషయం రాజమ్మతో సంప్రతిస్తేగాని తేలదు. కాని రాజమ్మ పూర్తిగా మారిపోయింది. ఇప్పుడామె వెనకటి మనిషి కాదు, సమాజపు ఉన్నత శ్రేణిలో సభ్యతా, అభిజాత్యమూ కలిసి పెట్టిన ఒరవడిలో నడిచే వనిత. "ఆమె జీవితంలో వికట వినోదాలకీ, కుటుంబ ప్రేమల పాలపొంగులకీ స్థానం లేదు. ఎంత పరివర్తన? దినమల్లా గదిలో పడివున్న నన్ను ఒక్కసారి అయినా చూడరాలేదు," అనుకున్నాడు అన్నగారు.

రాత్రిభోజనం చేసి మేడ ఎక్కేముందు వంటవాణ్ణి "మీఅయ్యగారు ఎప్పుడొస్తారు" అన్నాడు.

"ఎవరికి తెలుసు?" పదికావచ్చు, పన్నెండు కావచ్చు. వెళ్ళినది గొప్పవారియింటికిగదా! అక్కడికి మంత్రులూవాళ్ళూ వస్తారు" అన్నాడతడు. గోపాలం పైకిఎక్కి మంచంమీద వ్రాలాడు. ఆమంచం స్ప్రింగులు అతనిని పైకీ, క్రిందికీ వూపుతున్నాయి. గోపాలానికి తనయింటిలోని కుక్కిమంచం జ్ఞాపకం వచ్చింది. రక్తం ఒకటైనా అదృష్టయోగంలో తనకీ చెల్లెలికీ ఎంత భేదం? తానే గనక ఆ రెండెకరాలూ అమ్మి కట్నం ఇవ్వకపోతే రాజమ్మ ఈ మేడఎక్కేదా? తన మతిభ్రమణానికి తానే నవ్వుకున్నాడు గోపాలం. లేచి పైనున్న గాలి పంఖా కట్టివేశాడు. అతన్ని కలవరపెటిన చిక్కల్లా ఒక్కటే "ఎలాగమ్మా అమ్మాయిని ఈయింట చేర్చగలను?"

పెద్దకారువచ్చి పోర్టికోలో ఆగేసరికి గోపాలం ఇంకా మేలుకొనేవున్నాడు. దొంగచాటున పైనుండి చూస్తున్నాడు. రాజమ్మ, భర్తా ఠీవిగా కారుదిగి లోనికినడచారు. పనివాళ్లు అలజడిగా నలువైపులా తిరుగుతున్నారు. భార్యాభర్తలు వెళ్ళి పెరట్లో వేసిన పడకకుర్చీలలో వ్రాలారు. గోపాలం ఇదేసమయమని క్రిందికిదిగాడు. అతన్ని చూసీ చూడగానే బావ "రావయ్యా మహాశయా! పాపం, నీతో మాట్లాడలేకపోతున్నాం. ఏదో ఈ పెళ్ళిసంబంధం గొడవలో ఊపిరిపీల్చేందుకుకూడా టైము లేదు" అన్నాడు.

"పెళ్ళిసంబంధమా? ఎవరికి—"

"ఇంకెవరికి, మావాడికే"అంది రాజమ్మ.

"ఇప్పుడే చూసివచ్చామయ్యా! పిల్ల రంభలావుంది మంత్రిగారి మేనత్త మనుమరాలు. ఒక్కతేపిల్ల. రెండువందల ఎకరాలకి అధికారిణి ఏనాటికైనా" అన్నాడామె భర్త. గోపాలానికి ఏమీ వినాలని లేదు. తానువచ్చినపని అటో, యిటో తేలి బుర్ర తేలికయింది.

"మావాడికేంగాని, కమలా ఈపాటికి ఎదిగివుంటుంది. ఏమన్నా చూస్తున్నావా లేదా?" అంది చెల్లెలు.

"ఏదో" అని చప్పరించాడు గోపాలం.

"ఇంకో రెండువేలు ఎక్కువయినా కాస్త మంచిసంబంధమే చెయ్యవయ్యా" అన్నాడు బావ. గోపాలానికి ఈ వృధా ధర్మోపదేశాలు వినాలని లేదు. వెంటనే నిద్ర వస్తోందని పైకివెళ్ళిపోయాడు.

మరునాటి ఉదయమే గోపాలం తిరుగు ప్రయాణం పెట్టేశాడు. వాళ్లు ఇంకా వుండమన్నా అతడువినలేదు. నిప్పుకీ నీళ్ళకీ కలయిక లేదని తేల్చేసుకున్నాడు. నీళ్ళకి దూరంగావుంటేనే నిప్పు ప్రకాశిస్తుంది! మూడోరోజు పన్నెండుగంటలకు గోపాలం స్వగ్రామపు పొలిమేరల్లో అడుగుపెట్టాడు. ఎందుకో అద్భుతవాతావరణమంతా మారిపోయి కోమలంగా కనిపించింది. అలా కాస్సేపు సైకిలుషాపులోకూర్చుని, తిరిగి యింటివైపు నడకసాగించాడు. అంతవేగం తిరిగివచ్చిన గోపాలాన్ని చూసి, ఆశ్చర్యపడి భార్య "ఏం-సంబంధం స్థిరంచేసివచ్చారా" అంది ఆత్రంతో.

"ఆహా! మనం ఇక పెళ్ళిపనులు మొదలు పెట్టవచ్చు. ఒక్కమాట సుమా! నేను రైటు చేసినది సైకిలుషాపు సుబ్బారాయుడు సంబంధం," అని అరుగుమీద చిటికెలపడ్డాడు గోపాలం. లోనుండివింటున్న కమల అమాయికపుకళ్లు ఆనందంతో మిలమిలలాడాయి. ★

విలువలు



జ్యోష్ణ

ఇద్దరూ ఆ మధ్యాహ్నపు ఎండలో నడిచి వచ్చి ఒక బట్టల దుకాణం ముందు ఆగిపోయారు.

కన్నయ్య ఇంతకుముందెప్పుడూ అలాంటి 'షాపు'లోకి నడిచి ఎరగడు. అతి చెప్పుడూ తనకి కావలసిన ధోవతులు తమ ఊళ్ళోనే ఉన్న నేతగాళ్ళదగ్గరే కొనేవాడు. ఇక అతని పెళ్ళాం చీరలమాటా? ఆమె ఇంతవరకూ పుట్టింటినించి వచ్చేటప్పుడు తెచ్చుకున్న వాటితోనే గడుపుతోంది.

కన్నయ్య చెప్పులు బయట విడిచి లోపలికి నడిచాడు, అది తన సొంతఇల్లు అనుకుంటున్న వాడిలా; కాని అదంతా చూసేవాళ్ళకి. పైకి అంతగంభీరంగా కనిపిస్తున్న కన్నయ్యకి మనస్సులో ఎంతో జంకుగా ఉంది. వాళ్లు తనని మెడపట్టుకుని బయటకు నెట్టేసినా అతను ఆశ్చర్యపడేలా లేదు. తను ఏదో కొనడానికే వచ్చాడనీ, దారి తప్పికాదనీ వాళ్ళకి వెంటనే తెలియపర్చకపోతే అంత పనీ చేసేస్తారనుకుంటున్నట్లు "మా ఆడోళ్ళకి చీరలు కొనాలండి—" అని ఏదో తప్పు ఒప్పుకుంటున్నవాడిలా చెప్పేశాడు అక్కడున్న గుమాస్తాని చూస్తూ. అతనికి ఆక్షణంలో దుకాణంలోఉన్న ప్రతిమనిషి తన భావిని శాసించేవాడిలా కనపడ్డాడు. వాళ్ళతో తనరాకకి కారణంచెప్పేసి, వెనక్కి తిరిగి బుల్లెమ్మ నుద్దేశించి "లోపలికిరాయే. పర్లేదు" అని దుకాణం యజమాని మొహం లోకి చూశాడు. పైమీద గుడ్డతో మొహం తుడుచుకుంటూ భార్యరాకని పర్యవేక్షించాడు. అంతవరకు ఎండలో నిలుచున్న బుల్లెమ్మ సిగ్గుపడుతూ లోపలికి వచ్చింది.

"ఎలాంటి చీరలు కావాలి?" గుమాస్తా మామూలుగానే అడిగాడు. కన్నయ్య ధరించిన రైతువేషం, రైతు మొహం, రైతు భయం చూసి అతను లోకువ కట్టలేదు. కాని కన్నయ్య మాత్రం వాళ్ళమెరిసే చొక్కాలనీ, ఇస్త్రీలో బిరుసెక్కిన పంట్లాలనీ చూస్తూ, వాటితో తన ముతకగుడ్డల్ని పోల్చుకుంటూ సిగ్గుపడ్డం మొదలెట్టాడు. బుద్ధిలేక పోయింది. తనకి తను ఈషాప్‌లోకి రాకుండా ఉండవల్సింది...ఓహో! షాప్ నిండా అద్దాల బీరువాలు, వాటిలో మెరిసే ఖరీదైన గుడ్డలు, షాప్‌లో పగలుకూడా వెలిగే ట్యూబ్ లైట్లు, ఎలక్ట్రిక్ పంకాలు... కన్నయ్య మళ్ళీ పైమీద గుడ్డతో మొహం తుడుచుకున్నాడు.

"చీరలండీ మామూలియి. ఒద్దే అక్కర్లేదండి. ఒకటిచాలు" అని బుల్లెమ్మ మొహం లోకి చూశాడు. బుల్లెమ్మ తల ఆడించింది.

గుమాస్తా చీరలు తెచ్చి నిరత్యంగా అక్కడున్న వెదురు పేలికల చాప మీద పరిచేస్తున్నాడు, చీర మీదున్న చీటీ చూడకుండానే దాని ఖరీదు చెప్పేస్తున్నాడు. వాటి ధరలు పదినుంచి పద్దెనిమిది రూపాయలు వరకూ ఉన్నాయి. బుల్లెమ్మ మనస్సు ఆవర్తావాన్ని చూడగానే కేరింతలు కొట్టింది. అక్కడే కుర్చీల మధ్య చోటు చేసుకుని కుదురుగా కూర్చొని చీరల్ని ఎంచడం మొదలు పెట్టింది.

బుల్లెమ్మ చిన్నపిల్లలా అమాయకంగా ఆ చీరల్ని వేళ్ళతో పట్టుకుని పరీక్షించడం కన్నయ్య సహించలేక పోతున్నాడు. వాళ్లు "ఏయ్. వాటిని తాకకు ఫో" అంటారని అతని భయం. అతను చుట్టూ భయంగా చూశాడు. గుమాస్తా (బుల్లెమ్మకు ప్రత్యేకం) ఏ చీర ఎందుకు మంచిదో, వాడ్డం మొదలెట్టాక చీర అసలు రంగు ఎలా మారిపోతుందో వగైరా చెప్పకుపోతున్నాడు. యజమాని టెలిఫోన్‌లో ఇంగ్లీష్ మాట్లాడేస్తున్నాడు.

"నా ఎకౌంట్ క్లైమ్స్ వజ్ ఛేంజింగ్" అని "వాకు తెలుసు. అందుచేతే ఐవజ్ ... డోంట్" కన్నయ్య దవం మీద భారంవేసి చుట్టూ చూడడంలో పడిపోయాడు. అతను గుండె రాయి చేసుకున్నాడు. చాలా కాలం గడిచేక బుల్లెమ్మ ఒక చీర ఎంచుకుంది. అది ముదురు నీలిరంగు చీర, వెడల్పాటి అంచు ఖరీదు పదిహేను రూపాయల పధ్నాలుగణాలు. బేరం చేయడం మాత్రం చాలా హుషారుగా చేశాడు కన్నయ్య. చివరకి వాళ్ళని కిందపెట్టి, మీద పెట్టి పదిహేనున్నరకి ఒప్పించాడు. డబ్బు చెల్లించారు. గుమాస్తా అది చాలా 'నాణెమైన' సరుకనీ, చీరపోయినా రంగుపోదనీ హామీ ఇచ్చాక కాని వాళ్ళు బయటకు కదలేదు. పొద్దువాలింది. మధ్యాన్నం కూడుతిని ఓ గంట కూర్చుని బయల్దేరినవాళ్లు తిరిగి పొయ్యిరాజేసే వేళకి ఇల్లు చేరుకున్నారు. అది కన్నయ్య, అతని తండ్రీ కలిసి ఒక్క ఇటిక వాడకుండా కట్టిన తాటాకుల ఇల్లు.

*　　*　　*

"పదిహేను రూపాయలే!"

"నువ్వు మరీని. పదిహేనున్నరట."

"నా మతి మండా, ఇంకా పదిహేను అనుకుంటున్నా."

బుల్లెమ్మ చీరగురించి తెలిసిన గూడెంలో ఆడవాళ్ళు అలాగా, ఇంకా అనేక విధాలుగానూ మాట్లాడుకున్నారు. వాళ్లలో చీరకోసం ఐదు రూపాయలు ఖర్చు పెట్టలేదు. ఒకసారి. బుల్లెమ్మ మొగుడు 'రంగం' నించి వస్తూ ఏడు రూపాయలు చీర తెచ్చినప్పుడు అందరూ వెళ్లి ఆ చీరని చూసి, తాకి, ఎన్నికచేసివచ్చారు. ఇప్పుడు బుల్లెమ్మ కొనుక్కున్నచీర వాళ్లి అనుభవాన్నే

కాదు, ఊహానికూడా మించిపోయింది. అది తెలుగు పౌరాణిక చిత్రంలో 'రాక్ అండ్ రోల్' పాటలా చాలా విపరీతంగా తోచింది.

అయితే ఇందులో బుల్లెమ్మ తప్పేం లేదు. బుల్లెమ్మ ఖరీదైన చీరలమీద మోజును అవ్యక్తంలోనే దాచేసుకుంది. తను ఇంట్లో పొదుపుగానూ, తెలివిగానూ పనిచేసి లాభంచేసినా అందుకు సొంతలాభం కావాలనుకోలేదు. కాని నిన్న రాత్రి కన్నయ్యే మొదలెట్టాడు. అతను ఈ నాందార్లకి ఇవ్వాల్సింది ఇచ్చెయ్యగా, ఖర్చులు గట్రా తీసేశాకకూడా బోలెడంత లాభం కనపడింది పొలంమీద. అదంతా బుల్లెమ్మ అదృష్టమని అతనికి తోచింది. రాత్రి కూడు తింటూ మొదలెట్టాడు. "నీకేం బహుమతి కావాలో కోరుకోవే" అన్నాడు, ఇక మోటారుకారు కావాలన్నా ఇచ్చేసేవాడిలా. పైకి అలా అన్నా అతనికి భయంగానేఉంది బుల్లెమ్మ తన తాహతుకి మించిన వస్తువు, ఏ బంగారునగో అడుగుతుందనీ తను చిన్నపుచ్చవలిసొస్తుందనీని. కాని బుల్లెమ్మ అతని భయం, అతని దగరున్న డబ్బు అన్నీ తెలిసినదానిలా ఒక 'అలాంటి చీర' కావాలంది. కన్నయ్య మురిసిపోయాడు. బుల్లెమ్మ తెలిసి బాధించదు; అంతేకాదు తెలియకకూడా బాధించదు. అంచేత బుల్లెమ్మ వద్దన్నా ఇంత ఖరీదుపెట్టి ఈ చీర కొనేశాడు.

*　　　*　　　*　　　*

బుల్లెమ్మలో చాలా ముఖ్యమైన లక్షణం శాంతం. ఆమె మనస్సులో ఎంత ఉధృతమైన భావాలొచ్చినా ఆమె కదలికలో ఏమీ కనపడవు. పంధొమ్మిదేళ్ల బుల్లెమ్మ అలా ఉండడం లోటో, గొప్పతనో తెలుసుకోడం కష్టం. ఎప్పటి లాగే బుల్లెమ్మ ఆచీరను చూసి నిశ్శబ్దంగా ఆనందించింది. ఇంటికొచ్చాక ఒకటి రెండు



★ విలువలు ★

పొరు ఆ మడతల్లో ముఖాన్ని దాచుకుంది. ఆ చీరది. ఒక రకం బిస్కట్ల వాసన. కొంతసేపు చూసి జాగ్రత్తగా తనపెద్ద కొయ్యపెట్టెలో దాచేసింది.

సాయంత్రం ఇంకా పొద్దుగూకకుండానే అన్నం తినేసి వీధిలోకి వెళ్లిపోయాడు కన్నయ్య. బాగా చీకటిపడి అందరి ఇళ్లలోనూ పిల్లలు నిద్రకు తయారయ్యాకకూడా కన్నయ్య రాలేదు. బుల్లెమ్మ అరుబయట నులకమంచం వాల్చుకుని పడుకొని ఆలోచన మొదలు పెట్టింది. కొంతసేపు ఆ చీర రంగు, వాసన ఎలా ఉంటేదీ ఊహించుకుంది.

ఆకాశంలో తూర్పునుంచి ఒక చిక్కటి మబ్బు కమ్ముకొస్తోంది. మబ్బులేనిచోట నక్షత్రాలు ఎప్పుడూలేని కాంతితో మెరుస్తున్నాయి. గాలి అప్పుడప్పుడు వచ్చి పోతోంది. చూరుకి ఇవతలగా, దానిమ్మ చెట్టు పక్కనున్న మంచంమీద వెల్లకిలా పడుకుని బుల్లెమ్మ నిశ్శబ్దంగా ఆలోచించు కుంటోంది.

ఆ చీరె గురించి...ఒకవైపు తృప్తి... మరోవైపు ఏదో తెలీని దిగులు. బుల్లెమ్మలో చాలా కలగాపులగపు భావాలు చేరి అల్లరి మొదలెట్టాయి.

తనా చీరను ఎప్పుడు ఎలా కట్టుకుంటుందో బుల్లెమ్మకు పాలుపోలేదు. తను రోజంతా చీమలా శ్రమించే మనిషి. ఆ చీర కట్టుకుని తనేం పని చేస్తుంది? ఆ చీర కట్టుకుని మడత నలక్కుండా, పమిటె చెదరకుండా ఒక ఎత్తైన కుర్చీలో నేలని తాకకుండా కూర్చోవాలి తను! తనకు ఆ చీర కట్టుకుని బొమ్మలా కూర్చోవడం చేతకాదు.

క్రమంగా బుల్లెమ్మకు ఆ చీరంటే ఉత్సాహం పోయింది. అంత పల్చటిచీరా ఆమెకో బరువులా తోచింది. బుల్లెమ్మ తనుండే మట్టిఇల్లూ, 'తను' అనబడే తన ఒళ్ళూ ఆ చీరను మురికిచేసేస్తాయనుకుంది. బుల్లెమ్మ ఒళ్ళు శుభ్రంగా ఉండదని కాదు. శుభ్రంగానే ఉంటుంది. కాని బుల్లెమ్మకు ఆ ఊహ రాలేదు. ఆ చీరకు తను తగననుకుంది. అది ఆలోచన ఫలితంకాదు; అదో నమ్మకం; దానికి ఎదురెళ్ళడం బుల్లెమ్మకు చేతకాదు.

బుల్లెమ్మ ఆ చీర మర్నాడు కట్టుకోలేదు. ఆ మర్నాడూ కట్టుకోలేదు. మరో నెల్లాళ్ళు గడిచినా కట్టుకోలేదు. ఎప్పుడూ కట్టుకోలేదు.

పెద్దపండుగ రోజున కన్నయ్య పట్టు పట్టాడు ఆ చీర కట్టుకోవాలని. బుల్లెమ్మ కూడా అతనిమాటల ఆసరాతో అందుకు సిద్ధపడింది కాని మళ్ళీ మనసు మార్చుకుని ఆ చీర పెట్టెలోపెట్టి ఏదో పని కల్పించుకుంది.

బుల్లెమ్మ ఆ చీర కట్టకోకుండా సంవత్సరాలు దొర్లిపోయాయి. కన్నయ్య ప్రతీ ఏటా పొలంమీద లాభంతీశాడు. పదేళ్ళు గడిచేసరికి కన్నయ్య భూమికొన్నాడు తనకి భూమి కౌలుకిచ్చిన వాళ్ళ దగ్గర్నుంచి. బుల్లెమ్మ కొత్తలో ఆ చీర తరుచుగా పెట్లోంచి తీసి దాన్ని పసిపాపలా ముద్దు చేస్తుండేది. పురుగు చేరకుండా కలరా ఉండలు ఉంచేది దాని మడతల్లో. ఒక్కోసారి ఎండలోఉంచి మళ్ళీ జాగ్రత్తగా మడతపెట్టి దాచేసేది.

ఆ చీరనుచూస్తే, తాకితే బుల్లెమ్మకు ఒళ్ళు పులకించేది. ఏదో దిగులూ కలిగేది. కావ్యాల్లో విషాదంలాగా అదో తీయని బాధ. ఆ చీర కట్టుకోవాలనీ కోరిక కలిగితే, 'ఆ రోజు వస్తుంది. అప్పుడు...' అని మనస్సును మరిపించేది. అదేదో అద్భుతమైన రోజు అని బుల్లెమ్మ నమ్మకం. అది ఎలా వస్తుందో మాత్రం ఊహకూడా లేదు.

'ఆ రోజూ' వచ్చింది. కన్నయ్య పెద్ద 'ఖామందు' అయిపోయాడు. పెద్ద కామందుకి చాలాపెద్ద సంబంధం బుల్లెమ్మకు తెలుసు తను తన చీర ఇప్పుడు హాయిగా కట్టుకోవచ్చుని.

ఇంటిలోపలా, ఇంటి వెలుపలా పెళ్ళి సందడి. బుల్లెమ్మ కాస్త తీరిక చేసుకొని గదిలోకివచ్చి తలుపు గడియ వేసింది. గుండెలు కొట్టుకుంటుండగా తన కొయ్య పెట్టె మూత తెరిచి చీర బయటకు తీసింది. మళ్ళీ బుల్లెమ్మ ఒళ్ళు ఆ చీరని మొదటిసారి తాకినట్లయి పులకించింది. బుల్లెమ్మ ఆత్రుతతో మడతలు విప్పింది. ఇన్నేళ్లు ఎదురు చూసిన రోజు హఠాత్తుగా గోదావరి వరదలా వచ్చింది మరి.


ఎప్పుడూ కట్టకపోవడంచేత ఆ చీర కొత్తదిగా ఉండిపోయింది. అది కొత్త చీర!

పొందని అందంలో విలువ ఏమంటే అది పాతపడదు. ఆ అపురూపమైన ఆనందాన్ని తచీరని చూసుకుంటూ, "ఇప్పుడు కాదు రేపు..." అని వాయిదాలువేస్తూ గడిపి బుల్లెమ్మ అనుభవించింది. ఆచీరను కొనగానే ధరించి ఉంటే దానిమీది మోజు ఒక ఏడాదిలోపోయి ఉండేది; అది మరో రెండేళ్లలో పాతపడీ ఉండేది. కాని...

బుల్లెమ్మలా అలా చీరను పూజిస్తూ గడిపినవాళ్లు ఇప్పుడెవరూ కనిపించక పోవచ్చు. అలా ఇంకెవరూ లేకపోవడం బుల్లెమ్మ అనుభవానికి మరీ విలువ ఇస్తుంది

కాని బుల్లెమ్మ అంతకంటే అదృష్టవంతురాలే. ఆచీర ఇప్పుడు కట్టుకుని దానిమీదుండే పదిహేనేళ్ల మోజూ పోయి ఆ విలువని ధరించేయోగం ఆమెకు లేదు. ఎందుకంటే ఆచీర ఇప్పుడు చీరలా లేదు. జల్లెడలా ఉంది. పురుగులు చక్కగా ఏవో డిజైన్లు వేసుకుని దాన్ని తినివేశాయి. ఆచీరని చీకట్లో ఒకదీపం వెనక ఉంచి చూస్తే చుక్కలతో నిండిన ఆకాశంలా ఉంటుంది.

బుల్లెమ్మ ఆచీరను గభాలున గుండెకు హత్తుకుని అక్కడ కూర్చుండి పోయింది ఆమెకు పెద్దబరువు శాశ్వతంగా తీరిపోయి నట్లైంది. ఆమెకు తెలీకుండా కళ్లు చెక్కిళ్లు తడిసిపోయాయి. ★



విక్రమార్కుడి మార్కు సింహాసనం

చలనచిత్ర కథలు

ఎస్. పార్థసారథి

(గతవారం తరువాయి)

‘వీరెవరు?’

‘వీరి పేరు శేషగిరి. ప్రొడక్షను మేనేజరు’ అన్నాడు డైరెక్టరు.

అని, డబ్బు పొదుపుచెయ్యాలని ఊహూ ఉత్సాహపడిపోతున్న సశేషగిరివంక చూసి, ‘గిరిగారూ! మీరేమీ పొదుపు చెయ్యక్కరలే అదేదో నే చూస్తా...రాజుగారూ! మీ రెవర్నీ నమ్మకండి. ప్రొడక్షన్ మానేజర్లని పెట్టుకోడం దురుసునోటి అప్పులాళ్ళ బిల్లు భోంచెయ్యడానికేనని గుర్తించుకోండి” అని ధైర్యం చెప్పాడు డైరెక్టరు గారు.

“సరే యిప్పుడు ఏం చేద్దాం. మూజిక్కు సంగతి చెప్పండి” అన్నాడు రాజు విసుగతి.

డైరెక్టరుగారు గ్రామఫోను తెప్పించారు. అటపెట్టె విప్పి, ఒక్కొక్క ప్లేటే పెట్టించారు.

గ్రామఫోను పెడుతున్నాయన, ఒకొక్క పాటకీ ముందు, దానిపేరు, మ్యూజిక్ డైరెక్టరు పేరూ చెప్పి, పెడుతున్నాడు. ఇది శాడ్ సాంగ్, ఇది గ్లాడ్ సాంగ్, ఇది మాడ్ సాంగ్, మూడ్ సాంగ్, అని తీర్పు చెబుతున్నారు డైరెకరుగారు.

అయితే యిప్పుడు మనం హిందీ పిక్చరు తీస్తున్నామన్నమాట సారినీ! అన్నాడు రాజు తెలివితేటలన్నీ వాడేసి.

‘నోనో తెలుగే. ఇది హిట్టయితే ఏకంగా టమిల్, హిందీలలో తీసి పారేద్దాం... ఇపుడు మీరు వింటున్నవి అన్నీ హిందీ హిట్ సాంగ్స్. వీటిని అన్నిటినీ మనం ఎడిట్ చేసి తెలుగు చేస్తున్నాం ఇగో ఈయనే ఇవి ఎడిట్ చేసే ఆయన’ అన్నాడు డైరెకరుగారు.

గ్రామఫోను పెడుతున్న పెద్దమనిషి గంభీరంగా రాజుకి దండం పెట్టాడు.

‘మూజిక్ డైరెక్టరో మరి?’ అన్నాడు రాజు.

“మూజిక్ డైరెక్టరు అంటూ వేరేతేరు వాళ్ళు చాలా అడుగుతారు. చెప్పినట్టు అందరూ వినరు. మనకు మూజికు ఎడిటరే ఉంటాడు. డైరెక్షను మనదే” అన్నారు డైరెక్టరుగారు. దగ్గిరేఉన్న కుర్రాడు ఆయన గుండెమీద తీరిగా కొట్టాడు.

రాజు బుర్రలో ఓ ఆలోచన మెరిసింది. ఏదో అనబోయి తగ్గాడు...తటపటాయించాడు. తెగించి లేచి, “డైరెక్టరుగారూ ఓ చిన్నమాట. అసింటారండి” అన్నాడు.

డైరెక్టరు కదల్లేదు. చుట్టూచూసి, హుంకరించాడు. అంతా దూరంగా వెళ్ళారు ‘చెప్పండి’ అన్నాడాయన.

ఈ అయిడియా చూసిన రాజు ఆశ్చర్యానికి అంతులేదు. ఆనందానికి హద్దులేదు ‘ఎలాగైనా డైరెక్టరంటే డైరెక్టరే’ అన్నాడు.

“కాపోతే డైరెక్టరంటే ప్రొడ్యూసరెలా అవుతుంది.”

“అదికాదుసార్. మీకొంత బ్రహ్మాండమైన అయిడియా వచ్చింది! మనం అసింటా వెళ్ళాం అంటే, మిగతా వాళ్ళని దూరంగా పంపేసి, మనం కదలకుండానే అసింటా వెళ్ళినట్టు చేశారు. అయిడియా కాదూ ఇది మరి!”

‘అదా!’ అన్నాడు డైరెక్టరుగారు ఇలాంటివి చాలా సహజమన్నట్టు.

రాజు, ఆయనదగ్గరగా జరిగాడు.

“చూడు గురూ! ఈ పిక్చర్‌లో కొంన్ని తెలుగులోనే ఉంటాయిగదా! అవి మన్నిరాయి నిస్తారూ? అయామే ‘గుడ్ సాంగ్ రైటర్:” అన్నాడు రాజు మెల్లిగా.

డైరెక్టరుగారు ఫెళఫెళ నవ్వేశారు కొంచెం అసింటా ఉన్న స్టుడియో కొండగుహ ‘ఎళ ఎళ’ అని ప్రతిధ్వనించింది.

‘భలే వాడివయ్యా ఈపిక్చరు నీది. నువ్వే ప్రొడ్యూసరువి. పాటలు రాయాలనుంటే నిన్ను అడ్డే వాడెవడు. దర్జాగా రాసెయ్ కాని ఒకటే చిక్కు నువ్వు పెద్దరైటరని నాకు తెలీదే. పసిగట్ట లేకపోయా. అందుకని ఏం చేశానంటే భావమరిది లేడూ’—

‘మీకు బామ్మర్ది ఉన్నాడా’

‘ఉన్నాడు లే. విధవ ఘోరాఘోరం తప్పి అడ్డగాడిదలా తిరుగుతూంటే - తప్పితే సింగాని, వాడికి యమ తెస్తుంది లే-సరే ఈ లైను లో పెడదామని ఓడజనుపాటం ప్రసక్తాలు వాడిముందర పడేసి పాటలు రాయి విధవా యూ అన్నాను. తీరాచూస్తే వాడన్నీ హిట్ సాంగ్స్ రాసేశాడు! దారుణం కదూ! అన్నీ బ్రహ్మాండంగా ఉన్నాయి. ముందరేమో, పాటకి వంద ఇప్పిద్దామనుకున్నవాణ్ణల్లా సంతోషం కొద్దీపాటకి నాలుగొందలు ఇప్పిస్తాన్నాను. వాడిబిల్లు చూస్తారుగదూ అన్నట్టు...ఇదో రాజుగారూ. ఒకటి చెబుతా. మనం కవులనెప్పుడూ బాధపెట్టకూడదు. అది చాలామహాపాపం. కాని సినిమావాళ్ళంతా అంతే. అన్నిటికీ తగలేస్తారు గాని కవిదగ్గర కొచ్చేసరికి బేరం ఆడతారు. పొదుపుచేసారు వందిచ్చి పదొందలికి బిల్లు రాయించుకుని, స్టార్లకిచ్చిన బ్లాకు డబ్బుని

★ విక్రమార్కుడి మార్కు సింహాసనం ★

చదువుకుంటారు. దానికి కూడా తిప్పి తిప్పి ఏడిపిస్తారు. ఇది నాకిష్టం లేదు. అంచేత మీరుముందర కవిగాడికి ఇవ్వండి. పాటలన్నీ శేషైనవి."

రాజా ఈ గంభీరోపన్యాసానికి ఉబ్బింగిపోయాడు. అతనికి చాలా గర్వం కలిగింది. ముందే ఆదర్శకంపెనీ అన్నాడు. తప్పకుండా కవికి ఇచ్చేదామన్నాడు.

"కాని ఇంకొక్క రిక్వెస్టు సార్, నేను కొంప్ను రాయకపోతే పాయెగాని, రాసిన వాటిలో ఎక్కడైనా 'అర్ణవము' అనే మాట పెట్టించండి. అది భలేవడుడు లెండి, నాకు చాలాయిష్టం. ఎప్పటించో అదిపెట్టి పాట రాయాలనీ, అదిపెట్టి పిక్చరు తియ్యాలనీ కలలు గాంచుతున్నాను" అని ప్రాధేయ పడ్డాడు.

ప్రొడ్యూసరు ముచ్చట చెల్లించాలని డైరక్టరుకూడా ముచ్చటపడ్డాడు. అసలు అలాటి పెద్దమాటలు ఓపికజేసినా ఉండా అన్నాడు. ఉంటే డిస్ట్రిబ్యూటర్సుకూడా తొందగా డబ్బివ్వచ్చును అన్నాడు. వెంటనే ఫ్లోరు అవతల గాలి పీలుస్తున్న తన బావమరదిని పిలిపించాడు.

'ఈనే కవిగారు!' అని పరిచయం చేశాడు. 'ఏరా అబ్బీ!' 'అర్ణవం'ట అదెక్కడైనా పెట్టావా పాటల్లో' అన్నాడు.

'లేదు బావా ఏమిటది?'

"నీబొంద ఎందుకు పెట్టలే? బుద్ధిలేదు? అర్ణవం అన్నమాట లేకుండా పాటలు రాసినవాడివి నువ్వెందుకు పనికొస్తావు? అసలు అదిలేకుండా వినడన్నా పాటలు రాస్తాడాఅని. వెంటనేపెట్టు" అని గర్జించాడు.

"పెడతానుబావా కాని అలాటే మాట లేదు: ఉన్నా ఇందులో పనికిరాదు" అన్నాడు బావమరిది ధైర్యంగా, ఓపక్క తలత్ మహమద్ కంఠంలా గజగజ వణికిపోతూ.

"ఛత్! ప్రొడ్యూసరుగారికన్న తెలుసా నీకు?"

జేబులోంచి కాయితాలు తీసి గబగబ చూసి, 'అయినా ఎక్కడా పట్టదుబావా. అన్నిటైటుగా ఉన్నాయి. చోటూలేదు. సందర్భం కుదరదు' అన్నాడు బావమరది ఙంకుతూనే.

'పెటమంటే నీగాదూ... మూపరింపోజు చెయ్యి చోటులేపోతే... మీ కవిగార్లతో ఇదే చిక్కు. చెబితే వినరు. తిడితే కనరు. స్వతంత్రం మింగేస్తున్నారు ప్రొడ్యూసర్లని గోల' అని మండిపడ్డారు డైరక్టరుగారు.

బావమరిది ముందు బిక్కమొహం పెట్టి ఆనక దుఃఖసముద్రంలో మునిగిపోయాడు.

ఇదంతా చూసి, రాజాకి ఏడుపొచ్చేసింది. భయం వేసింది.

'ఛీ! నామూలాన కదా కుటుంబ కలహం వచ్చింది. అర్ణవం కోసం కుటుంబచ్ఛిద్రం అయిపోతే నా హృదయం భాండం భరించలేదు. సార్! అర్ణవం మానెయ్యండి' అన్నాడు భోరున ఏడుస్తూ, స్టుడియో ఆకాశంలోకి చూస్తూ.

డైరకరుగారికీ ఈ సీను చూసే సరికి గుండెకరిగి దుఃఖం పొంగిపొరలిపోయింది.

అప్పుడు ముగురూ ఏడిచేశారు. డైరక్టరుగారూ, ప్రొడ్యూసరూ, కవీను.

కాసేపు ఏడిచాక, 'అర్ణవం ఎలాగో అలా పెట్టేయ్' అన్నారు డైరకరు కళ్ళు తుడుచుకుంటూ.

'పెటేస్తాను బావా.' అన్నాడు బావమరిది ఎక్కిళ్ళు ఆపుకుంటూ.

'ఒద్దు' అన్నాడు రాజా ముక్కు చీదుకుంటూ.

పెడతాం అన్నారు వాళ్ళు; వద్దంటాడు రాజా.

రాజా ఎంత వద్దన్నా, అని ఏడిచినా వినకుండా నిర్దాక్షిణ్యంగా డైరక్టరూ, కవీ కలిసి ఓ శాడ్ సాంగులో రెండు మాటలు కొట్టేసి అక్కడ అర్ణవం అనే మాట పెట్టేశారు.

అప్పుడు, "నా ఆత్మశాంతించింది. నా జీవితాశయం తీరింది. పాట కూడా చూడండి ఎంతో బావుందో! అర్ణవానికి అర్థం అభివృద్ధి అని ఈజీగా తెలిసిపోతోంది. ఓ కొత్త మాట ప్రజలికి చెప్పేస్తున్నాం. కొన్ని లక్షల కోట్ల మంది భారతీయులు ఈ పిచ్చరు చూసి, ఈ పాట విని, కష్టపడి పనిచేసి, అర్ణవాన్ని సాధిస్తారు" అన్నాడు రాజా ఆనంద బాష్పాలు కారుస్తూ.

"ఔను" అన్నారు డైరక్టరూ కవీ కూడా ఆనంద బాష్పాలే కారుస్తూ.

* * *

ఈ ముగ్గుర్నీ లాంగ్ షాట్‌లో చూపిన ఒక వర్ధమాన నటుడి బుర్ర చురుగ్గా పని చేసింది. ఓహో అనుకున్నాడు.

తక్షణం అతని గుండె కరిగిపోయింది. అదంతా పైకి తన్ని కళ్ళలోంచి నీరై కారడం మొదలెట్టింది. చొరవచేసి, అతను గబగబ వాళ్ళ దగ్గిరకు వచ్చాడు.

ముగ్గురో దర్జాగా ఉన్న డైరకరుగారికే దండంపెట్టి గద్గద స్వరంతో 'సార్!' అన్నాడు. ఆ ముగ్గురూ ఇతని వంక చూశారు.

"సార్! మీర ధైర్యపడకండి. ఈ కష్టం మీకు రావాల్సిందికాదు. మీరే ఏడిస్తే, మాలాంటివాళ్లం ఏంగాను. పోయినవాళ్లతో మనమూ పోగలమా! పోలేము. వారులేరు. మనకిక లేరు. ఉన్నారారు... నాకు దుఃఖం వచ్చేస్తోంది. ఇవి సత్యకన్నీళ్ళు...గ్లిసరిన్ మీద ఒట్టు. మీ కుటుంబానికి నా సానుభూతి; వారి ఆత్మకు శాంతిగలుగు గాక" అన్నాడు. అని వినయంగా వచ్చాడు.

డైరక్టరుకి, రాజాకి, కవికి నోటమాట లేదు. తెల్లబోయి విన్నారు.

'ఎవరోయ్ ఆ వారు.' ఎవరిమాట నువ్వు చెప్పేది.' అన్నాడు డైరక్టరు.

వర్ధమానుడి గుండె గుభేలుమంది. "ఎవరూ పోలేదా?" అన్నాడు మెల్లిగా, జంకుతూ.

"గెటౌట్ యిడియట్" అనిగావుకేక పెట్టాడు డైరక్టరు.

* * *

"మనవాళ్ళెవరూ పోలేదుగా గాబట్టి తిట్టిపోశాం అనుకో. కాని, నిజంగా మనం దుఃఖంలోనే ఉంటే, ఈపాటికి ఇందాకటి వాడు మన పిచ్చర్ లో ఏ హీరోవో హీరోయినో ఎట్ లీస్టు ఎక్స్ట్రానో అయిపోయేవాడుగదా పాపం బాబైపోయింది. కాని వాడు ఎంత తెలివైనవాడో చూశారా? ఎంతచొరవో చూశారా" అన్నాడు రాయుడు ఆరాత్రి నిద్రపోయే వేళ.


"ఔను. భలే ఇంటలిజెంట్ వాడు చాలా మంచివాడు." అన్నాడు రాజా.

"మరి అలాటి సూక్ష్మబుద్ధి, అలాటి చొరవా, సాహసం, మీలో సహమేనా ఉన్నాయా? మీరు ఇంకోళ్ల చుట్టాలకోసం పబ్లికున అంత నాచురల్ గా యాడవగలరా" అన్నాడు రాయుడు ఆవలిస్తూ.

"ఉహు."

"దెన్ యూ సీ. మీరు ఫిలిం ఫీల్డుకి పనికిరారు. వారసత్వంకలిపి ప్రొడ్యూసరు అయారుగామట్టి సరిపోయింది కాని"— అన్నాడు రాయుడు. ★

(పై వారం మరో కథ)



[ఆదిపర్వము — తృతీయాశ్వాసము]

వ. ఇట్లు పెక్కుమృగంబుల నెగిచి చంపెడువేడుక నతిదూరంబున కరిగిన నాతని రథవేగంబు ననుగమింప నోపక యధికక్షుత్పిపాసాపరవశు లయి పదాతులయ్యయిప్రదేశంబుల విశ్రమించి రంత దుష్యంతుండు కతిపయామాత్యపరిజన పురోహితసహితుండై కొండొకనేల యరిగి ముందట నొక్కపుణ్యనదీతీరంబున వివిధసురభికుసుమఫలభార వినమ్ర తరు లతా గుల్మపరిశోభితం బయిన యొక్క వనంబు గని.

క. అమరపతిఖాండవమునకు, రమణను వైశ్రవణు చైత్రరథమునకు సమా
నముగా దీనిని భూభా,గమునకు రచియించె నొక్కొ కమలజుఁడు దయన్.

వ. అని దానిరమణీయభావంబుఁ బొగడుచుఁ జనుదెంచి యవ్వనంబు సొచ్చునప్పుడు.

చ. అతిరుచిరాగతుం డయిన యాతనికిన్ హృదయప్రమోద మా
తతముగ నవ్వనంబున లతాలలనల్ మృదులానిలాపవ
ర్జితకుసుమాక్షతావళులు సేసలు వెట్టినయట్టి రైరి సం
పతదళినీనినాదమృదుభాషల దీవన లొప్ప నిచ్చుచున్.

వ. మఱియును.

క. కాఱడవిఁ బఱచుమృగముల, నూఱడకం దిగిచి డస్సియున్నతనిశ్రమం
బాఱఁగ నెడఁ బరితాపము. దీఱఁగఁ బై వీచె నన్నదీపవనంబుల్.

మానిని. ఏచి తనర్చి తలిర్చినకోవుల నిమ్మగుతావుల జొంపములం
బూచినమంచియశోకములన్ సురపొన్నలఁ బొన్నల గేదఁగులం
గాచి బెడంగుగఁ బండినయాసహకారములం గదళీతతులం
జూచుచు వీనుల కింపెసఁగన్ వినుచున్ శుకకోకిలసుస్వరముల్.

కవిరాజవిరాజితము. చనిచనిముందట నాజ్యహవిర్ధృత సౌరభధూమలతాతతులం
బెనఁగినమ్రాఁకులకొమ్మలమీఁద నపేతలతాంతము లైనను బా
యనిమధుపప్రకరంబులఁ జూచి జనాధిపుఁ డంత నెఱింగెఁ దపో
వన మిది యల్లదె దివ్యమునీంద్రనివాసము దా నగు నంచు నెడన్.

వ ఇట్లు హృదయసుఖావహం బగు చున్న యవ్వనంబులో నరిగి యరిగి యనవరత పదక్రమమహాద్విజపఠ్యమానవేద ధ్వనులను నవిచ్ఛిన్న హూయమానాగ్నిహోత్రస్వాహాశబ్దంబులను ననేకమునిగణప్రణీతవచనవిషయవిభాగవినిర్ణయ న్యాయనిపుణవిద్వత్సంభాషణఘోషంబులను బ్రతిపక్షదుర్విభేదప్రమాణవిచార్యమాణ వేదార్థమీమాంసకగోష్ఠీ వివాద నాదంబులనుం జేసి మ్రోయుచు యజ్ఞప్రయోగప్రవీణులైన యాజ్ఞికులకును విహితానుష్ఠానాసక్తులయిన యనుష్ఠాతలకును నధికతపోనిరతు లయినమహాతపోధనులకును నివాసం బయినపుణ్యనదీతీరంబునఁ దద్దయురమ్యం బయి గంగాతీరంబున నరనారాయణస్థానంబునుంబోలె జగత్పావనం బగుచున్న కణ్వమహామునియాశ్రమంబు గని యందు.

సీ. శ్రవణసుఖంబుగా సామగానంబులు, చదివెడుశుకముల చదువు దగిలి
కదలక వినుచుండు కరులును గరికర,శీతలచ్ఛాయఁ దచ్ఛీకరాంబు
కణములచల్లని గాడ్పునపడి వానిఁ, జెంది సుఖం బున్న సింహములును
భూసురప్రవరులు భూతబలుల్ దెచ్చి, పెట్టునీవారాన్న పిండతతులు

తే. గడఁగి భక్షింపనొక్కటఁ గలసియాడు, చున్న యెలుకలుఁ బిల్లులు నొందుసహజ
వైరివర్గంబులయ్యుసహవాస మపుడు, సూచిమునిశక్తి కెంతయుఁ జోద్యమంది.

వ. ఇక్కాశ్యపుండైన కణ్వమహామునీంద్రునకు నమస్కరించి వచ్చెద నావచ్చునంతకు నందఱు నిచ్చోటన యుండునది యని,

చ. వలయుసమాత్యులం దగిన వారల నుండఁగఁ బంచి ధారుణీ
తలవిభుఁ డొక్కరుండ చని తన్విఁ బయోజదళాయతాక్షి, నం
కులమిళితాళినీలపరికుంచిత కోమలకుంతలన్ శకుం
తల యనుకన్యకం గనియెఁ దన్మునివల్లభమందిరంబునన్.

వ. అదియును ననంతవిలాసంబున జయంతుండపోనిదుష్యంతు నెఱింగి యతిసంభ్రమంబున నాసనార్ఘ్యపాద్యాదివిధులం బూజించి కుశలం బడిగియున్న నక్కన్యకం జూచి దుష్యంతుం డిట్లనియె.

ఉ. క్రచ్చఱ వేఁట వచ్చి యిట కణ్వమహామునిఁ జూచి పోవఁగా
వచ్చితి మిందుఁ బోయిరొకొ వా రనినన్ విని యాలతాంగి వా
రిచ్చటనుండి యీక్షణమ యేఁగిరి కానకుఁ బండ్లు దేర మీ
వచ్చు టెఱింగిరేని జనవల్లభ వారును వత్తు రింతకున్.

వ. వారు వచ్చునంతకు నొక్కముహూర్తం బుండునది యనిన విని యక్కోమలివినయంబునకు మృదుమధురవచనంబులకు సంతసిల్లి దానిం గన్యకఁగా నెఱింగి మనోజరాజ్యలక్ష్మియుంబోనిదాని సర్వలక్షణలక్షితంబులయినసర్వావయవంబులుం జూచి సంచలితహృదయుండై నీవెవ్వరికూఁతుర విట్టిరూపలావణ్యవిలాసవిభ్రమగుణసుందరి విందుల కేల వచ్చి తని యడిగిన నది యి ట్లనియె,

శకుంతల దుష్యంతునకుఁ దనజన్మ క్రమం బెఱింగించుట

క. జగతీవల్లభ యే న, త్యగణితధర్మస్వరూపుఁ డని జనములు దగ
బొగడఁగ జగదారాధ్యుం, డగుకణ్వమహామునీంద్రు నాత్మజ ననినన్.

చ. ఇది మునికన్యయేని మఱి యేలొకొ యీలలితాంగియందు నా
హృదయము దద్దయుం దవిలె నిప్పలు కింకను నమ్మనేరన
య్యెద విజితేంద్రియుం డనఁగ నిమ్మునిఁ బాయక యిందు నంచు దా
నిది కలరూ పెఱుంగ నవనీపతి యుత్సుకుఁ డయ్యె నాత్మలోన్.

వ. ఇట్లు దుష్యంతుం డాశకుంతలజన్మం బెఱుంగ వేఁడి వెండియు దాని కిట్లనియె.

తే. ఉత్తమాశ్రమనిష్ఠితుఁ డూర్ధ్వరేతుఁ, డైనకణ్వమహాముని యనఘచరితుఁ
డట్టిముని కెట్లు కూఁతుర వైతి దీని, నాకు నెఱుఁగంగఁ జెప్పుము నలిననేత్ర.

వ. అని యడిగిన నారాజునకు శకుంతల యి ట్లనియె.

క. ఇక్కమలాక్షి శకుంతల, యెక్కడియది దీనిజన్మ మెవ్విధ మని త
మ్మొక్కమునినాథుఁ డడిగిన, నిక్కాశ్యపు లర్థిఁ జెప్పి రేను వినంగన్.

వ. నాజన్మప్రకారంబు మాయయ్య యమ్మునికిం జెప్పినవిధంబు చెప్పెదఁ జిత్తగించి విను మని యాదుష్యంతునకు శకుంతల యి ట్లనియె.

సీ. అనఘుఁడు రాజర్షి యై తపశ్శక్తిమై, బ్రహ్మర్షిభావంబుఁ బడసి యున్న
సన్మునీశ్వరుఁడు విశ్వామిత్రుఁ డతిఘోర,తపము సేయుచు నున్నఁ దత్తపమున
కెంతయు వెఱచి దేవేశ్వరుఁ డప్సరో,గణములలో నగ్రగణ్య యైన
దాని మేనక యనుధవళాక్షిఁ బిలిచి వి,శ్వామిత్రుపాలికిఁ జని తదీయ

ఆ. ఘోరతపము చెఱిచి కోమలి నా దైన, దేవరాజ్యమహిమఁ దివిరి నీవు
గావు మనిన నదియుఁ గడుభయంపడి యమ, రేశ్వరునకు మ్రొక్కి యిట్టులనియె. ★

సీరియల్ నవల......

జీవనలీల

..మూలం..

మానిక్ బంద్యోపాధ్యాయి

..అనువాదం..

మద్దిపట్ల సూరి



కాలవ ఒడ్డున ఉన్న పెద్ద మ్రరి చెట్టుకి చేరగిలపడి నుంచుని ఉన్నాడు హారూఘోష్. ఆకాశ దేవత అక్కడే అతణ్ణి కటాక్షించింది.

నెరసీ-నెరవకుండా ఉన్న అతడి జుట్టు, మశూచికపు మచ్చలతో మోటుతేరిన ముఖం ఒక్కసారి తళుక్కుమని మెరిసి మాడి పోయాయి కాని అది అతడికి తెలియ లేదు. యాభైయేళ్ళనుంచి అతడు ముడిపెట్టుకుని ఉన్న చిన్మయజగత్తంతా, ఎన్నో వందలయేండ్ల నుంచీ ఉన్న ఆ మ్రరిచెట్టు అచేతనత్వంలో చిటికెలో లుప్తమయి పోయింది.

అతణ్ణి కటాక్షించి, ఆకాశదేవత దిక్కులు పిక్కటిల్లేట్లు గర్జించిందొకసారి. తర్వాత జోరున వర్షం ప్రారంభమైంది.

ఒత్తుగా ఉన్న వటవృక్షమైనా వర్షం పడకుండా ఎంతోసేపు ఆపలేకపోయింది. చూస్తూ చూస్తూండగానే హారూఘోష్ తడిసి ముద్దయి పోయాడు. నాలుగువైపులనుంచి 'ఓ జోను' వాసన క్రమ్మేసింది. దగ్గిరలో ఉన్న పొదలోంచి మొగలి వాసనకూడా ముసురుకువస్తోంది మెల్లిగా. గోధుమవన్నె సన్నటి త్రాచు ఒకటి మొగలిచెట్టును చుట్టేసుకుని ఉంది. మీాద చినుకులు పడటంతో అది మెల్లిగా పొదలోంచి బయటికివచ్చేసింది. కుటిలదృష్టితో ఒక్కక్షణం హారూకేసి చూసి, అతడి రెండు కాళ్ళమధ్యనుంచీ పోయి, మర్రిచెట్టు తొర్రలో దూరింది.

హారూఘోష్ ఇక్కడ ఉంటాడేమో అని అనుమానించటానికే ఆస్కారంలేదు. ఇక్కడ నరసంచారమే ఉండదు. ఈ చాయలకి రావలసిన అవసరమంటూ ఉండదెవరికీ. పోనీ ఊరికేనయినా ఇక్కడికి రావటానికి మనసొప్పదు.

పల్లెటూరి ప్రజలకి భయంమీాద మక్కువ జాస్తి. ఊరిబయట కాలవఒడ్డున ఉన్న ఈ చిటడవిని, ఇక్కడి నిర్జనత్వాన్ని వాళ్లి ఇందుకు ఉపయోగించుకుంటున్నారు. భూతప్రేతాలనేవి ఉంటే ఊళ్లో వాళ్ళ పిరికితనపు ఊహల్లో ఉండొచ్చు... ఏమయినా ఈ ప్రదేశం పాములకి నెలవు అనటంలోమాత్రం సందేహంలేదు.

ఇంకా బారెడుప్రొద్దు ఉండగా వాజిత్పూర్ నుంచి వస్తున్న గుండెదిటవు కల వాళ్లు ఒకరిద్దరు—గడ్డికమ్ముకుపోయి కనిపించకుండా ఉన్న ఈ దారిన్ని అడ్డం త్రొక్కారు దగ్గిరకదా అని... కాస్త ఎవరినయినా బ్రతిమాలుకుని, వాళ్ళ నావలో కాలవదాటితే చాలు-అవతలివాళ్ళ 'గావాదియా'లోకి వెళ్లేవారే. ఊళ్ళోకి వెళ్ళటానికి గట్టిగా అరమైలయినా నడవఖర్లేదు. చండీ వాళ్ళమ్మ అప్పుడప్పుడు చితుకు లేరుకోటానికి మధ్యాహ్నమప్పుడు వస్తూంటూంది ఇక్కడికి. యామినీ కవిరాజు శిష్యులు వారానికొకసారి మూలికలకోసమని వస్తారు. కార్తీక మార్గశిర మాసాల్లో 'ఖిన్ గావ్'లోని పాములవాళ్లు ఎప్పుడైనా పాములు పటుకోటానికి వస్తూంటారు. వీళ్లు తప్ప ఇంకెవరూ పొరపాటునయినా ఈ దారిని అడుగు పెట్టరు. వాన వెలిసేసరికి కపిరి కపిరి చీకటి పడుతూంది. ఆకాశంలో ఓమూల నునుసిగ్గు దొంతర్లలా కెంజాయ రేఖలు కన్పిస్తున్నాయి. పక్షులు గూళ్ళకి చేరుకుంటున్నాయి. కొన్ని పక్షులువచ్చి ఈ మర్రిచెట్టు కొమ్మలపై వాలి, అల్లంత దూరంలో నేలబొరియల్లోంచి, క్రొత్తగా వచ్చిన రెక్కల్ని విదిలించుకునీ ఎగిరి పోబోతున్న పురుగుల్ని చూసి, మళ్ళీ అటు వైపుగా ఎగిరిపోతున్నాయి. హారూఘోష్ నిశ్చలంగానుంచుని ఉన్నాడుకదా అనే



ధైర్యంతో ఓ ఉడత క్రిందికిదిగి క
చెట్టుమీదనుంచి. అటుప్రక్కన రా
కొమ్మమీద ఉన్న తొండ అప్పుడే
పురుగుల్ని పట్టుకుంది. దిచ్చిన గోర
నొకదాన్ని నోటకరుచుకుని, ఛేలకి
పడి పరుగెడుతున్న నక్క—చట
వెనక్కి తిరిగి హోరాఘోష్ కేసి
వాటికన్నిటికీ తెలిసిపోయిందప్పు?
తెలిసిపోయిందంటే ఎవరు చెప్పగ

* *

"పడవను అటుప్రక్కకి తప్పిం
కాలు గోవర్ధన్! ఆజువ్వి చెట్టు దగ్గరకి-
డై తే దిగటానికి వీలుండదు" అన్నా

మర్రిచెట్టు దగ్గిర కొలవగట్టు చా
వాలు—వర్షంపురవటంతో జా రు
కూడా ఉంది. గోవర్ధన్ గడవేసి
ప్రక్కకి తప్పించి తీసుకువెళ్ళాడు.
నాలుగు గంటల్లో—నది మట్టం ఏ
వరకూ యూడు మూరలు పెరిగింది.
లో కూడా వడి చాలా జోరుగా
జువ్విచెట్టు కొమ్మ ఒకటి పట్టుకుని
నక్కడ నిలిపి, "మీరు సుకాన్ని
కూచోండి బాబూ! నేను పడవలో
వ్తాను" అన్నాడు గోవర్ధన్.

"ఛా, పాపిష్టి వెధవా! నువ్వవ
కూడదు," అన్నాడు శశి.

"ముట్టుకుంటే మాత్రం పోక
త్తి దిలే బాబూ! బాగనూరుకు
కవాన్ని మీరు పోనుకు రాగ

చ్చింది
చెట్టు
చాలా
వంక
అడ్డం
క్కాక
ంది.
లా
చి తీసి
క్క
ం శశి.
ఏట
ం గా
పడవను
ఇరవై
మైళ్ళ
కాలువ
ఉంది.
పడవ
ట్టుకు
ఎక్కి
ట్టుకో
లిరాయి
యిన
రాశి"

అన్నాడు గోవర్ధన్.

శశి ఆలోచించి చూశాడు. ఆమాటా ఒట్టిదికాదు. పట్టు జారిందంటే హారూ ఒళ్ళంతా బురద పులుముకుపోతుంది. అంతకంటే గోవర్ధన్ ముట్టుకుంటే మాత్రం శివానికి కలిగే దోషమేముంది? ఎటూ, అపమృత్యువువాతను పడ్డవాడే హారూ. కనుక గోవర్ధన్ ముట్టుకోక పోయినా అతడికి మోక్షం వచ్చేదిలేదు, ముట్టుకున్నంత మాత్రాన పోయేది లేదు.

"అయితే సరే, రా. ఇద్దరం కలిసి మో[illegible]ద్దాం. పడవను చెట్టుకు కట్టేయ్. తప్పి ప్రవాహంలో పడిందంటే, అదో ముప్పు తెమ్ముకున్న వాళ్ళమవుతాం. సరే, ముందు దీపం వెలిగించు గోవర్ధన్! చీకటిపడిపోతోంది."

దీపం వెలిగించి, పడవను చెట్టుకు కట్టి, గోవర్ధన్ గట్టు ఎక్కాడు. ఇద్దరూ పట్టుకుని హారూనిఎలాగయితేనేం పడవలోకితీసుకువచ్చారు. శశి ఒక్కనిట్టూర్పు విడిచి—

"ఇహాపడవనివదిలెయ్ గోవర్ధన్, ఇదిగో ఇహా మళ్ళీ మాత్రం ముట్టుకో వద్దు సుమా!" అన్నాడు.

"నాకేటి అవసరం!"

శశి బస్తీ వెళ్ళి వస్తున్నాడు. నిర్మానుష్యంగా ఉన్న కాలువఒడ్డున-సంజమసకలో ఎవరో భూతంలా చెట్టు ఆనుకుని నిలబడి ఉండటం-శశి పడవలో కూర్చుని ఉండే చూశాడు. పిచ్చివాడైతే తప్ప, మామూలు మనిషైనవాడెవడూ ఈ వేళప్పుడు అపాయంలు తిరిగేచోట అలానుంచుని ఉండడు. శశికి ఆశ్చర్యమూ వేసింది; అపరిమితమైన కుతూహలమూ కలిగింది. పిలిచినా అరచినా సమాధానం ఏమీ రాకపోవటంతో శశి-పడవని ఒడ్డుకి పట్టించమన్నాడు గోవర్ధన్‌తో. గోవర్ధన్ మొదట్లో ఇష్టపడలేదు. ఈ పాటప్పుడు అక్కడికి మనిషనేవాడు ఎక్కణ్ణుంచి వస్తాడు? అది శశి భ్రాంతయి ఉంటుంది. ఒకవేళ ఎవరైనా నిజంగానే అక్కడ నిలబడి ఉన్నా, ఆరాతీసి కనుక్కోకుండా ఇంటికి వెళ్ళిపోవటం మేలు. కానిశశి కలకత్తాలో కాలేజీలోచదివి, డాక్టర్ ప్యాసై వచ్చినవాడు. గోవర్ధన్ అభ్యంతరాల్ని అతను చెవిని పట్టించుకోలేదు. "ఓ వేళ భూతమే అయినా కట్టి తీసుకువచ్చి, మచ్చిక చేసుకుంటానే గోవర్ధన్! పడవని ఒడ్డుకి పట్టించు," అన్నాడు.

అప్పటికింకా కొంచెం వెలుగు ఉంది. హారూచుట్టూ ఆకులూ, కొమ్మలూ అవీ పడటంతో స్తంభించిపోయిన ప్రవాహపు నీటి మిలమి[illegible]లింకా కన్పిస్తూనే ఉన్నాయి. దగ్గరకివెళ్ళి చూడటంతో నే శశి హారూని గుర్తుపట్టాడు.

"అరె, గోవర్ధన్! ఇతడు మనహారూయే! ఇక్కడికెలావచ్చాడు?"

గోవర్ధన్‌కి చాలాసేపటివరకూ నోట మాటరాలేదు; చివరికి భయపడుతూ, భయప



★ జీవనలీల ★

దుతూ గొంతు తగ్గించి "చచ్చిపోయాడా మొంసిన బాబూ? అని అడిగాడు.

"చచ్చిపోయాడు. పిడుగుపడింది."

"పాపం! జుట్టంతా కాలిపోయింది!"

హోరూకి బదులు మరెవరైనా అయినట్లయితే, ఆ చచ్చిపోయినవాని జుట్టుని గురించి గోవర్ధన్ విచారించటం చూసి శశి నవ్వుకునేవాడేమో! కాని ఊరిబయట హోరూని ఈ స్థితిలో చూడడంతో అతడి మనస్సు గతుక్కుమంది ... హోరూకి పిల్లా-జెల్లా ఉన్నారు; చుట్టాలూ, పక్కాలూ ఉన్నారు; ఎవరికీ తెలియకుండా, ఇలా ఎక్కడో ఓ చెట్టుక్రింద చచ్చిపోయి ఉండటం అనేది ఎంత దారుణమైన దుస్సంఘటన! గోవర్ధనుడి మాటతో అతడి మనసుకి మరింత విచారం కలిగింది.

గోవర్ధనుడి గుండెలు టకటక కొట్టుకుంటున్నాయి.

"ఇక్కడిట్టా నుంచోనుండటంవల్ల లాభమేముంది బాబూ! ఊళ్ళోకెళ్లి సెబుదాం రండి."

"ఇలా వదిలేసి, వెళ్ళిపోదామంటావా గోవర్ధన్?"

"అంతకంటె ఏం సేత్తారు మరి?"

"ఊళ్ళోకి వెళ్ళి, వాళ్ళవాళ్ళని వెంట పెట్టుకు వచ్చేలోగా నక్కలేవైనా పీక్కుతినడం మొదలెడితే?"

"అయితే ఏంసేద్దామంటారు సినబాబూ!" అని అడిగాడు గోవర్ధనుడు వణికిపోతూ.

"కేక పెట్టి చూడు, ఎవరైనా వస్తారేమో!"

వానగాఉన్న ఈ సంజెవేళ-కేక పెడితే రావటానికి చుటుపక్కల ఎవరుంటారు? తనకేకకి తానే ఉలిక్కిపడ్డాడు గోవర్ధనుడు. అంతకంటె ప్రయోజనం ఏమీ లేకపోయింది. రసూల్‌పూర్ సంతరోజయితే పడవలెప్పుడూ తిరుగుతూనే ఉంటాయి ఈ దారిని. ఇవాళ ఏదైనా పడవ ఇటు వస్తుందో రాదో కూడా చెప్పలేము.

హోరూని పడవలో ఎక్కించుకుని తీసుకు వెళ్ళాలన్న సంగతి శశికి అప్పుడు తోచింది.

పడవని వదిలెయ్యగానే ప్రవాహం వాలుకిపడిఅందుకుంది. గోవర్ధనుడు పడవలో కొసుగా ఉన్నచోట నుంచుని గెడ వేసి పడవను నడిపిస్తూ చటుక్కున "అవుతే అతగాడికి మోచ్చంలేనట్టేనా బాబూ?" అని అడిగాడు జిజ్ఞాసతో...

శశి చుక్కాని పట్టుకు కూర్చున్నాడు. ఆవలించి చిటిక లేస్తూ,

"ఏమో, గోవర్ధన్! ఏం చెప్పగలం?" అన్నాడు.

అతడలా ఆవలించటంతో చిరాకుగా ఉన్నట్లు గ్రహించి, గోవర్ధను డింక ఏమడగటానికీ ధైర్యం చెయ్యలేకపోయాడు.

శశి చిరాకుగా లేడు, పరధ్యానంగా ఉన్నాడు. హఠాత్తుగా వచ్చి హోరూచావు సందర్భంతో ముడిపెట్టుకోవలసి రావటం అతడికి చాలా విచారం కలిగించింది. అంతకంటే కూడా అతడికి జీవితం మీదున్న మమత విచలితం కాసాగింది, మృత్యువు ఒకొక్కరిని ఒకొక్క విధంగా కదిలించి వేస్తూంటుంది. అయినవాళ్లు, కాని వాళ్ళు ఎవరు చచ్చిపోయినా, ఆ చచ్చిపోయిన వారి కోసమై ఏడుస్తూ కూచునే వాళ్ల కోవకి చెందిన వాడుకాడు శశి. ఒక మనిషి చనిపోయి ఉండటం చూడగానే 'ఎప్పుడో ఒకప్పుడు అందరూ పోయేవాళ్ళే. తన వాళ్ళెమిటి-పరాయి వాళ్ళెమిటి - చివరికి తానూ పోయేవాడే—అన్న భావం రాలేదతడికి. శ్మశానంలో శశికి శ్మశాన వైరాగ్యం కలగలేదు. జీవితం ఉత్కృష్టమైనది, ఉపభోగ్యమయినది అనే అనిపించింది.

ఇన్నాళ్లూ జీవితాన్ని సరిగా అర్థం చేసుకుని, వ్యవహరించ లేకపోయాననే అనిపించింది. చనిపోయేంత వరకు అన్యమనస్కునిలా కాలం వెళ్ళబుచ్చటం జీవితాన్ని పూర్తిగా వ్యర్థం చేసుకోవటమే. తన విషయంలోనే కాదు, అందరి విషయంలోనూ అంతే. జీవితంలోని ఈ కుతి పూరించుకోటానికి వీల్లేనిది!

మృత్యుసాన్నిధ్యం శశిని అలా వ్యథపరిచింది.

కొంత దూరం నూటిగా వెళ్ళాక, 'గాఁవాదియా' పొలిమేర ప్రాంతాల్లో తూర్పువైపుకి తిరుగుతుంది కాలవ. అమలుపు మొదట్లోనే 'గాఁవాదియా' రేవు. 'గాఁవాదియా' చిన్న ఊరు. వర్తక వాణిజ్యాలు అంతగా జరిగే ఊరేమీ కాదు. రేవు అంటే ఏవో మట్టితో కట్టిన మెట్లు తప్ప, ఇంకేమీ ఉండవు అక్కడ. ఒడ్డున మాత్రం రేకుల షెడ్ ఒకటి ఉంటుంది. జనప నార కాలం వచ్చిందంటే— అందులో నార నిలవచేసి ఉంచి, వాజిత్‌పూర్‌లోని శశిబావమరిది అయిన-నందలాల్ గోదాములకి పంపిస్తూంటారు. నాలుగైదు దఫాలుగా అలా నిలవచేసి పంపటంతో ఆ గ్రామంలోని నార అంతా ఆఖరైపోతుంది. ఆతర్వాత ఇహసంవత్సరం పొడుగునా ఆ షెడ్డు ఖాళీగానే పడి ఉంటుంది. పశువులు, మనుషులూ ఎవరిష్టం వచ్చినట్లు వాళ్ళు ఎలా ఉపయోగించుకున్నా అడుగు చెప్పే వాళ్ళెవరూ ఉండరు. ఆ షెడ్డుకి ఎదురుగానే చండి ఓ కిర్సనాయిల్ చెక్కపెట్టెమీద జంగడిలో రంగురంగుల కాయితాలు చుట్టిన బీడీలు, పాత గుడ్డ ఒకటికప్పిపెట్టి తమలపాకులు పెట్టుకుని, పగలంతా అక్కడే కూచుని ఉంటాడు.

రేవులో కొన్ని చిన్నవీ-పెద్దవీ పడవలైతే కట్టివేసి ఉన్నాయి; కాని వాటిల్లో ఒక దాంట్లోనూ వెలుతురు కాని, మనుషులు కాని లేనేలేరు...

తనను పడవలో కాపలా ఉంచి, శశితానొక్కడే ఊళ్ళోకి వెడతానంటాడేమో అని గోవర్ధనుడికి మనసులో భయం పీకుతోంది. రేవులో పడవని కట్టెయ్యగానే అదే అన్నాడు_"నేను ఊళ్ళోకెళ్లి ఈ కబురు కాత్తా సెప్పిరానా సినబాబూ?"

"ఊఁవెళు. కాస్తకాలు ఝాడించి మరీ వడు...ముందుగోలవీధికి వెళ్ళు. నితాయీ, సుదేవ్, వంశీలను ఇక్కడున్నట్లు వచ్చేసెయ్‌మను. నేనిక్కడ ఒక్కణ్ణీ చీకట్లో శవంముందుకూచుని ఉన్నానని చెప్పు. లాంతరు నువ్వు తీసుకెళు. దారిలో నే చీకటి పడిపోతుంది. దారి జారుడుగా ఉంది," అన్నాడు శశి.

లాంతరుతీసుకుని గోవర్ధన్ వెళిపోయాడు. అప్పటికే బాగా సంజె పడింది. ఆకాశంలో ఎక్కడైనా ఓ మూల యింకా ధూసర కాంతి ఉంటే ఉండొచ్చు. కాని చీకటి గబగబా క్రమ్ముకుంటూ వచ్చేసింది. 'ఇంకొక పదిహేను ఇరవై నిమిషాలు ఆలస్యంగా మర్రిచెట్టు దగ్గిరకి చేరుకున్నట్లయితే హోరూని గుర్తుపట్టేవాణ్ణి కానుకదా' అనుకున్నాడు శశి. కాలవమీదుగా ప్రయాణం చేసేప్పుడెప్పుడూ ఈ పాములూ-దయ్యాలూ తిరుగుతూండే స్థలాన్ని పరిశీలనగా చూస్తూనే ఉంటాడతడు, అలాగే ఇవాళా చూశాడు. మొదట్లో హోరూని ఆ చెట్టుతాలూకు ఒక భాగమనే భ్రాంతిపడ్డాడతడు. బహుశః, మానవాకృతికి చెట్టుకి ఉన్న పోలికలను గమనించి, హోరూ కట్టుకునిఉన్న పంచె తాలూకు తెల్లనిరంగేమయిఉంటుందో

తెలుసుకోకుండానే - అతడు కొంచెం వణికి పోయేవాడేమో! హోరూ అక్కడే పడి ఉండేవాడు. ఎన్నాళ్లుపోయాక నక్కలూ-గద్దలూ పీక్కు తినగా, మిగిలిఉన్న బొమికెలు మాత్రం, అవి మానవునివే అన్న సంగతిని స్ఫురింపచేసేవో! ఎవరికి తెలుసు? - పంచూని చండీవాళ్ల అమ్మ. కనుక్కున్నట్లు...ఒళ్ళంతా సగం సగం కొరుక్కు తిన్న మాంసం-ఎముకలు వెళ్ళుకువచ్చాయి. అక్కడక్కడ, రెండు గుప్పిళ్ళమధ్య పెద్ద పాము ఒకటి చచ్చి ఎండిపోయి, త్రాడు లాగా వేలాడుతోంది పంచూకి అప్పుడు...

ప్రవాహ వేగానికి పడవ మెల్లి మెల్లిగా ఊగిసలాడుతోంది. పడవ కొసగా ఉన్న చోటికి అది, బ్రతికిఉన్న ప్రాణి గిలగిల కొట్టుకోవటంలా ఉంది. అటు ఊగి, ఇటు ఊగి చివరికి శశి తమాయించుకు కూచున్నాడు. బీడీ ఒకటి ముట్టిద్దామా అన్న ఆలోచన వచ్చింది మనస్సులోకి. కాని మళ్ళీ ఆ ఉత్సాహం కూడా లేకపోయింది. తన చుట్టూ కారుచీకటి క్రమ్ముకుపోతోంది. గట్టు మీది చెట్లన్నీ కారుచీకటితో కలిసిపోయాయి. నీటిమీద నిర్మానుష్యంగా ఉన్న పడవలు పై పై నీడలాగా తేలి తేలి పోతున్నట్టున్నాయి. పైనుంచి ఏవో పిట్టలు కంటికి కన్పించకుండా ఏదో రొదచేస్తూ పోతున్నాయి. చుట్టూ కీచురాళ్ల ధ్వనులు ప్రారంభమయాయి.

ఇంత దగ్గరగా ఉన్నా హోరూ ముఖం అలుక్కుపోతున్నట్లుంది. అతడి ముఖాన్ని సరిగా చూసేందుకు వ్యర్థప్రయత్నం చేశాడు. 'అతడు చచ్చిపోయాడు' అన్న సత్యం అతడికి మళ్ళీ ఏదో క్రొత్తగా స్ఫురించింది. 'హోరూ చచ్చిపోయేప్పుడు ఏమనుకున్నాడో ఎవరికీ తెలియదు కదా! ఏ ఊహ తోస్తూ ఉండగా, ఏ అనుభూతిలో ఉండగా హఠాత్తుగా మధ్యలో విఘాతం ఏర్పడిందో కదా!' అన్న ఆలోచన వచ్చింది శశికి.

కూతురికి సంబంధం చూడటంకోసమై హోరూ వాజిత్‌పూర్ వెళ్లాడన్న సంగతి శశికి తెలుసు. దగ్గరకదా, అడ్డుత్రోవను వద్దామనుకుని, అతడీ పెడదారిని దాటబోయాడు. దారి కలిసివచ్చిందతడికి...దాటిపోనూ పోయాడు...

రెండుగంటలు గడిచాక మూడు నాలుగు లాంతర్లు పట్టుకుని, హోరూ కులంవాళ్ళు ఏడెనిమిదిమంది వచ్చారు. నిశ్శబ్దంగా వున్న రేవులో, నిమిషంలో సందడి ప్రారంభమైంది.

"నితాయీ వచ్చాడా? నితాయి!" అని శశి ఆదుర్దాతో ప్రశ్నించాడు.

"చిత్తం, వచ్చాను చినబాబూ" అంటూ నితాయే పలికాడు.

నితాయి బాధ్యతా జ్ఞానం వున్నవాడని ప్రతీతి. శశిమనస్సు చాలావరకు కుదుటపడింది.

"హోరూ యింటికి కబురు అందించారా నితాయీ?"

"అందించాం చినబాబూ!"

దీపం పెద్దదిచేసి, అందరూ గుంపుగా వచ్చి, హోరూని చూడటం మొదలెట్టారు. గోవరన్ చెప్పగా ఓసారి విన్నారు జరిగిందంతా. మళ్ళీ శశి నోటిమీదుగా ఇప్పుడింకొకసారి విన్నారు

తర్వాత ఇహ అందరూ గట్టు మీద పర్రగా ఉన్న చోటులోకి వెళ్ళి కూచుని మీమాంసలో పడ్డారు...

కాసేపటికల్లా - హోరూ పరలోకయాత్ర వాళ్ళ మీమాంసలో పడి శోచనీయంగా పరిణమించిందే—అనిపించింది శశికి. వాన కురిసి ఈదురోమంటున్న ఈ రాత్రి వేళ పొగచూరిపోయినలాంతరు గుడ్డివెలుతురులో హోరూ జీవితంలోని సంఘటనల తాలూకు ముక్కలు కొన్ని చలనచిత్రం రూపు సంతరించుకుని అతడి కళ్ల ముందు కదిలిపోసాగాయి. హోరూ సంసారానికి కలిగినవసం-విచారం ఎంతటిదో ఇంతసేపటికి తెలిసి వస్తున్నట్లుంది శశికి... సంసారంలో హోరూ ఎంత స్థానాన్ని శూన్యం చేసిపోయింది—శశి గ్రహించగలిగాడు—దాన్ని సంస్కారమంటూ ఏ కోశానా లేని వీళ్ళందరి ధోరణిని బట్టే సులభంగా ఊహించుకో వచ్చు...

ఇంతవరకు హోరూ అపమృత్యువును గురించిఅతడు ఊహించనే లేదు.

(47-వ పేజీ చూడండి)

నక్షత్ర ఫలితాలు

[27-8-58 మొదలు 2-9-58 వరకు]

బి. నరసింగరావు

గ్రహస్థితి

	కు కే		
	30 తేదిని తూర్పున బుధోదయము. 2 తేదీని కుజుడు వృషభములో ప్రవేశించును. మకర, కుంభ, మీన మేషములలో చంద్రుడు. 2 తేదీని బుధవక్రత్యాగము		శు
			ర బు
	శ	గురా	

* అశ్విని [చూ, చే, చో, లా] *

ఈవారము కార్యభారము ఎక్కువ. రాజ వార్తా ప్రసంగములు, వింతమాటలు వినుట, పరాక్రమమువల్ల ఘనత, ధనలాభము, ప్రయాణము వుంటాయి. అకాలభోజనమువల్ల వేడిచేసి కడుపునొప్పి, నేత్రపీడ, బలహీనత వంటి సూచనలు కనబడగానే ఔషధ చికిత్స పొందడమే కాకుండా శనికి శాంతి చేయించుట మేలు. ఉద్యోగస్తులకు బదిలీయగుట గాని, అధికారుల ఒత్తిడికి తట్టుకోలేక శలవు పెట్టుటగాని జరుగును. విద్యార్థులకు బద్ధకము. 27 కార్యభారము 28, 29 ధనలాభము. 30 రాజకీయ అలజడి. 31, 1 కార్యానుకూలము. 2 అనారోగ్యము.

* భరణి [లీ, లూ, లే, లో] *

ఈవారము ప్రతిపనికి అనవసరముగా ఆలస్యము జరుగుతుంది. ఏపని చేసేందుకు సమాధానము కుదరక చికాకు పడతారు. ఆశాభంగం ఎక్కువ. వర్తకులకు లాభం తక్కువ. రహస్యములను కనిపెట్టుటకు ప్రభుత్వముచే నియమితులౌతారు. ఉద్యోగస్తులకు శిక్షకొరకు వనపర్వతప్రాంతములకు బదిలీ కావచ్చును. విదేశీయులతో పరిచయము, విచిత్ర వస్తుసంపాదన, కార్యసాధన. 27 ఆటంకములు, త్రిప్పట. 30 చాంచల్యము, బదిలీ 31, 1 ప్రయాణము, మిత్రదర్శనము, లాభము. 2 ఆత్మీయుల ఆరోగ్యముగురించి కలవరపాటు.

* కృత్తిక [ఆ, ఈ, ఊ, ఏ] *

యీవారం మీరు ఎవరిసహాయమునుకోరి కార్యములు చేదామనుకున్నారో ఆ వ్యక్తి వల్లే మీకు ఆటంకములు కలుగుతవి. ధనాభావము ఎక్కువగా వుంటుంది. ఆధ్యాత్మిక చింత కలవారగుటచే ఈశ్వర కృపచే అన్ని కష్టములూ గడచి క్రమేణ కార్యసిద్ధి పొందుతారు. యింట్లో వారి ఆరోగ్యము ఆందోళన కలుగచేస్తుంది. ఉద్యోగస్తులకు ఒత్తిడి. వ్యాపారస్తులకు మొదటిలో నిరాశగా ఉన్నా, వారాంతానికి కొన్నాళ్లనుండి రాకుండా నిలిచిపోయిన బాకీలు వసూలు అవుతాయి. విద్యార్థులకు చదువు సరిగా జరగదు. 27 వ్యర్థముగా తిరుగుట. 28,29 వస్త్రద్రవ్యలాభం 30 ఆటంకములు. 31.1 పుణ్యక్షేత్ర సంచారము, దేవతాదర్శనము. 2 యింట్లో అనారోగ్యం.

* రోహిణి [ఓ, వా, వీ, వూ] *

ఈవారం బంధువుల రాకపోకవల్ల ఖర్చు ఎక్కువ. రావలసినడబ్బు చేతికి అందకపోవడంవల్ల అశాంతి. కోర్టువ్యవహారములు కొంతవరకు అనుకూలిస్తాయి. పరులకు సహాయము చేయుటకు పాటుపడి మాట దక్కక నిందలు పొందుతారు. ఉద్యోగస్తులకు క్రొత్తసమస్యల వల్ల కార్యభారము ఎక్కువ. వర్తకులకు వ్యవహారముపట్ల పేచీలు. భార్యకు అనారోగ్యము. 27. కార్యభారం, త్రిప్పట. 30 నిందలూ, పేచీలు. 2. భార్య అనారోగ్యం.

* మృగశిర [వే, వో, కా, కీ] *

మీ ఆలోచనలు కార్యరూపమునకు వచ్చేందుకు ఎన్ని ఆటంకాలు కలిగినా నిరుత్సాహపడక పట్టుదలతో ప్రయత్నించి కార్యసిద్ధిని పొందుతారు. ఖర్చులకు అవసరపడిన సొమ్ము సమయానికి చేతికిరాక ఋణం చెయ్యవలసి వస్తుంది. కాని వారాంతమున తీరుస్తారు. యంత్రములవల్ల గాని, అగ్నివల్లగాని, ఎత్తుస్థలములనుండి పడుటవల్లగాని. అవయవములకు తగిలే దెబ్బలు జాగ్రత్తవల్ల తప్పవచ్చు. రసాయనిక శాస్త్రజ్ఞులకు లోహపుసామాన్లు,రంగుల వ్యాపారస్తులకు కష్టముతో కూడిన లాభము. ఇంజనీరింగుశాఖ ఉద్యోగులకు, యంత్రములు నడుపు నిపుణులకు మేలుకాలము. 27 ఆటంకములు, నిందలు. 28, 29 సోదర సహాయము. కార్యలాభము. 30 శ్రమ, 31, 1 కార్యలాభము. 2 ప్రమాదము.

* ఆర్ద్ర [కూ, ఖ, జ, ఛ] *

గత రెండు వారములనుండి కలుగుతూ ఉన్న ఆటంకములను గడిచి ఈవారము అధికారుల సహాయముచేతనూ, మీయుక్తిచేతను కార్యసిద్ధిని పొందుతారు. ధనాదాయము వృద్ధిఅవుతుంది. 27 తొట్రుపాటు. ఆపైని కార్యక్రమము ఒకదారిని నడుస్తుంది. ప్రయాణము అధికారుల ఆదరణ,ధనలాభము బంధుదర్శనము, ఈశాన్యదిక్కునుండి శుభవార్త వింటారు. డాక్టర్లకు, గణితశాస్త్రజ్ఞులకు. కవులకు, చిత్రకారులకు, నటీనటులకు యోగకాలము. విద్యార్థులకు మేలుగా ఉంటుంది. కవులు నూతన రచనలు సాగిస్తారు.

* పునర్వసు [కే, కో, హా, హీ] *

ఈవారము మీకు యోగము ఎక్కువ. ఉన్న యిబ్బందులు తీరుతవి. అనుకున్న సొమ్ము చేతికివస్తుంది. దావాలలో గెలుపు కలుగుతుంది. పురుష సంతానము సుఖ సంతోషాలకై చేసిన ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన కార్యారంభం చేస్తారు. ప్రభుత్వసన్మానం జరుగుతుంది. పండితులతో గోష్ఠి జరిపి నూతన అంశాలు తెలుసుకుంటారు. 27 ఏమి చేసిందికీ తేవలదు. 30 ఆందోళనగా వుంటుంది. వారమంతా ఉపాధ్యాయులకు పండితులకు, న్యాయస్థాన వుద్యోగులకూ మేలుకాలము.

* పుష్యమి [హూ, హే, హో, డా] *

ఈవారము మీకు యోగదాయకమైనా మానసిక ఆందోళన వుంటుంది. ధనయోగము కలుగుతుంది. కవితాగోష్ఠి, గాన సభలవంటి వినోదాలలో బంధుమిత్రులతో కలిసి పాల్గొంటారు. యిదివరకు అనారోగ్యముతో వున్న దూరస్తులయిన ఆప్తులు కోలుకొంటున్న వార్త తెలిసి సంతోషము పొందుతారు. నీటిపై ప్రయాణం చేయవలసి వస్తుంది. ప్రత్తి, దూది, నూలు, బట్టలు, బియ్యము, వెండి నగల వ్యాపారస్తులకు లాభయోగము. కవులకు, గాయకులకు, నటీనటులకు మేలుకాలము. 27 మానసిక ఆందోళన. 28, 29 నీటిపై ప్రయాణము. 30 మనోవ్యథ, 31, 1 ధనయోగము, కార్యసిద్ధి, శుభకార్యాలోచన, విందు, వినోదము.

* ఆశ్లేష [డీ, డూ, డే, డో] *

గత రెండువారములవలెనే ఈ వారము

కూడ మీకు యోగదాయకము. కొత్త అనుభవములు కలుగుతవి. ఆదాయము అనుకున్నదానికన్న ఎక్కువ అవుతుంది. శుభకార్యాలోచన చేస్తారు. సాంఘికసేవచేసి కీర్తి పొందుతారు. కొత్త విషయములను గురించి చేసిన ఆలోచనలను కార్యరూపములోకి తీసుకువస్తారు. విద్యార్థులు ఉత్సాహముగా చదువుకుంటారు. ఉద్యోగస్తులకు హోదాలో గౌరవముకూడా పెరుగుతుంది. ఖరీదైన వస్తువుల క్రయవిక్రయములలో వర్తకులకు అనుకున్నదానికన్న ఎక్కువలాభము కలుగుతుంది. 27 తెమలని కార్యక్రమము. 28, 29 ధనలాభం, కార్యసిద్ధి, సంఘసేవ. 30 అధిక ఖర్చులు, 31, 1 స్త్రీలతోనూ, ఆప్తులతోనూ విందు, వినోదము. భార్యకు అలంకార ప్రాప్తి.

* మఖ [మా, మీ, మూ, మే] *

ఈ వారము యత్న కార్యములకు ఆటంకములు కలుగుతవి. కార్యభారమువల్ల తీరుబడి వుండదు. ఆర్థికస్థితి సరిగా వుండనందున గృహావసరములు తీరక యిబ్బంది కలుగుతుంది. వేళతప్పిన నిద్ర, భోజనములవల్ల కడుపుమంట, కాళ్ళు పీకు, తలపోటువంటి అనారోగ్యసూచనలు కనబడగానే ఔషధ చికిత్స పొందుట మేలు. ఉద్యోగస్తులకు అధికారుల ఒత్తిడివున్నా మన్నన పొందుతారు. వర్తకులకు శ్రమ ఎక్కువ. రాజకీయవాదులకు మేలుగా వుంటుంది. 27 కార్యభారము, ఆటంకములు. 30 ఇబ్బంది 31, 1 పితృవర్గ సహాయము, కార్యలాభము, ధనయోగము, 2 అనారోగ్యము.

* పూర్వఫల్గుణి (పుబ్బ) *
మో, టా, టీ, టూ

ఈ వారము మీకు మిశ్రమ యోగము. మొదట్లో నిరాశగా వుంటుంది. క్రమేణా స్నేహితుల సహాయమువల్ల లాభము పొందుతారు. ధనలోపమువల్ల ఆందోళన. ఉద్యోగస్తులకు మంచిరోజులు కావు. వర్తకులకు మాంద్యం. విద్యార్థులకు శ్రద్ధ తక్కువ. ప్రభుత్వముచే రహస్యభేదనకు నియమితులౌతారు. మనోవ్యధ-గృహ కలతలు, నిరాశ వంటి అవయోగములున్ననూ, ప్రయాణము, మిత్రసహాయము, కార్యసిద్ధి. విదేశీయులతో పరిచయము, అపురూప వస్తుసంపాదన, మొదలగు మంచియోగములుకూడ కలుగుతవి.

* ఉత్తరఫల్గుణి (ఉత్తర) *
[టే, టో, పా, పీ]

ఈ వారము మీరు తలపెట్టిన పనులకు ఆటంకములు కలుగుతవి. ధనాభావమునకు తోడు బంధువుల రాకపోకలవల్ల అధిక ఖర్చులచే మనోవ్యధగా వుంటుంది. మత సంబంధమైన ఉపన్యాసములు వినుట, వ్యాసములు చదువుట. సాధు సాంగత్యముల వల్లను ఆధ్యాత్మిక చింతచేతను మనోవికాసము కలుగుతుంది. ఉద్యోగస్తులు కొంత శ్రమపడినాపైని మేలు పొందుతారు. వర్తకులకు అకస్మాత్తుగా ధనలాభము కలుగుతుంది. వారమంతా ఆటంకములు. గృహ కలతలు, అధిక ఖర్చులు, వున్నా, నష్టద్రవ్య లాభము, సాధు సాంగత్యము, ఆత్మవికాసము వంటి సుభయోగములుకూడ కలుగుతవి. 27 ఆటంకములు, అధిక ఖర్చులు. 28, 29, సాధు సాంగత్యము. ఆత్మవికాసము. 30 గృహ కలతలు. 31, 1 నష్టద్రవ్యలాభము. 2 ఆప్తుల ఆరోగ్యము సరిగా వుండనందున వ్యధ.

* హస్త [పూ, ష, ణ, ఠ] *

ఈ వారము పరోపకారమునకు పూనుకొని సాగక మాటపడి విచారిస్తారు. కార్యభారము ఎక్కువ. ధనలోపముచే క్రిందుమీదౌతారు, కోర్టు వ్యవహారములలో గెలుపు పొందుతారు. భార్య ఆరోగ్యము ఆందోళన కలిగిస్తుంది. అపరదినుసులు, వుప్ప-మినుములు, నువ్వులు-నూనె వర్తకులకు మేలుగా వుంటుంది. ఆటంకములు, కలహాలువంటి ఒడిదుడుకులున్నా ధనలాభము కార్యానుకూలతవంటి సుభయోగములుకూడ కలుగుతవి. వుద్యోగస్తులకు శెలవుపెట్టవలసివస్తుంది. విద్యార్థులకు చదువు సాగదు.

చిత్త [పే, పో, రా, రీ]

ఈ వారము రాబడికిమించిన ఖర్చులు కలుగుటచే అప్పుచేయవలసివస్తుంది. ప్రారంభించిన కార్యమునకు ఆటంకముకలిగినా అధైర్యపడక ప్రయత్నించి తుదకు ఫలప్రాప్తిని పొందుతారు. శరీరముపై కురుపులు లేస్తాయి. అగ్నివల్లగాని యంత్రములవల్లగాని, వాడి పనిముట్లవల్లగాని అవయవములకు అపాయము జరుగవచ్చు—ఉద్యోగస్తులకు అధికారుల పోటుమాటలచే మనోవ్యధ. సోదరసహాయము కలుగుటవల్ల యిదివరకు చేసిన అప్పుతీరుస్తారు. భూస్వాములకు గనుల యజమానులకున్నూ శ్రమతోకూడిన లాభయోగము. పోలీసుశాఖవారికి మేలుకాలము. 27 ధనలోపము. అప్పుచేయుట. 30 ఆటంకములు మనోవ్యధ. 31, 1 సోదర సహాయము. అప్పుతీర్చుట. 2 ప్రమాదసూచన.

* స్వాతి [రూ, రే, రో, తా] *

ఈ వారము మీ పలుకుబడివల్ల కార్యసిద్ధి పొందుతారు. ఆర్థికస్థితి బాగుంటుంది. నూతన మిత్రలాభము కలుగుతుంది. ఉద్యోగస్తులకు అధికారుల ఆదరణ కలుగుతుంది. మంచి ఉత్తరములు వస్తవి. డాక్టర్లకు, గణిత శాస్త్రజ్ఞులకు, కవులకూ, శిల్పులకూ నటీనటులకూ యోగకాలము. వస్త్రములు, ఇత్తడి, కంచు వర్తకులకు యోగకాలము. 28, 29 కార్యానుకూలత ధనయోగము. విద్యాగోష్ఠి 30 అధికఖర్చులు బద్ధకము. 31, 1 మంచివార్తలు. అధికారుల ఆదరణ. విద్యార్థులకు అనుకూలము. కవులు నూతన రచనలు ప్రారంభిస్తారు.

* విశాఖ [తీ, తూ, తే, తో]*

ఈ వారము దేవబ్రాహ్మణభక్తి పుణ్యక్షేత్ర సంచారమూ, ధనలాభము పుణ్యకార్యాచరణ. పుత్రప్రాప్తి సూచనలు. గృహమందు సుభకార్యాలోచనలు జరుగుట. బిరుదులు పొందుట. ఆకస్మిక ప్రభుసన్మానము, సుఖజీవనము. వైద్యజ్యోతిష శాస్త్ర ప్రసంగములు. ఘనకార్య ప్రయత్నములువంటి రాజయోగములు కలుగుతవి. విద్యార్థులు కొత్తసంగతులు తెలుసుకుంటారు. ఉపాధ్యాయులకు పండితులకూ, న్యాయవాదులకు, న్యాయస్థానములో ఉద్యోగస్తులకూ యోగకాలము.

* అనూరాధ [నా, నీ, నూ, నే] *

ఈ వారము మీకు తలచిన కార్యములలో జయము. నీటిమీద ప్రయాణము. తెల్లని వస్తువులుకొనుట, వినోదములలో పాల్గొనుట దధి-క్షీర-మధురపదార్థ యుక్త భోజనము, వెండి పాత్రలలో చేయుటవంటి యోగములు కలుగును. విద్యార్థులకు మేలుగా వుంటుంది, ప్రత్తి-దూది-నూలు-తెల్లని వస్త్రములు.

ధరలు:

నూలు, వస్త్రములు: నిలబాటుగా వుండును.

నూనె దినుసులు: మార్పులేదు.

బెల్లము, పచందార, చింతపండు: నిలబాటుగా వుండును.

ఆహారధాన్యములు: మందగించును.

పప్పుదినుసులు: మార్పులేదు.

వెండి. బంగారము: మందమగును.

సువృష్టిగా వర్షించును.

* * *

జన్మనక్షత్రము బట్టిగాని, జన్మనక్షత్రము తెలియనివారు నామనక్షత్రము (వారి వారి పేర్ల ననుసరించి పేరు మొదటి యక్షరము)ను బట్టిగాని ఫలితాలు తెలుసుకొనునది. కృష్ణుడను పేరునకు మృగశిరా నక్షత్రమున్నూ, హృష్టుడను పేరునకు స్వాతియూ, శ్రీధరుడను పేరునకు చిత్తయును, క్షేత్రపాలకుడనే పేరునకు హస్తయును, భీముడు, భైరవుడు అనే పేర్లకు పూర్వాషాఢయును చూచుకొనునది.

★ నక్షత్రఫలితాలు ★

వెండి-బియ్యము-ద్రవపదార్థ వస్తువుల క్రయ విక్రయములవల్ల వర్తకులకు లాభము. కవులకు-గాయకులకు-నటీనటులకుయోగకాలము వారమంతయూ సుఖయోగములు ఉన్నా 27-30 లలో మానసిక ఆందోళన వుంటుంది.

జ్యేష్ఠ [నో, యా, యి, యూ]

ఈవారము యిష్టవస్తు లాభము. వివాహాది శుభకార్యాలోచన. కృషి మూలకముగా లాభము. ధన ధాన్యవృద్ధి-పశుసంపద పరోపకారమువల్ల కీర్తి. ప్రభుత్వ కార్య నిర్వహణవల్ల గౌరవము వంటి రాజయోగములు కలుగుతవి. విద్యార్థులకు మేలుగావుంటుంది. ఖరీదైన వస్తువుల క్రయ విక్రయములలో వర్తకులకు లాభయోగము . వులకు గాయకులకు-కళాకారులకు-నటీ నటులకు యోగకాలము. వారమంతా యోగప్రదముగా ఉన్నా 30 న కుటుంబ కలహం. 2 అధిక ఖర్చులు.

* మూల [యే, యో, బా, బీ] *

ఈ వారము మీకు రాబడి తక్కువ. కార్యభారముతోపాటు ఖర్చులు ఎక్కువ గృహావసరములు తీరనందున కలతలు. ఆరోగ్యము చెడుచున్నటు సూచనలు కనబడగానే గ్రహరాజైన రవికి శాంతి చేయించుట ఔషధ చికిత్సనుపొందుట మేలు. ఉద్యోగస్తులకు క్రొత్త సమస్యలు. వర్తకులకు ఆందోళన విద్యార్థులకు మంచి కాలము కాదు. 27. ఆటంకములు, కార్యభావము 28.29 పితృవర్గమునుండి సహాయము. 30. ఆరోగ్యభంగము. 31.1 కార్యలాభము. 2 రాజకీయవాదులకు ఆందోళన.

పూర్వాషాఢ [బూ, ధ, భా, ఢా]

ఈవారము నిలకడలేని ఆలోచనలతో ఏపని చెయ్యలేకపోతారు. ధనలోపమువల్ల యిబ్బంది. శ్రమపడినప్పటికి మాటదక్కదు. గృహమందున్న వృద్ధుల అనారోగ్యము ఆందోళన కలిగిస్తుంది. ఆకస్మికముగా కలుసుకున్న మిత్రుని సహాయమువల్ల చిక్కులు తొలగి ఫలసిద్ధి కలుగుతుంది. ప్రయాణము చేయవలసివస్తుంది. అందువల వర్తకులకు లాభము. వుద్యోగస్తులకు బదిలీ అయ్యేభయముకలుగుతుంది. విద్యార్థులకు మంచి కాలము కాదు. 27 అనిశ్చితస్థితి. 30 ఆటంకములు బదిలీసూచనలు. 31.1 మిత్ర సహాయము. కార్యలాభము 2. అప్తుల ఆరోగ్యముగురించి చింత.

ఉత్తరాషాఢ [బే, బో, జా, జీ]

ఈవారము మీకు మిశ్రమయోగము. ధనలోపమువుంటుంది. అనుకున్నట్లుగా పనులు జరగవు. కోరినసహాయము లభించదు. అవసరములు తీరక ఆందోళన కలుగుతుంది. దైవముపై భారమువేసి కార్యసాధనకు ప్రయత్నించి ఫలమును పొందుతారు. వర్తకులకు చాలాకాలమునుండి రాకుండా నిలచిన బాకీలు వసూలవుతవి. 27 ధనలోపము ఆటంకములు. 28.29 పుణ్యపురుష సాంగత్యము. ఆత్మవికాసము. 30 ఇంటో వారి అనారోగ్యముచే ఆందోళన అటుపైని పుణ్యక్షేత్ర సంచారము దేవతా దర్శనము విచిత్రవస్తువులను చూచుట జరుగును. 2 వుద్యోగస్తులకు బదిలీ.

శ్రవణము [జూ, జే, జో, ఘా]

ఈవారము కార్యభారముచే శ్రమ ఎక్కువ. ఇతరులకొరకు శ్రమపడినసూచేసిన ప్రయత్నము ఫలించనందున మాటపడతారు. కోర్టు వ్యవహారములు మీపరముఅయినా మరికొన్ని క్రొత్తచిక్కులు తలెత్తుతాయి. భార్యకు ఆరోగ్యము చెడుటవల్ల ఆందోళన కలుగుతుంది. ఉద్యోగస్తులకు బదిలీ అయే సూచనలున్నవి. అపరదినుసులు పప్పు, మినుములు, నువ్వులు-నూనె వ్యాపారస్తులకులాభయోగము, అన్యజాతివారివల గౌరవము జరుగుతుంది. 27 ఆటంకములు_30 వివాదాలు. త్రిప్పట, శ్రమ. ఆపైన వారాంతము వరకు కొంత యోగప్రదముగా వుంటుంది.

* ధనిష్ఠ [గా, గీ, గూ, గే] *

ఈవారము ఎంత ప్రయత్నించినా కార్యసాధనలో అనేక ఆటంకాలు కలుగుతవి. సాహసము పట్టుదలకలవారగుటచేతను నిరాశ పొందకుండా కలిగిన చిక్కులను విప్పుకొని మేలుపొందుతారు. సోదర సహాయమువల్ల ఒడిదుడుకులు సర్దుకుంటాయి. జాగ్రత్తగా వుండుటవల అవయవములకు దెబ్బలు తగిలే ప్రమాదము తప్పవచ్చు. 27 కార్యభంగం, 28, 29 సోదరసహాయం 30 మనోవ్యథ. ప్రమాదసూచన 31, 1 కార్యానుకూలత, అప్పుతీర్చుట. 2 కలతలు.

* శతభిషం [గో, సా, సీ, సూ] *

ఈవారము మీకు యోగదాయకము. యుక్తిగా యత్నకార్యములు సాధిస్తారు. జ్ఞాతులవల్ల ధనసహాయము. అధికారులవల్ల కార్యసహాయం కలుగుతవి. క్రొత్తవారితో పరిచయ లాభము. ధనయోగము. ఈశాన్య దిక్కునుండి మంచివార్త తెలియును. విద్యార్థులకు అనుకూలము. జ్యోతిషశాస్త్రజ్ఞులకు గణితశాస్త్రజ్ఞులకు, డాక్టర్లకు, కవులకు, శిల్పులకు, నటీనటులకు యోగకాలము. 27 కొంత తొట్రుపాటు. 28, 29 అధికారులసహాయము. ధనలాభము. 30 అధిక ఖర్చులు. 31, 1 శుభవార్త. 2 ఆందోళన.

పూర్వాభాద్ర [సే, సో, దా, దీ]

యీవారం మీకు యోగప్రదం. గతవారం అవకుండా నిలిచిపోయిన పనులు యీవారం సముఖమవుతాయి. అధికారములో ధనాదాయముకూడా పెరుగుతుంది. బిరుదులు పొందుట, సన్మానములు కలుగుటవంటి రాజయోగములు కలుగుతవి. పండితగోష్ఠి. గ్రంథ పఠనముచే విజ్ఞానవృద్ధి అవుతుంది. 28, 29 ధనలాభము. కార్యానుకూలత, సంతానమునకు క్షేమాభివృద్ధి. 30 నిలకడలేనిస్థితి. 31, 1 పండితగోష్ఠి సన్మానము. ఉపాధ్యాయులకు, పండితులకు, న్యాయవాదులకు వారమంతా యోగకాలము. విద్యార్థులు క్రొత్తసంగతులు నేర్చుకుంటారు.

ఉత్తరాభాద్ర [దూ, శం, ఝా, థా]

ఈవారము అన్నిరంగములలోనూ మీరు చేసే ప్రయత్నములు అనుకూలంగా కొనసాగుతవి. ఆదాయము ఎక్కువ అవుతుంది. ఇంట్లోవారి ఆరోగ్యము బాగుపడుతుంది. దక్షిణదిక్కునుండి మంచివార్త వింటారు. కవితాగోష్ఠి - గానసభలు మున్నగు వినోదములలో పాల్గొంటారు. నీటిపై ప్రయాణం చేయవలసి వుంటుంది. విద్యార్థులకు మేలు కాలము. దధి - క్షీర మధురపదార్థ యుక్త సుఖభోజనము చేసారు. బియ్యము — నూలు — వెండి వర్తకులకు లాభము. 28, 29 ధనలాభము, కార్యసిద్ధి. 31, 1 విందు, వినోదము. 27, 30, 2 మానసిక ఆందోళన. కవులకు, గాయకులకు, నటీనటులకు యోగకాలము.

* రేవతి [దే, దో, చా, చీ] *

ఈవారము యత్నకార్యములుఫలిస్తాయి. అనుకున్నదానికన్నా ఎక్కువగా ఆదాయం పెరుగుతుంది. దూరప్రయాణం చేయవలసి వుంటుంది. సాంఘిక కార్యములలో కీర్తి గొంటారు. శుభకార్యాలోచనలు చేస్తారు. బంధుమిత్రులతోనూ, స్త్రీలతోనూ విందూ వినోదము. విద్యార్థులకు అనుకూలము. వర్తకులకు విలువగల వస్తువుల క్రయ విక్రయములలో లాభము. కవులకు, గాయకులకు, నటీనటులకు యోగకాలము. 27 ప్రయాణము. 28. 29 ధనలాభం, కార్యసిద్ధి. 30 అధిక ఖర్చులు. 31, 1 సన్మానము, శుభకార్యములలో పాల్గొంటారు. విందు, వినోదము, అలంకారప్రాప్తి. 25 కుటుంబ కలహము.

★



వనితాలోకం

‘నేను అసలే చదువుకోలేదు’

యర్రమిల్లి గాయత్రి

జులై 2వ తేదీ ఆంధ్రపత్రికలో ప్రభావతిగారు వ్రాసిన “నేనూ చదివాను బి. ఏ. ఏంలాభం?” అనే వ్యాసం, ఆగస్టు 8వ తేదీ పత్రికలో సుబ్బలక్ష్మిగారు వ్రాసిన “నేను అట్టే చదువుకోలేదు.” అనేది మా ప్రక్కయింటి అమ్మాయి చదవగా విని నేను అసలే చదువుకోలేదు కనక ఆ అమ్మాయిచే యిల్లా రాయించాను.

నిజానికి సుబ్బలక్ష్మిగారు ‘అట్టే చదువుకోలేద’న్న మాట వాస్తవమేమో ననిపిస్తోంది. లేకపోతే చక్కగ కపపడి చదివి వ్యాసయిన ప్రభావతిగారిమీద ఆమె చేసిన

‘పరీక్షలో మాట దక్కడం కాదు; ★

వ్యాఖ్యానం సమంజసంగా ఉండేది. ప్రభావతిగారి ఉద్దేశ్యాలు, భావాలు, స్త్రీ సహజమైన తత్వాన్ని వెల్లడిస్తున్నాయి. ఎంచేతనంటే కొద్దో గొప్పో చదువుకున్న స్త్రీకి, పదిమందికి తను చదువుకున్నట్లు తెలియాలని ఏం చదివారని అడిగించుకోవాలని ఆశగ ఉంటుంది. అంతేకాని ప్రభావతిగార్ని ఏం చదివావని ఎవరో అడగకపోవటం పరాభవముగా ఎంచుకొని ‘ఆడ చదువు యింతే కాబోలు, ఆడవాళ్లకి చదువు దండగ’ అని వారు నిరుత్సాహపడ్డారంటే నే నమ్మను. కారణం స్త్రీకి పురుషునితో సమాన హక్కులంటూ బయలుదేరాయి కనక స్త్రీలు పురుషులతో అన్ని విషయాల్లో అన్ని విధాల సమానంగా తూగాలని అన్ని ఊళ్లలో బయలుదేరుతున్న మహిళామండలుల అండ తీసికొని ఘట్టిగా ప్రయత్నాలు సాగుతున్నా ఫలితం కనుపించక ప్రభావతిగారు నిరుత్సాహపడియుంటారు.

“ఆడచదువు మొగచదువు అనే రకాలు లేవు. విద్య పురుషునికెంత అవసరమో స్త్రీకి అంతే అవసరమన్నారు సుబ్బలక్ష్మిగారు. చదువు అంటే హిస్టరీ, జాగ్రఫీ, సైన్సు, యింగ్లీషు, లెక్కలు మొదలయినవి. ఏదో పరీక్ష పేరుతో ముక్కుంటించుకొని ఏదో రాశాననుకొని తరువాత తెలుసున్న వాళ్ళని తెలియనివాళ్ళని పట్టుకొని మాట దక్కించుకొన్నంతమాత్రాన్న చదువు వచ్చినట్లా! అదేనా చదువంటే. ఇప్పటి చదువులు యింతకన్న ఏం ఎక్కువగ ఉన్నాయో చెప్పండి. యిప్పటి చదువులు కేవలం ఉద్యోగం చేసి పదిరూపాయలు సంపాదనకి, పెళ్లిళ్ళు అవటానికి తప్ప మరేవిధంగ యివి “చదువు” లనిపించుకొంటున్నాయి. స్త్రీ, పురుషుడు, ఎవరు ఏపనిచేయాలో చేసుకగలరో వారు అప నే చేయాలి, చివరకు చేయక తప్పదు కూడాను.

★ జీవితంలో మాట దక్కించుకోవాలి’

అంటే స్త్రీలు చదువుకున్నవారు లేరా! పెద్ద పెద్ద ఉద్యోగాలు చేస్తున్నవారు లేరా అని మీరడగవచ్చు. లేకేం! పురుషునికి నిర్ణయించిన డబ్బుసంపాదన స్త్రీ ప్రారంభించిన అదేదో దేశంలో మొగాళ్లకి పిల్లలు పుట్టటానికి ఆపరేషను చేసినట్లు పిల్లలుకూడ పుట్టినట్లు చెప్పినట్లే వుంటుంది.

‘ఈ’ చదువులు స్త్రీలను పాడుచేస్తున్నాయి కాని బాగుచేయుట చాలఅరుదు. వీటి ఫలితాలు మొదట ఎ. బి. సి. డి. లతో ప్రారంభించి యింగ్లీషుతో మాట్లాడి, పోను పోను, యింగ్లీషుతోనే నవ్వి, యింగ్లీషుతోనే తుమ్మి యింగ్లీషుతోనే ఏడ్చి, తరువాత సినీనటి యిమిటేషనులోకివచ్చి లవు మేరేజి డిక్లేరు చేయటంతో అంతరువుతున్నాయి. క్షమించాలి యివి వ్యక్తిగతంగా తీసికోకండి.

ప్రభావతిగారు “ఆడది చదువుకోటం నూటికి 75 పాళ్ళు దండగ” అని ధైర్యంగా అన్నందుకు ఆమెకి నా అభినందనాలు.

చదువు అంటే వారి వారి హద్దుల్లో వుండి వినసొంపుగ చూడ ముచ్చటగ స్త్రీ ప్రవర్తించ గలిగితే అదే ఆమెకి చదువు. అప్పుడే స్త్రీకి సంఘంలో ప్రాముఖ్యం వుంటుంది. అనాదినుండి స్త్రీకివున్న పూజనీయమయిన ప్రాముఖ్యం వారే గుర్తించుకోలేక నేను బి. ఎ. చదవాలని కొందరు ఎమ్. ఎ. అని కొందరు. కంపెనీ మేనేజరవాలని కొందరు సేల్సు ఉమన్ అని మరి కొందరు నన్ను అబల అంటే వప్పుకోను నేనూ చేయగలను పోలీసు ఉద్యోగం, బస్సు కండక్టరు పనీన్ని అని మరి కొందరు తయారవుతున్నారు.

పురుషులు, నేను వంట చేయాలి, చీర్లు జాకెట్లు కట్టుకోవాలి, పిల్లల్ని కనాలి, చూసిందల్లా తెమ్మని భార్యని అడగాలి, మా ఆవిడ ఆఫీసునుంచి సాయంత్రం వచ్చేసరికి ముస్తాబయి ఆమెను యీజీచైరులో కూర్చోపెట్టి కాఫీ అందించాలని అని అనుకునే మాట్లు వస్తే ఏమీ ఫేచీ పూచీలుండవు.

చదువుకుని ఉద్యోగమే చేయవక్కర్లేదని సుబ్బలక్ష్మిగారు శెలవిచ్చారు.

అంత ఉద్యోగానికే కాకపోతే యీ చదువెందుకు.

ఈ చదువు చదివితేకాని జ్ఞానోదయం కలుగదా?

సంసారంలోపాదుపు చేతగాదా?

భర్తల మన్నన పొందలేరా?? ★





ఆకాశమంతటా శ్రావణ మేఘాలుదట్టంగా అలముకొన్నాయి. అప్పుడప్పుడు తొలకరి మెరుపులు కళ్లు జిగేలుమనేట్లు మెరుస్తున్నాయి. అప్పుడే ప్రక్కయింటి వారి ఇందిరకు శ్రావణ పట్టీ తెచ్చారనీ చూడటానికి రమ్మని పిలుపువచ్చింది శ్యామలకు. ఆ పిలుపే, శ్యామల మరచిపో ప్రయత్నిస్తున్న శ్రావణపట్టీ ఘట్టాన్ని మళ్ళా గుర్తుకు తెచ్చింది.

అసలు ప్రతి ఏడూ జరిగేది ఆసే. చేడెల ఆశలు చిగురించే శ్రావణమాసం, క్రొత్తగా వచ్చేవియ్యాలవారికోసం తల్లిదండ్రుల సన్నాహము, వారు తెచ్చే శ్రావణపట్టీని

బి. ఎస్. లక్ష్మి

(పెడన)

తల్చుకు అమ్మాయిలు పడే హడావిడీ యివన్ని కలసి ఆలోచనల మేఘాలావరించి అనుకోకుండా గతాన్ని గుర్తుకు తెస్తాయి.

పెండ్లి అయిన తొలియేటి శ్రావణమాసము తెలుగు నెలతల మనస్సులో ఆశలు రేపటము సహజము. ఎందుకంటే ఆ మాసంలో వచ్చే వరలక్ష్మి వ్రతమునాటికి కొత్తకోడలికి అత్తవారు యథాశక్తి కానుకలిచ్చి సంతోష పెట్టడము తెనుగునాట అనాదినించి వచ్చే ఆచారము. కాగా నూతన వధువులు ఎప్పుడు శ్రావణమాసము వస్తుందా, వరలక్ష్మిపూజ చేసి అత్తవారిచ్చే క్రొత్తకానుకలు ఎప్పుడు ధరిద్దామా అనే ఆత్రంతో ఎదురు చూస్తుంటారు. ఈ క్రొత్తకోడలు ఆశలు తీరటము తీరకపోవటము అనేది అత్తవారిమీద ఆధారపడివుంటుంది. కోరికలు తీరిన క్రొత్తకోడలు మనస్సులలో తొలకరి మెరుపు సృష్టించి, తీరని కోరికలు మాత్రమే మిగిలిన శ్యామలలాంటి వనితల మనస్సులో శ్రావణ మేఘాలు మాత్రమే సృష్టిస్తుంది శ్రావణమాసం.

ఆ సంవత్సరము శ్యామలకూడా అందరిలాగే శ్రావణలక్ష్మి ఆగమనము కోసము ఎదురు తెన్నులు చూసింది. ఆ క్రిందటి సంవత్సరమే తన అక్క సరస్వతి అత్తవారు శ్రావణపట్టీ గా మావిడిపిందెల మాల తెచ్చారు. దాన్ని తను పట్టి పట్టి చూస్తూంటే, "నీకె యేటికి మీ అత్తవారూ తెస్తారు లే. చిన్నకోడలా, అనిఅక్క అత్తగారు మేలమాడింది. అప్పట్లో ఆమాటలకు తను సిగుపడ్డా పెళ్ళయిన మరునాటి నుంచితన మనస్సంతా శ్రావణ పట్టీ మీదేవుండిపోయింది. తన పెళ్లయి అత్తవారింటికి వెళ్ళినప్పుడు ఏదో మాటల సందర్భంలో తోడికోడలు శారద శ్రావణపట్టీగా యిచ్చిన పెద్ద కాసూ, కంచిపట్టు చీరచూపిస్తే తనకు కూడా శ్రావణ పట్టీ అలాగే తెచ్చినట్లయితే ఆ కాసుతో వల్లపూసలు చుట్టించుకో వచ్చని అప్పటి కప్పుడు చక్కని వూహాలల్లుకుంది.

అయితే ఏమి తనుకన్న కలలన్నీ కల్లలే అయ్యాయి. ఆ మాటంటే వారు, ఎప్పుడో అప్పుడు నీకు ముట్టేది ముట్టింది కదా! ఇంకేమి కొరత అంటారు. ఏమిటో ఈ పట్టింపులు మగవాళ్లకుండవేమో! తనకు మాత్రము ఏ ముచ్చట కా ముచ్చటే తీరాలనిపిస్తుంది.

"శ్రావణ మాసము నోములు నోపిస్తున్నాము మీ కోడలుచేత, వరలక్ష్మి వ్రతానిక్కి రావలసిందని నాన్న వుత్తరము వ్రాస్తే తన అత్తవారు జవాబేనా యివ్వలేదు. ప్రయాణ సన్నాహము మీద వుండబట్టే సమాధానం వ్రాయలేదని సరిపెట్టుకు ప్రతి బండికి ఎదురు చూసింది తను. ఆనాడు అమ్మ పూజ చేసుకునేందుకు రమ్మని పిలిచినప్పుడుకూడా మనస్సులో ఆశ

దావక ఇంకొంచెము సేపు వాళ్ళొస్తారేమో చూడకూడదా? అప్పుడే పూజ కోసము ఇంత తొందరపడాలా అని విసుక్కుంది తను. చివరకు అమ్మ బలవంతాన్న పూజ అయిందనిపించి విస్తరి ముందు కూడా అల్లాగే కూర్చుని లేచి మొక్కు చెల్లించుకుంది. ఒక్క మెతుకైనా ముట్టుకోలేదని అమ్మ కోప్పడుతుండగానే తను చెయ్యి కడుక్కు వాకిట్లోకి వచ్చేసరికి పోష్టుమేన్ వుత్తరము తెచ్చాడు.

అది తన త్తవారి వూరినుంచే వచ్చింది. తమ యింట్లో శ్రావణపట్టె ఆనవాయితి లేదంటూ వ్రాసిన మామగారి వుత్తరము చూడగానే ఆశ్చర్యము దుఃఖము ఒక్కసారి చుట్టివేశాయి తనని.

తన తోడికోడలికి జరిపిన శ్రావణపట్టె తనదగర కొచ్చేసరికి ఆనవాయితి లేనిదయిందా? పెల్లుబుకివచ్చే దుఃఖాన్ని చూసి అమ్మా నాన్నా ఏమనుకుంటారో అని తను గదిలోకి పోయి మంచంమీద వాలిపోయింది. వాకిట్లోంచి అమ్మా నాన్నగారి మాటలు వినిపిస్తున్నాయి.

'శ్రావణపట్టే వారియింట ఆచారము లేక మానేశారల్లే వుంది. పాపం అమ్మాయి చిన్నబుచ్చుకున్నట్లుంది' అంటున్నారు నాన్నగారు.

పెద్దకోడలికి జరిపిన శ్రావణపట్టె చిన్నకోడలిక ఆనవాయితి లేదంటె బుద్ధతెలిసిన పిల్ల దానికి కష్టమెయ్యదూ? అయినా మీరు ఆషాఢపట్టె పంపలేదనే అక్కసు కొద్దీ వారు కోడలికి తెచ్చే శ్రావణపట్టీ మానుకున్నారు. అంతే గాని ఆనవాయితి లేక కాదు. అయితే మనమేమీ వున్న ఆచారాన్ని లేవని బుకాయించ లేదు గా' అంటోంది అమ్మ.

అప్పుడు జ్ఞాపకమొచ్చింది తనకు. వారికి ఆషాఢపట్టే పంపలేదనే సంగతి. అయితే తన బావకే పంపలేదు మరి ఆషాఢపట్టే అమ్మా వాళ్ళూను. అయినా అక్క అత్తారు అక్కకు శ్రావణపట్టీ తెచ్చారు. వాళ్ళకు తన అత్తారికి మల్లె సాధిద్దామనే పట్టుదల లేదల్లే వుంది, కనుకనే అక్క సర్దాతీరింది. ఇల్లా అనుకుంటూనే తను నిద్రపోయింది.

అమ్మవచ్చి, 'శుక్రవారప్పూటా కలకలలాడుతూ వుండాల్సిన యిల్లు ఎల్లావుందే అమ్మా, నీకీ నిద్రకూడా ఏమిటి. లేచి మొహంకడుక్కుని మీ నాన్నగారు తెచ్చిన కొత్తచీర కట్టుకో. ఎవరి అక్కసులు వారికే వుంటాయిలే,' అని లేపేవరకు తనకు మెలకువరాలేదు. ఏదో అమ్మ బలవంతముమీద కొత్తచీర కట్టుకున్నదన్న మాటే కానీ ఏదో తీరని వ్యథ మనసును వేధిస్తూండగా ఏదో తప్పుచేసిన దానిలా బయటికే పోలేదు ఆరోజంతా, ఎన్నోరోజులనుంచి తన మనస్సులో కోరికలూరించిన శ్రావణమాసం చివరకు తీరని కోరికను మాత్రము వదలి మెల్లగా జారుకొంది.

తనను తీసుకు వెళ్ళేందుకు వారు వస్తూన్నట్లు ఆరోజే వుత్తరము వచ్చింది. వారు రాగానే ఎన్నెన్నో అడిగి తనమనసులో ఆ వేదనంతా బయట పెట్టాలనుకుంది. తీరా, "శ్యామా!" అన్న వారిపిలుపు చెవిని పడగానే పట్టుదంతా సడలిపోయి నాగస్వరంవిన్న నాగుబాములా మనస్సు ఆనందంతో పరవశులై త్రొక్కింది.

దానితో, పెద్దవాళ్ళు పంపనిదానికి పాపం. వారేమి చేస్తారని సరిపెట్టుకుందితను,

ఆ రాత్రి వారు మాట్లాడుతూ, "శ్యామా! ఈ సారి నువు "ఆశీర్వాదాలతోనే" స్వాగత మిస్తావనుకున్న నాకు ఆనందంతో స్వాగత మిచ్చావు. అందుకే భక్తుడు సమర్పించే చిన్న కానుకను స్వీకరించు" అంటూ జాజుల నెక్లేస్ తీసి తనమెడలో స్వయంగా పెడుతూంటే తను ఆనందంతో ఉక్కిరిబిక్కిరయింది.

పాడుమనస్సు, అంత ఆనందములోనూ 'నాకు శ్రావణపట్టే లేదుసుమా' అని గోల పెడుతూనే వుంది.

తర్వాత వారు చెప్పారు. మొదట శ్రావణపట్టేకోసమే ఆ నెక్లేస్ చేయించారుట. ఏం తమకొడుక్కి ఆషాఢపట్టే పంపనప్పుడు శ్రావణపట్టే పంపేదేమిటని అత్తగారు భీష్మించుకు కూర్చున్నారుట. చివరకు ఏమనుకున్నారో ఏమో; కొడుకు బయల్దేరి వస్తూంటె "దానికోసం చేయించిన వస్తువు నాకెందుకూ? తీసికెళ్ళియియ్యి, ఎవరిమాట వారికే వుంటుంది" అన్నారుట అత్తగారు.

ఏమైతేనేమి తనుకోరిన వస్తువు లభ్యమయినా, శ్రావణపట్టే తనకు తీరలేదనే కొరత కొరతగానే మిగిలిపోయింది ఈ నాటికీ. ఇంతసేపూ ఆలోచనలతో ప్రొద్దుపోక పెట్టే కానే, వాళ్ళ యిందరకు శ్రావణపట్టే ఏమి తెచ్చారో చూసిరావాలి అనుకుంటూ బయలుదేరింది శ్యామల. ★

గృహ వైద్యం:

తులసిమాత

పూర్వం నుండి మనదేశంలో, ముఖ్యంగా హిందువులు మాతృదేవతకు, గోమాతకు, తులసిమాతకు అగ్రస్థానాలిచ్చారు. దీనికి అనేక కారణాలు చెప్తారు. ప్రతి హిందువుని ఇంటా తులసికోటలు కట్టించి, అందులో తులసిమొక్కను నాటి, ప్రతిదినం ఉదయం, సాయంత్రం, స్నానం చేసి, ఆ మొక్కను పూజించి ఆ తులసిదళంతో తీర్థం తీసికోడం ఆచారమై పోయింది. ఇది ఆయుష్షు వృద్ధిచేస్తుందని, రోగాలు మాన్పుతుందని నమ్మకం. తులసమ్మ మీదనుండి వీచిన గాలి ఆరోగ్యాన్ని చేకూరుస్తుంది. దీనికి అనేక కారణాలు కూడా ఉన్నాయి.

పడమటిఆఫ్రికాలో, మేజర్ లారీమెనేర్ అను వైద్య శాస్త్రజ్ఞుడు దాని ప్రభావాన్ని చూడాలని తనఇంటిచుట్టు తులసి మొక్కలు వేసి పెంచాడుట. ఆ ప్రభావం వల్ల ఆ చుట్టుపట్ల ఉండే రోగాలన్నీ క్రమంగా నయమయ్యేయట. అప్పటినుండి అతడు తులసిమాత నిజంగా పూజనీయురాలని ప్రచారం సాగించాడుట.

తులసెమ్మను గురించిన ఒక కథ కూడా చెపుతారు. మనవాళ్ళు. బృందఅనే భక్తురాలు ఉంది. ఆవిడే ఒకప్పుడు తులసిగాను, మరొకప్పుడు రాధగాను అవతరించినదని పెద్దలంటారు. అందుచేతనే మనస్త్రీలు తులసెమ్మకు కోటకట్టింది, ప్రతిరోజూ పూజ చేసి తీర్థం తీసుకుంటుంటారు. రుక్మిణీదేవి తులసిదళంతో శ్రీకృష్ణుని తూచిందని మనందరకు తెలిసిన విషయమే. ఈ ప్రభావం తులసీదళంలోనున్న అనిడభక్తికి నిదర్శనం.

ఆయుర్వేదంలో తులసి ప్రభావాన్ని గూర్చి ఎంతైనా ఉంది. తులసిదళాలు తింటే శరీరానికి వేడికలిగి కఫం హరిస్తుంది. సూక్ష్మజీవులు హరిస్తాయి. అన్నం హితవు లేక పోవడం పోతుంది.

తులసిదళం, తుమ్మపూవు, మిరియాలు కలిపిన ఔషధం ఎలాంటి విషజ్వరాలైనా రూపుమాపేస్తుంది. తులసిరసం రక్తాన్ని శుద్ధి చేస్తుంది.

తులసిలో రకాలున్నాయి. లక్ష్మీతులసి, భూతులసి, కృష్ణతులసి. భూతులసిరసం పాముకాటుకు విరుగుడనిచెప్తారు. రామతులసిని ఇంట్లో ఉంచితే దోమలు మొదలైన కీటకాలు రావని మనందరకు తెలిసిందే.

అందుచేత సర్వరోగ నివారిణి, సర్వకామితార్థిని అయిన తులశమ్మను చేరదీస్తే ఇంగ్లీషు మందులకు డబ్బు పొయ్యనక్కర లేదు. పూర్వులేర్పరచిన ప్రతి సంప్రదాయంలోనూ ఇలాగే అనేక ప్రయోజనాలు ఉంటాయి. మనం అది గ్రహించక పిచ్చి పిచ్చి ఆచారాలని త్రోసిపారేస్తుంటాము.

ఎం. వి. కమలాదేవి, (రాజమండ్రి.)

* * *

మచ్చపడని కుంకుమ

టి. యస్. ఆర్. కృష్ణగారు (విజయవాడ) "మొహాన మచ్చపడని కుంకుమ" చేసే విధం తెలిస్తే వ్రాయమన్నారు. నాకు అలాగే మచ్చ పడితే మా అత్తవారియింట్లో తయారుచేసిన కుంకుమ పెట్టుకుంటే పోయింది. కనుక యీ క్రిందివిధముగా తయారుచేసి పెట్టుకుంటారని వ్రాస్తున్నాను.

కావలసిన సామానులు: అరవీసె పసుపు కొమ్ములు, ఆరుతులాలు పటిక, ఏడున్నర తులాలు వెలిగారం, కొన్ని నిమ్మకాయలు.

మొదట పసుపుకొమ్ములను శుభ్రముగా కడిగి చిన్న చిన్న ముక్కలుగా కొట్టవలెను. కొట్టిన కొమ్ములను యెండబెట్టనక్కరలేదు. తర్వాత పటికను, వెలిగారమును వేరు వేరుగా మెత్తగా కాటుకవలె నూరవలెను. ఒక జాడీలో గాని రాచ్చిప్పలో గాని నిమ్మకాయ రసమును గింజలు లేకుండా పిండి అందులో నూరిన పటిక, వెలిగారప్పొడీ వేసి ఆ రసములో చితకొట్టిన పసుపు కొమ్ములను వేసి బాగా కలుపవలెను. పసుపు కొమ్ములు మునిగేంతవరకు రాచ్చిప్పలో నిమ్మకాయరసముండాలి. ఆ రసములో కొమ్ములు పీల్చుకు నేవరకు రోజు కొకసారి కర్రపుల్లతో కలుపుతూండాలి. తరువాత వాటిని నాలయిదు రోజులు నీడనే యెండ బెట్టాలి. వాటిని తరువాత రెండు మూడు రోజులు యెండలో యెండబెట్టి సీసాలో పోసుకోవాలి. అందులోంచి కావలసినన్ని కొమ్ములను కొట్టుకొని వస్త్రకాళితం పట్టాలి. పావు శేరు (కొల్త) కుంకుమకి రెండు టీస్పూన్లు నూనె వేసి నూరాక శుభ్రమైన సీసాలో పోసుకుని వాడుకోవచ్చు.

ఇదే నిష్పత్తిలో తక్కువగా కూడ చేసుకోవచ్చును.

తయారుచేయునప్పుడు ఇత్తడిసామానేదీ వాడకూడదు.

ఎ. ధనలక్ష్మి.

* * *

వానాకాలం ఒరుపులకు

ఈ వానాకాలం నీళ్ళల్లో నానడం మూలంగా (వేళ్ళసందులలో వరిసి అమితముగా దురదపెట్టి పుండుగామారి బాధ పెడతాయి ఈవిధంగా వరిసినపుడు తేలిగ్గా దొరికే నూతిప్రక్కల మొలుస్తువుండే నాచును సంపాదించి, అందులో కొద్దిగా ఉప్పు, రెండు మిరియపుగింజలు వేసి నూరి, ఆ ముద్దను ఈ వరుపులకు ఫటిస్తే తగుతాయి. పసుపులో నూనెపోసి కలిపినముద్ద చిన్న చిన్న వరుపులకు పనిచేయవచ్చు కాని ఇది పెద్దవరుపులకు గుణమివ్వదు.

ఎస్. సీతాబాయమ్మ (ఆత్రేయపురం.)

★

మేనేజర్‌కు తెలుసును...

ఎక్కువసేపు తాను షర్టుతో కనపడుతుండటం ఆయనకు తెలుసును. తన షర్టు చాల అందంగా కనపడటమే కాకుండ, పగలంతా శుభ్రంగా ఉండటం కూడ. ఆయనకు ప్రధానం, అందువల్లనే, దుస్తులు చాల ముఖ్యమైన విషయమని అనుకునే అనేక ఇతరమంది మాదిరిగా, ఆయన బిన్నీవారి షర్టింగే కొంటాడు. బిన్నీవారి షర్టింగ్ గుడ్డ చెక్కుచెదరక, శుభ్రంగా కనపడుతూంటుంది.

మాస్కట్ • ఓపల్ • సెల్లా • గోల్డ్ స్టాండర్డ్

ది బెంగళూర్ వులెన్, కాటన్ & సిల్క్ మిల్స్ కంపెనీ లిమిటెడ్.

మేనేజింగ్ ఏజంట్లు : బిన్నీ & కో (మద్రాసు) లిమిటెడ్, మద్రాసు.



BY 258

వనితా వాణి



ఊహ మంచిదే

శ్యామలాదేవిగారు మధ్య తరగతి జీత గాండ్ర విషయమయి చక్కగా ముచ్చటించేరు.

వచ్చే జీతం తక్కువ; చేసే ఖర్చులు ఎక్కువ అయితే ఉద్యోగి అప్పులలో తేలియాడవలసి వస్తుంది. జీతం వచ్చినవెంటనే మొత్తానికి సరిపోయే ఖర్చులుచేసి పిదప బాధలు పడడంకన్నా, శ్యామలాదేవిగారు చెప్పినట్లు నెల మొదట్లో కోరికలు కొంచెం అదుపులో పెట్టుకుంటే నెలాఖరువరకు సవ్యంగా సాగిపోతుందనే" సలహా పాటించటము సర్వదా శ్రేయము.

మొకమాటపు నారాయణమ్మ (వైరా)

* * *

స్థితీ, గతీ

శ్యామలాదేవిగారు స్థితిగతులను అర్థం చేసుకున్నట్లు లేదు. కోరికల సంగతి అలా ఉంచుదాం. సామాన్యమయిన అవసరాలయినా నేటి మధ్యతరగతివారి జీత భత్యాలతో పూరించబడుతున్నాయా అని ఆమె ఆలోచించారా?

నిరుద్యోగ సమస్య ప్రబలిపోయిన ఈ రోజులలో ఉద్యోగము దొరుకుతే చాలని సంతోషించి శ్రమించే విద్యావంతులపాట్లు ఎంతటివో ఆలోచించారా? ధరవరలు శిఖరాగ్రాలు అందుకొంటున్న ఈరోజులలో వచ్చేజీతంతో తన సంసారాన్ని పోషించుకొనలేక బాధలుపడి అప్పులపాలవుతున్న వారిపరిస్థితులు ఆలోచించారా?

దినదిన ప్రవర్ధమాన మగుచున్న సంతానంతో కుచేలుని బోలుచు ఇతరేతర సహాయాలకోసం ఎదురుచూడవలసి వస్తున్న ఉద్యోగస్తుల విషయం ఆలోచించారా?

"అడిగిన జీతం" కాకపోయినా అవసరమయిన జీతమయినా ఈయని కొలువుచేసేటప్పుడు ఫస్టు తారీకుకోసం ఎదురు చూడటములో తప్పా?

నూరు రూపాయలు ఆదాయంవస్తూ ఒకరిద్దరు గల కుటుంబాలన్ని దృష్టిలో పెట్టుకొని వ్రాసేవారు పదుగురుగల కుటుంబాలలోని కష్టనిష్ఠూరాలనుకూడా దృష్టిలో నుంచుకొంటే మంచిదేమో? తేలికగా సలహాలుఇచ్చి ప్రభుత్వం ఈ మధ్యతరగతి ఉద్యోగస్తుల విషయమయి సక్రమమయిన సత్వరచర్యలు తీసుకొననంతకాలం ఆమె భావించినట్లు "అప్పులేని నెలాఖరులు" అనేవి ఎన్నటికీ సాధ్యపడవు. తేలికగా సలహాలు విసిరేశారు. కాబట్టి ఇంతగా వ్రాశాను. ఏమీ అనుకోకండి.

కామిసెట్టి సత్యవేణి (వె. రా.)

* * *

మధ్య తరగతి సంసారంలో: "వస్తుందో౦ స్తుందన్న ఫస్టు తారీకు ఏం తెస్తుంది" అనే వ్యాసం వ్రాసిన యర్రమిలి గాయత్రిగారికి నా అభివందనములు. వారు చెప్పిన ఖర్చులలో ఏ ఖర్చు తగ్గించటానికీ వీలుండదు. శ్యామలాదేవిగారు చెప్పినట్లు రూ. 5 నెలకి నిల్వచేయాలంటే ఏ రోడ్డు ప్రక్కనో వుంటే నెలకి రూ 5 లే కాదు రూ 10 లు నిల్వచేయవచ్చు. నేను యర్రమిల్లి గాయత్రి దేవిగారితో ఏకీభవిస్తున్నాను.

—గురజాడలత, హైదరాబాద్]

* * *

'...అగత్యంలేదు'

రాధగారిబాధ బోధపడలేదు. మన మహిళాలోకానికి క్రొత్తగా ఎన్నో హక్కులు ప్రభుత్వ శాసనాలవల్ల లభించాయి. అనాధవితంతువులకు శరణాలయాలు ఎన్నో ఏర్పడ్డాయి. వారు ఆశ్రయం ఇచ్చి సంబంధాలు కుదిర్చి వెంటనే పెండ్లిండ్లు చేస్తున్నారు. పెద్దలుగూడ ప్రస్తుతంలో వితంతు పునర్వివాహాలనుగురించి అభ్యంతర పెట్టినట్టుగా కనుపించుటలేదు. పురుషునితోపాటు స్త్రీకూడా యిష్టపడే మగవాడుంటే, ఎన్నైనా పెండ్లిండ్లు చేసుకోవచ్చు. విడాకులు ఎప్పుడుపడితే అప్పుడు యిచ్చుకోవచ్చు. ఈ దృష్టితో చూస్తే 'విషాదగాధ'లను విస్తీర్ణం చేసుకునే అవుసరం, ప్రస్తుతంలో లేదు.

—కొల్లిపర విజయేశ్వరీదేవి,
చిలుకూరు, గుంటూరుజిల్లా]

* * *

వితంతువులు పునర్వివాహం చేసుకొని, సుఖంగా సంతోషంగా జీవించడానికి లోకంగాని, సంఘంగాని ఈనాడు ఏ ఆటంకాలూ పెట్టటంలేదు. కాబట్టి సంఘాన్ని అంత హేయంగా తలంచవద్దని రాధగారిని కోరుచున్నాను.

—వి. అప్పాజీరావు,
వీరఘట్టం-(శ్రీకాకుళంజిల్లా]

* * *

ఈ నాడు

"విషాదగాధ-వింటేబాధ" అను వ్యాసాన్ని చదివాను. కాని పూర్తిగా చదివినతర్వాత నిజంగా ఆశ్చర్యపోయాను. వితంతుస్త్రీలు (బాలలైనాసరే) అటువంటి కష్టాలపాలబడం యీరోజుల్లో నే నెక్కడా చూడటంలేదు. మన ముత్తాతలనాటి హయాంలోనంటారా అది యిప్పుడు అప్రస్తుతం.

కె. కృష్ణవేణిగారు వ్రాసిన "సంస్కారంఅంటే..." అను వ్యాసాన్ని బాగా వ్రాశారు. కాని వారితో నేను పూర్తిగా ఏకీభవించలేకపోతున్నాను.

—తిరునగరు జనార్ధన, (సూర్యాపేట).

* * *

'నా భయం'

నేను అట్టే చదువుకోలేదు, అని మోచర్ల సుబ్బలక్ష్మిగారు, వ్రాసిన వ్యాసము చదివి చాలా సంతోషించాను. చదువుకున్న సోదరీమణులు టి. ప్రభావతిగారు ఎవరూ అడగలేదని బాధపడితే, చదువుకోనివారు ఎక్కడికి వెళ్ళినా ఏమి చదువుకున్నావు అని ఎవరైనా అడుగుతారేమో అని బాధపడతారు. నా మటుకు నేను ఎక్కువ చదువుకోలేదు. అందుచేతనే సుబ్బలక్ష్మిగారి భావంతో ఏకీభవిస్తున్నాను.

—కొమాండూరి రాఘవ, నెల్లూరు.]

* * *

డిగ్రీలు - జీవితం

డిగ్రీవస్తేనే విజ్ఞానం వస్తుందనుకోవడం భ్రమ. విజ్ఞానానికి డిగ్రీకి సంబంధం లేదు. ఒక వేళ అదిధంగా అయినట్లయితే పెద్ద పెద్దవాళ్లు జుట్టులు పీక్కోవలసిన సమస్య అయ్యేదికాదు. డిగ్రీ ఉందనంగానే వారు అన్ని సమస్యల్నీ అర్థం చేసుకోగలరనా మీ అభిప్రాయం? డిగ్రీలేనివారు అర్థంచేసుకోలేరా? భర్త చెప్పిన మాటలను వివిధంగా అర్థం చేసు

కోవాలి అని ఇంతవరకూ, నాకు తెలిసినంత వరకూ, ఏ శాస్త్రం బోధించటంలేదు.

వేల కట్నాల కాశపడి నక్కలు గేట యినా చూడని అమ్మాయిని చేసుకున్నప్పుడు ఆ అమ్మాయికి తనకు కావల్సిన విధంగా విద్య నేర్పుకోవడం అతని విధి. నేర్పిన వాళ్ళూ ఉన్నారు. నేర్పుకున్న వాళ్ళూ ఉన్నారు.

—కృష్ణ, వాల్తేరు]

*　　*　　*

"నేను అట్టే చదువుకోలేదు" అని మోచర్ల సుబ్బలక్ష్మిగారు వ్రాసిన వ్యాసం చాల బాగుంది. ఆమె వ్రాసినట్లు స్త్రీకి విద్య అనవసరమని బి. ఏ. డిగ్రీ పొందిన ప్రభావతివంటి వారే అంటూంటే ఇంక మగవారు నిరుత్సాహ పరచడంలో వాళ్ళ తప్పేముంది. ఇంతికీ విద్య అభ్యసించడము విజ్ఞానముకొఱకు. అది ఒకళ్ళు మనకిచ్చే మెప్పుకోసం లేదు. ముఖ్యంగా స్త్రీకి విద్య ఏ విషయంలోనైనా వజ్రాయుధం వంటిది.

—కె. రవణ, ఏలూరు.]

*　　*　　*

మోచర్ల సుబ్బలక్ష్మిగారి అభిప్రాయంతో నేను ఏకీభవిస్తున్నాను.

—జయలక్ష్మి, (అనంతపురము.)

*　　*　　*

"నేను అట్టే చదువుకోలేదు" అని మోచర్ల సుబ్బలక్ష్మిగారు (భీమవరం) వ్రాసిన వ్యాసం చదివాను. మంచి వ్యాసాలకు అది మచ్చుతునకలాంటిదన్నమాట; ఆమెకు నా అభినందనలు.

సోమంచి సత్యవతి, (ములుగు-వరంగల్)

కాఠిన్యం తగదు

'నేనుచదివాను బి. ఎ అయితే ఏంలాభం?' అనే వ్యాసం మీద సోదరీ మణులు కుమారి, టి. ఎస్. ఆర్. కృష్ణ, బి. ఎ. కుమారి, పి. సరోజని, బి. ఎ. ఎం. విమల చేసిన విమర్శ చాల కటువుగానూ, సంకుచితంగానూ వుంది.

ప్రపంచంలో మనుష్యుల అభిరుచులు వాళ్ళ వాళ్ళ మన స్తత్వాలననుసరించి వుంటుంది కాని ఒకరు నిర్దేశించినంత మంత్రాన అవి మారవు. వన్నడిగితే చాలమందిసోదరీమణులు టి. ప్రభావతిగారితో ఏకీభవించని మాట నిజమయినా ఆవిడగారి వ్యాసంలో అర్థం లేకపోవడమనేది నిజంకాదు.

ఇంతకీ విమర్శ చెయ్యడమనేది కేవలం, అవతల వాళ్ళ లోపాల్ని కఠినంగా బయట పెట్టడం కాదని నాఅభిప్రాయం. ప్రభావతి గారింతటితో నిరాశ చెందక కొంగ్రొత్త వ్యాసాల్ని వనితాలోకానికి అందిస్తారని ఆశిస్తున్నాను...

—దాక్షాయిణి, ధవళేశ్వరం]

ఆడవాళ్ళకి విద్య నిరర్థకం అంటే ఒప్పను. బి. ఏ. చదివిన టి. ప్రభావతిగారు అలా అనడం భావ్యంకాదు.

—డి. సుభద్రాదేవి, అయినాం]

*　　*　　*

కట్నాల పట్టుదల ఎవరిది?

పి. యస్. ప్రభావతిగారు వ్రాసిన 'కట్న పిశాచి' అను వ్యాసమును చదివి ఆశ్చర్య పడాను. అసలు ప్రతికుటుంబములోను కట్నములు తీసుకొనవలెనని ఆతురత పురుషులకన్న స్త్రీలదే యెక్కువ.

—కొలచల మల్లికార్జునరావు, తాడేపల్లి]

*　　*　　*

క్రొత్త చట్టం!

టి. వి. లక్ష్మిగారు వ్రాసిన "ఇంకా వున్నారా?" అనేలేఖ చాలా బావుంది. ఇకముందు భార్యపోయి తిరిగి వివాహ మాడ దలచిన ప్రతిపురుషుడూ, వితంతువునే కాని వివాహ మాడకూడదనే చట్టాన్ని అమలులో పెట్టవలెననే విషయంతో, నేనేకీ భవిస్తున్నాను. ప్రభుత్వంవారు ఇందులోని న్యాయాన్యాయములను పరిశీలించి ఇకముండి చట్టాన్ని అమలుపరుస్తారని తలుస్తాను.

—రాజ్యం చౌదరి, తెనాలి.]

*　　*　　*

ఆగస్టు 13 వ తేదీ పత్రికలో 'తప్పెవరిది?' అని వ్రాసిన మందడి భారతీ దేవిగారి అభిప్రాయముతో నేనుకూడ ఏకీభవిస్తున్నాను పిలిచి పిల్లనిస్తామంటూపోతే వరుడుగల తల్లిదండ్రులు కట్నము ఏమిస్తారు అని ప్రశ్నిస్తారు.

నాకు కట్నము ఏమాత్రము అక్కరలేదు నేను ఆ అమ్మాయినే చేసుకుంటాను అని ఒక్క పెళ్ళికుమారుడు ధైర్యంగా ముందడుగు వేయటంలేదు.

—వి. ప్రమీలాదేవి, విజయవాడ.]

*　　*　　*

30-7-58 తేదీ ఆంధ్రపత్రిక సచిత్ర వార పత్రికలో "వంటలు" అనే శీర్షిక క్రింద 'మైసూరు బోండా' తయారుచేయువిధము వ్రాసినారు. నేను శ్రీమతి కొత్తపల్లి రాజ్య లక్ష్మిగారు వ్రాసిన విధముగా తయారుచేసి తిని. బాగా కుదిరినవి. వారికి ధన్యవాదాలు.

—ప్రమీలా మధుసూదన్,
భిలాయ్ - మధ్యప్రదేశ్]

*　　*　　*

అభినందనలు

ఆంధ్రపత్రిక వనితాలోకంలో ప్రచురించే వ్యాసాలన్ని ఎంతో బాగుంటున్నాయి. ఈమధ్య శ్రీమతి భానుమతి-రామకృష్ణగారు సంగ్రహంగా వ్రాసిన 'పెరల్ బక్' జీవితచరిత్ర చాలబాగుంది. అంతపెద్ద పుస్తకాన్ని ఎంతోచక్కగా కుదించి వ్రాశారు. ఆమెకు మా అభినందనలు ఈ పత్రికద్వారా తెలియజేస్తున్నాము.

ఈ విభాగంలో (వనితాలోకం) ఒక్కరి యొక్క ప్రభావమే కాకుండ అందరు తమ తమ అభిప్రాయాలను చక్కని వ్యాసాలలో తెలియజేయటానికి సావకాశం కల్పించినందుకు ఎంతో సంతోషిస్తున్నాము.

—పి. సరోజిని, పి. రాధ, ఐ. సీత,
(రాజమండ్రి.)

*　　*　　*

తన చదువే తన శత్రువు?

ఒక స్త్రీ, తన చదువు ఎవరిచేత గుర్తించ బడక, గృహిణి జీవితంకూడ తను ఆశించినట్లు ఉండకపోతే ఆమె పడే బాధ అనుభవించినవారికి కాని తెలియదు. పరులు ఆడగడంమాట దేము డెరుగును. ఇంట్లోవారికే చదువువల్ల ఆడది కంటకం అవడంకూడా ఉంది. నా స్నేహితురాలు ఇంటర్ ప్యాసు అయినది. తిరువాత తలితండ్రుల బలవంతముచే ఒక గ్రాడ్యుయేటును పెళ్ళిచేసుకొంది. అతను మంచిఉద్యోగము చేస్తూన్నాడు. పెళ్ళికిముందు అతను వారింటికి వస్తూండే వాడు. అప్పుడు అతని మాటలకు ఇప్పుడు చేతలకు ఎంతో తేడా వుంది. అతను స్త్రీ అన్నది పురుషుని సమభాగినియని, చదువుకొన్న స్త్రీ యయిన భర్తకు అనుగుణముగా ఉండి అతనికి అన్నివిధముల సహాయము చేయునని ఎన్నొన్నో చెప్పతూవుండేవాడు. కాని తీరా పెళ్ళఅయినతిరువాత ఆమె పరిస్థితి పూర్తిగా వ్యతిరేకం అయింది. ఆమెకు వంటలో ఎక్కువ ప్రావీణ్యంలేదు. కాని ఆమెకు ఇప్పుడు వంటిల్లే పుస్తి. అత్త, ఆడబిడ్డలు అంతా వున్నారు. కాని ఇప్పుడు ఆమె తన స్నేహితులు వ్రాసిన ఉత్తరములు అయినను భర్త చదువనిదే చదువుటకు వీలులేదు. ఆమె స్వంతంగా ఎవరికైనా ఉత్తరము రాద్దామన్నా భర్త ఎందుకు లెద్దూ స్నేహితులందరికి నీకె వచ్చు మహాచదువు అని హేళనలు, వెక్కిరింపులూను. ఆమె ఏమి చేస్తుంది. కనీసం సినీమాలకికూడ అత్తగారు రానిదే ఆమెను తీసుకొనివెళ్ళడు. హిందీ పిక్చర్ కి వెళ్లామంటె చదువుకొన్నవాళ్లుఅని అత్తగారు దెప్పి పొడుస్తుంది.

అటువంటప్పుడు ఆమె చదువువల్ల ప్రయోజనమేమి? ఆమెకు చదువే మరింత దుఃఖహేతువు అయినది. కనీసం తను చదివిన చదువుకు కొంతయినా గౌరవముంటే ఆమె సంతోషించుతుంది. కాని అటువంటి స్త్రీ నిస్పృహ చెందిందంటే ఆశ్చర్యమేమీ లేదనుకుంటాను.

—ఎం. వి. రమాదేవి, పెక్కలి.]

★ మనిషిలో మనిషి ★

(16-వ పేజీ తరువాయి)

ఓ అడుగువేసి) ఇంతకూ ఈతర్కం అంతా దేనికి?

సుజాత : నువ్వు బాబీని ద్వేషించ నక్కరలేదని! నిజానికి నువ్వు బాబీవేనని!

సరళ : కోకు! కోకు!

రఘు : (నవ్వుతూ) నేనా?

సుజాత : అవును. అతనిలాగే నువ్వు కూడా రొమాంటిక్‌గా, ఛార్మింగ్‌గా వుంటావు. అతనికుండాల్సిన ప్రెఫ్‌నెస్, సిన్సియారిటీ నీలోకూడా వున్నాయి! కాకపోతే అతనికీ నీకూ ఒకటేలేదా! అతను ప్రతి చిన్నవిషయానికీ ఇట్టే తల్లకిందులౌతాడు-నువ్వింకా కావడంలేదు. అంతే!

సరళ : (తింటూ)ఏం-ఈపూట వీళ్ళింట్లో విందుఅనా ఆమాత్రం క్రెడిటయినా ఇచ్చావ్?

సుజాత : (రఘుతో) నీలో కొన్ని లక్షణాలున్నాయి. ఏ వేషంవేసినా ఆ లక్షణాలు బైటపడుతూంటాయి. బాబీ పాత్ర పోషణకి అద్భుతంగా పనికొచ్చాయి అవి. కాని-నువ్వు ఏ విలన్ వేషమో భార్యను చావబాదే ఏ భర్త వేషమో వేసేమటుకు ఆ వేషంలో రాణించడం నీతరంకాదు. ఎందుకంటే నువ్వు స్వతః బాబీవి కనుక!

రఘు : పోపోస్ - బాబీకీ నాకూ సహస్రాంశం తేడా వుంది.

సరళ : డబాయించకు రఘు బాబీ! ఇప్పటికప్పుడే పావుతక్కువ పన్నెండయింది. ఇంకా మీనాక్షి ఇంటికి జేరుకోక పోయినా నువ్వేం ఆరాటపడటంలేదు చూడు.

రఘు : ఆ విషయంలో మటుకు నువ్వు పొరబడుతున్నావ్. నాకు నిజంగా చాలా ఆదుర్దాగా వుంది. అదెక్కడి కెళ్ళిందో ఏమిటో నాకేం తోచకుండా వుంది.

సుజాత : (కవరు చేతబట్టుకుని లేస్తూ) అన్నిచోటా కనుక్కున్నావా? అన్నివిధాలా ఆలోచించి చూశావా?

రఘు : ఆ......

సుజాత : ఐనా నువ్వేం గొడవ చెయ్యలేదు. ఏదీ ఛిన్నభిన్నం చెయ్యలేదు—

రఘు : అప్పుడే!?

సుజాత : పోనీ మన నాటకంలో రెండో అంకంలో నువ్వైతే ఏంచేస్తావ్ చెప్పు. బాబీకీ నీకూ సహస్రాంశం తేడా వుందన్నావ్‌గదా-అప్పుడేం జరుగుతుంది?

రఘు : రెండో అంకంలోనా?

సుజాత : అవును. మేమంతా వెళ్ళిపోయాం. నువ్వొక్కడివే మిగిలిపోయావ్. మీనాక్షి తిరిగిరాదని నీకు తెలుసు. అప్పుడేం చేస్తావ్ నువ్వు?

శేఖర్ : (ఏదో కీడు మూడిందని భయపడుతూ-లేచి ముందుకొస్తూ) ఇక తమాషాలు చాలుగాని ఇప్పటికే బాగా పొద్దుపోయింది. మళ్ళీ రేపు సాయంత్రం మనం నాటకం ఆడాలి. ఇహ ఇళ్ళకిపోతే బాగుంటుందనుకుంటాను.

సుజాత : పోనీ నువ్వు చెప్పు శేఖర్, రఘు ఏంచేస్తాడో... ఊఁ........కొస్త సాయం చెయ్యి

శేఖర్ : ఏమిటి?

సుజాత : మీనాక్షి ఉత్తరం ముక్క రాసి పెట్టేసి మనవాణ్ణి వదిలి వెళ్ళిపోయింది. తిరిగిరాదు. అప్పుడేమౌతుంది??

సరళ : ఊఁ ఊఁ కానీండి. కొత్త రెండో అంకం తయారుచేద్దాం పట్టండి. కమాన్ రఘూ! మీనాక్షి నీకో వుత్తరం రాసిపెట్టి వెళ్ళింది—

[సుజాత చేతిలోని కవరు లాక్కుని అందిస్తూ-] ఇదుగో వుత్తరం!

[రఘు వుత్తరం తీసుకుంటాడు]

శా నెవణ్నో ప్రేమించి లేచిపోతున్నట్టు రాసింది అందులో. నువ్వు మోసగించబడ్డ మొగుడివి-కోకు!...

శేఖర్ : (తీవ్రంగా) సరళా!

సరళ : (అతని తీవ్రతకు ఉలిక్కిపడి అతనివంక ఆశ్చర్యంతో చూస్తుంది.)

శేఖర్ : అది...అదేం తమాషా అనుకుంటున్నారా? హాస్యానికైనా హద్దూపద్దూ వుండొద్దూ?

రఘు : అవును. నాకూ యేం నచ్చలేదీ హాస్యం. (ఉత్తరం తిరిగి సుజాతకిస్తూ) ఇదుగో నీ వుత్తరం సుజీ, సారీ-నాట్ ఎ గుడ్ జోక్.

సుజాత : ఇదేం జోక్ కాదు. ఇది-ఇలా-అసలిలా జరిగితే ఎలా వుంటుందని! అంతే! నువ్వు చాలా ధైర్యస్థుడివి-కరుకుమనిషివి! నగ్నసత్యాన్ని ఎదుర్కొనగలవ్!-ఏం శేఖర్-నువ్వుకూడా చెప్పు కొస్త.

శేఖర్ : (వెనక్కు తగ్గుతూ) నేనా! నేను- నేనేంచెప్పేది?

సుజాత : (నిలువునా చీల్చిపారేసేట్టు అతనివంక ఓసారి అసహ్యంగాచూసి, మళ్ళీ రఘువైపు తిరిగి కృతనిశ్చయురాలై)మీనాక్షి వెళ్ళిపోయింది. మరి తిరిగిరాదు. రెండో అంకం ఎలా ప్రారంభం అవుతుంది?

[ఎక్కడో తలుపుకొట్టిన చప్పుడు]

రఘు : అదుగో మీనాక్షి రానేవచ్చింది. కాసమీరైనా మందలించండి నా తిరుగుబోతుభార్యని!... (లోపలివైపుకు తిరిగి) రంగా!

[రంగడు వస్తాడు]

అమ్మగారొచ్చి తలుపు తట్టుతోంది. తీసిరా.

రంగడు: వీధితలుపు కాదు బాబూ. లోపల అల్మెరాతలుపు పడకుంటే నేనే చేత్తో గుద్ది వేశాను.

రఘు : సరిసరి!

సుజాత: అంటే ఇహ మీనాక్షి రాదన్న మాట!

[రంగడు నెమ్మదిగా లోపలకు వెళ్తాడు]

సరళ: మళ్ళీ మొదలెట్టండి.

శేఖర్ : (లేచి) ఇదుగో ఎవళ్ళొచ్చినా రాకపోయినా నే మటుకు వెళ్లిపోతున్నా నిహ.

సరళ: అప్పుడే? ఏం?

సుజాత: అది అతని పోర్షను కదా— పారిపోయే ప్రాణమిత్రుడు!

సరళ: అవునా? ఎందుకు పారిపోతున్నావ్?

శేఖర్ : మతిలేని ప్రశ్న వెయ్యకండి.

సుజాత: ఫోన్ చేద్దామనుకుంటున్నా డేమో లే.

సరళ: ఫోనెవరికి?

సుజాత: రఘుకి! మీనాక్షి శాశ్వతంగా అతన్ని వదిలేసి లేచిపోయిందని చెప్పడానికి!

శేర్ ఖ: Exactly! సరిగ్గా అపనే చెయ్య బోతున్నా నేనిప్పుడు. (సరళతో) నువ్వు వస్తున్నావా లేదా?

రఘు: (నవ్వి) చూశావా? నీ పాడు రెండో అంకం రభసతో వాడి మనసంతా పాడుజేశావ్!

శేఖర్ : అసలు నన్నడిగితే—మీనాక్షి సుజాతా ఇద్దరూ నిన్నెడిపించి నువ్వెలా రియాక్ట్ అవుతావో చూడ్డానికి కూడబలుక్కొని ఈ నాటకం ఆడుతున్నారని నా అభిప్రాయం.

సుజాత: (మండిపోయింది) ఆ సంగతి అబద్ధం అని నీకు తెలుసు. అసలు సంగతి కూడా నాకంటె ముందు నువ్వే—

శేర్ ఖ: గుడ్ నెట్ రఘూ!

రఘు: నిజంగా వెళ్ళిపోతున్నా వేమిట్రా?

శేఖర్ : నువ్వేం అనవసరంగా బాధపడకు రఘూ. కొంచెం తమాయించుకుంటే అంత బాధ అనిపించదు—అంటే...అఁ హఁ—అలాంటిది నాకే జరుగుతుందా అని కూడా అప్పుడప్పుడనిపిస్తూంటుంది. అలాంటప్పుడు నేను—'ఇందులో ఆశ్చర్యం ఏముంది—ఆడవాళ్ళ నెప్పుడూ నమ్మరాదు అనుకుంటాను. ఆమాటకొస్తే ఈ ప్రపంచంలో అలాంటి సంఘటన లనేకం. ఏ నాటకమైనా చూడు-ఏ నవలైనా తీసుకో-అదే ఐడియా. కట్టుకున్న ఆడది మనల్ని కాదంటుంది. 'ఇదొక్కటే నా రేమిటా డది ప్రపంచంలో' అనుకుంటే తీరిపోతుంది చూడు. ఇంతకీ నే చెప్పొచ్చిందేమిటంటే ...వెల్ ఇంకేం చెప్పను - ధైర్యం చిక్కబట్టు - గుండె నిబ్బరం కావాలి... సరే-రేపు హాల్లో కలుస్తానుమళ్ళీ.

[రఘు కడుపునిండా నవ్వుతూ వచ్చి శేఖర్ కు షేక్ హాండ్ ఇస్తాడు]

రఘు : (అతని బుజంమీద తట్టుతూ) వెల్ వెల్ రాజా కారక్టరు మీద బాగా ఇంప్రువ్ చేశావ్. కంగ్రాచ్యులేషన్స్! You have gone and seen beyond the auther!

[శేఖర్ కొంచెం ఎడంగా ఒదిగి నిలబడతాడు]

సరళ : (మాటవరసకి) అవునూ-ఇందాక అడుగుదామనుకున్నాను - అసలీపూటకు మీనాక్షి తిరిగొస్తుందా?

[శేఖర్, సుజాత కలవరపాటుతో ఒకరి ముఖాలొకరు చూసుకుంటారు. రఘు ఆమె వైపుతిరిగి కొద్దిక్షణాలామె వంక చూసాడు]

రఘు : తిరిగి రావడమా?...అఫ్ కోర్స్.. ఏం?

సరళ : ఏదన్నా వూరెళ్ళిందేమో నను కున్నాలే.

[సుజాత లేస్తుంది]

శేఖర్ : (అమితంగా బాధపడుతూ) అఁ...సరళా—

రఘు ఎందుకనుకున్నావలా?

సరళ : ఇందాక బాత్ రూంనుంచి వస్తూ ఆవిడ గదిలోకి వెళ్లాను. గదంతా ఖాళీగా వుంది.

రఘు : (ఒక్క క్షణం అవకాశంతో) ఏమిటి నువ్వంటున్నది?

సరళ : మొన్న మీరిద్దరూ బొంబే కు ప్లేన్లో వెళ్ళినప్పుడు ఎయిర్ లైన్స్ ట్రావెలింగ్ బాగ్ తెచ్చారు చూడు—అది ఎప్పుడూ ఒంకొకి తగిలించి వుండేది—అది కనిపించలేదు. చీరెలూ అవీకూడా ఏంలేవు. అద్దం ముందు మామూలుగావుండే టాయ్ లెట్ సామాన్లూ కనిపించలేదు.

రఘు : నిజమేనా నువ్వనేది?

సరళ : (ఒక్కక్షణం ఆగి) ఐతే నీకు తెలీదా ఆవిడ వూరెళ్ళిందీ లేందీ?

రఘు : ట్రావెలింగ్ బాగ్...?

సరళ : పోనీ నువ్వెళ్లి చూసి రారాదూ. ఆవిడ వస్తువులు ఎక్కడుంటాయో నీకు తెలుసుగదా.

[రఘు గబాల్న వెనక్కి తిరిగి గబగబా లోపలికి వెళ్ళాడు.
కాస్సేపు సుజాత, శేఖర్ లవంక చూస్తుంది.]

ఏమిట్రా అసలు గొడవ? ఏమైంది?

సుజాత : మీనాక్షి రఘుని వదిలేసి లేచి పోయింది. నిజంగానే.

[సరళ నిర్ఘాంతపోయి, లేచి, సుజాత వంక దీక్షగా చూస్తుంది.]

శేఖర్ : సరళా—ఇహ మనం వెళ్ళి పోవాలి. ఈ పరిస్థితిలో మనం చెయ్యగలిగిందేం లేదు.

సుజాత : (దుఃఖంతో) మరి...మరి... ఈ వుత్తరం...ఎవళ్ళో ఒకళ్ళండి ఇవ్వాలి దీన్ని.

సరళ : అసలీతమాషా ప్రారంభించింది నే ననుకుంటాను—నే నే ఇస్తానీ వుత్తరం.

సుజాత : (కవరు ఇసూ) జాగ్రత్త. ఏఁ అఘాయిత్యం జరక్కుండా చూడాలి. పాపం...

[వెనుతిరిగి బైటికి వెళ్ళిపోతుంది.
శేఖర్ ఆమె ననుసరిస్తాడు.
సరళ సోఫాలో కూర్చుంటుంది. రఘు తిరిగి వస్తాడు. మిగతావాళ్ళు వెళ్ళి పోయిన విషయం గమనించి, ఏం మాట్లాడకుండా వచ్చి సరళ కెదురుగా నిలబడతాడు]

రఘు : అక్కడేంలేవు. ఏవీలేవు.

[సరళ తన చేతిలోని కవరుకంక చూస్తూంటుంది]

దాని అర్థమేమిటో తెలుసా నీకు?

[సరళ కవరు రఘుకి అందిస్తుంది. అతను కవరు చింపి, ఉత్తరం తీసి, చదివి, నలిపి అవతల పారేస్తాడు. సరళవంక చూస్తాడు...కొంచెం దీర్ఘమైన నిశ్శబ్దం...రఘు బుఱ్ఱ సగం మొద్దుబారి సగం దారుణమైన ఉద్రేకపుసుడిగుండంలో చిక్కుకుని సోఫాలో సరళ పక్కనే కూర్చుంటాడు. ఒక్కక్షణం తర్వాత అనుకోకుండా టేబిల్ మీద ప్లేటులోని పొటాటో ఛిప్స్ రెండు తీసుకు నముల్తాడు. మరోక్షణం నిశ్శబ్దం......తర్వాత అదే ఛిప్స్ మరో గుప్పెడు తీసుకుని సరళవైపు చూడకుండా ఆమె కందిస్తాడు.
యాంత్రికంగా అతి సర్వసాధారణంగా ఎప్పుడూ అతని పెదవుల పీడని సహజ మందహాస రేఖ అదృశ్యం కాకుండానే.]

ద్రాక్షపళ్లంటే నీ కిష్టమేనా సరళా?

[తెర]

(ఇంకావుంది)

తొందరపాటు

అనగ ననగ నొక యూరున
ధనవంతుం డొకడు గలడు;
పనులుచేయ నతని యింట
పలువురు సేవకులు గలరు.

ఎల్లప్పుడు సేవకులకు
ఇల్లాలే పనులు చెప్పు;
కొక్కొరొకోయన్నంతనె
పెక్కు ఆజ్ఞ లామె ఇచ్చు.

ప్రతిదినంబు పాడుకోడి
గతి తప్పక కూయుచుంట,
పగ లంతయు కష్టపడిన
భటుల మనసు భగ్గుమనెను.

పుట్టి మునిగినట్టు కోడి
గట్టిగాను కూయుచుండ,
తుట్టతుదకు దానిని తుద
ముట్టించిరి ఒక్కనాడు.

మరుదినంబునుండి వారు
కరవుదీర నిదురబోవ
మరగినారు కాని, వారు
ఎరుగరైరి భవితవ్యము.

గడియారమువంటి కోడి
మడియుటచే గృహిణిమణి
వేళకాని వేళలందు
మేలుకొనుట మొదలిడినది.

నిద్రబోవు సేవకులను
అర్ధరాత్రియైన నరే,
అదరగొట్టి మేలుకొలిపి
ఆజ్ఞలిడగ జొచ్చె నామె.

తాము చేసుకొన్న పనికి,
తమకె ముప్పు వచ్చెనంచు,
వాపోయిరి భటు లంతట
ఆపెను ఎదిరింపలేక.

ముందుచూపు లేక వీరు
తొందరపడి పనులుచేయ,
కలుగు నిట్టి చిక్కులన్నీ
తెలిసికొనుడు బాలలార!

కె. శ్రీనివాసులు



రక్తి కట్టిన యుక్తి

నిద్రపోతూ నిద్రపోతూ వున్న వీరరాఘవులు, ఎందుకో యాదాలాపంగా కళ్లు తెరచి పైకి అటకమీదకు చూసి, ఒక్కసారిగా ఉలిక్కిపడి భయంతో గడ్డకట్టుకుపోయాడు.

"ఏం చేయాలి? ఏం చేయాలిప్పుడు? తన సర్వస్వం నాశనం కాబోతున్నది!" భయంతో చుట్టుప్రక్కలకు చూశాడు. అంతా నిశ్శబ్దంగా, నిర్మానుష్యంగా వున్నట్లుంది.

గోడమీద నున్న గడియారం అప్పుడే పన్నెండు గంటలూ కొట్టి విశ్రాంతి తీసుకుంటున్నది. దాని గుండె కొట్టుకుంటున్న శబ్దం తప్ప మరే అలికిడీ లేదు.

వీరరాఘవులుకు, ఇటునుండి అటు వత్తిగిల్లుదామన్నా భయంగావుంది. అయినా, గుండె దిటవు చేసుకుని అటువైపు తిరిగాడు.

ప్రక్కన అతని భార్య చెంచమ్మ ప్రశాంతంగా నిద్రపోతున్నది. ఆహాల్లోవున్న కిటికీద్వారా, బయటినుంచి ఉప్పెనగా వచ్చిపడుతున్న వెన్నెట్లో ఆమె మెడలోని బంగారు నగలన్నీ ధగధగా మెరిసిపోతున్నవి.

వీరరాఘవులు ఆమెకా నగలు చేయించి పాపం, ఇంకా ఒక్క సంవత్సరమైనా నిండలేదు.

ఆ నగలు చూడగానే వీరరాఘవులుకు గుండె ఆగిపోయినట్లైంది.

"అయ్యో! అయ్యో! ఇన్ని నగలు తనవి కాకుండా పోతున్నవి. వెధవ ప్రాణం! ప్రాణం పోతే పోయింది, తన నగలకు ముప్పు రాకుండా వుంటే చాలు!"

గుండె బిగబట్టుకుని, నగలు పోకుండా, ప్రాణాలు నిలబడే పద్ధతి వొకటి ఆలోచించాడు వీరరాఘవులు. ఆలోచించి, పైకి అటకమీదకు క్రీగంట చూశాడు.

చూసి, ఒక్కసారిగా లేచి కూచుని చెంచమ్మను గట్టిగా తట్టి లేపాడు.

కొండముది శ్రీరామచంద్రమూర్తి

మంచి నిద్రలో వున్న చెంచమ్మ, తన భర్త తనను పిలవడం చూచి 'ఎందుకో' అనుకుని; "ఎందుకండీ?" అన్నది బద్ధకంగా వొళ్లు విరుచుకుంటూ.

"ఒసే! చెంచమ్మా! చెంచూ! లేవే! లే. లే. నీతో వో సంగతి చెప్పాలి!" అంటూ ఇంకా రాఘవులు ఆమెను పిలుస్తూనే వున్నాడు.

"అబ్బ! ఎందుకండీ" అంటూ అటువేపు తిరిగి పడుకుంది చెంచమ్మ.

వీరరాఘవులుకు నిజంగా కోపం వచ్చింది. ఒక్కసారిగా లేస్తూ, తన భార్యను గట్టిగా కుదుపుతూ, లేపి కూచోపెట్టాడు.

చెంచమ్మకు లేవక తప్పిందీ కాదు. అర్ధరాత్రి తనభర్త చేస్తున్న ఈ అఘాయిత్యం అర్ధమయిందీ కాదు.

అక్కడికీ "ఏవిఁటండీ?" అన్నది మళ్లీ.

"చూడూ! నాకో సందేహం వచ్చింది" అన్నాడు రాఘవులు.

"అబ్బ! ఇప్పుడేం సందేహం లెస్తురూ, రేపొద్దున్న చూసుకుందాం అంటూ పడుకోబోయింది.

వీరరాఘవులు తనభార్యను నిద్రపోనీకుండ బ్రతిమలాడుతూ "ఈ ఒక్క సందేహం తీరుద్దూ! నీకు పుణ్యం వుంటుంది," అన్నాడు.

అంతగా తన భర్త తనను బ్రతిమలాడుతుంటే, మరీ మొరాయించడం అంత బావుండదని, ఆసందేహ మేమిటో విందామని, ప్రక్కమీద లేచి కూచున్నది చెంచమ్మ కళ్లు నులుముకుంటూ.

"అయితే గియితే అయినాపురం కరణీకం వస్తేగిస్తే, పాడి బర్రెను నేకొంటే గింటే, ఎవరికి పోస్తావే ఆపాలు, మీ వాళ్ళకా, మా వాళ్ళకా?" అన్నాడు.

చెంచమ్మకు నవ్వొచ్చింది. ఆ నవ్వులోనే "పోనీ, మీ వాళ్ళకే పోసుకోండి," అన్నది.

ఈ జవాబును వినడంతోనే, వీరరాఘవులుకు కోపం వచ్చింది. "ఏమంటావ్? మా వాళ్ళకే

పోసుకోమంటున్నావూ! అంటే నీ అర్థం? ఉన్న వూళ్ళో మా వాళ్లను పెట్టుకుని పొరుగూర్లో వున్న మా వాళ్లకు పాలు పంపించి, నన్నల్లరి పెడదామని కదూ నీ ఉద్దేశ్యం?" అంటూ ఆమె జుట్టు పట్టుకున్నాడు.

చెంచమ్మకు భయం కలిగింది. బాధ మిక్కుటమైంది. ఏడవడం ప్రారంభించింది. ఏడుస్తూనే "పోనీ మా వాళ్లకే పోయండి. నన్నొదిలి పెట్టండి," అన్నది.

"ఏవిటేవిటేవిటీ? మీ వాళ్లకే పోయాలీ? మా వాళ్లేమైపోవాలనీ?" అంటూ మరి రెండు తగిలించాడు.

చెంచమ్మ బిగ్గరగా ఏడవడం ప్రారంభించింది. వారినీ, వీరినీ కేకేసింది. తన గోడు చెప్పుకొన్నది. కానీ వీర్రాఘవులు హాలు తలుపులు మాత్రం తెరవలేదు. నవ్వుకోడానికి కొందరూ, సలహా చెప్పటానికి కొందరూ, పరిశీలకులుగా వుండడానికి కొందరూ, ఇలా ఇలా అందరూ అనేక విధాలుగా అక్కడకు వచ్చారు.

కాపులూ, పాలేళ్లూ, కోమట్లూ, బ్రాహ్మలూ, ఆ గ్రామంలోని చిన్నా పెద్దా యావన్మందీ అక్కడకు చేరుకున్నారు. కరణం గారు కూడా వచ్చారు.

"ఏమిట్రా రాఘవులూ! ఆచిన్నదాన్ని పట్టుకుని ఆలా చితుక కొడతావ్? బుద్ధి లేదట్రా! ఏం చేసిందిరా?" అన్నాడు బయట నుంచునే.

"ఏం చేసిందా? ఏం చేసిందో మీకేం తెలుసు? మున్సబుగారికి తెలుసు! తలార్లకు తెలుసు!" అన్నాడు లోపల నుంచునే వీర్రాఘవులు, హాలు తలుపులు తెరవకుండానే.

ఇదేమిటా అని అందరూ ఆశ్చర్యపడ్డారు. మున్సబుగార్నీ, తలార్లనూ పిల్చుకువచ్చారు.

"నీ బండపడ! ఇప్పుడు చెప్పవయ్యా రాఘవులూ!" అన్నాడు మున్సబు.

"ఇంకా చెప్పకుండా వుంటానా? ఇంత జరిగిం తర్వాత చెప్పి తీర్తాను. అయితే ఒక షరతు. దీన్ని మాత్రం పారిపోకుండా చూడండి. భడవ!" అంటూ తలుపులు తెరిచాడు.

అందరూ మూక వుమ్మడిగా లోపలకు వచ్చారు. ఏవిటేవిటన్నారు. సంగతి సందర్భాలు వివరించమన్నారు.

వీరాఘవులు తలార్లను ముందుకు రమ్మన్నాడు. ధైర్యం గల వాళ్ళను ద్వారం దగ్గర కాపలా వుండమన్నాడు. జనాన్నందర్నీ ఎవరి స్థానంలో వాళ్ళను వుంచాడు. అప్పుడు చెప్పటం ప్రారంభించాడు.

"చూడండయ్యా! నేను కొన్న బొయ్యే బర్రెపాలు, మా వాళ్ళకే పొయ్యమని నన్నల్లరి పెడుతున్నదిది; నేనేమో వాళ్ల వాళ్లకు పోస్తానంటుంటే," అన్నాడు వీర్రాఘవులు మొహం గంటు పెట్టుకుని.

ఈమాటలువిని కొందరు గుడ్డలు చాటు చేసుకుని నవ్వారు. కరణం, మునసబులు మాత్రం, హుందాగా "ఏవమ్మా? నిజమేనా?" అన్నారు.

"నాకేమీ తెలీదు బాబూ! మీ మీదొట్టు" అన్నది చెంచమ్మ.

"తెలీదూ?—, నీకు తెలీకపోతే వాడికైనా తెలీదూ? — ఆ అటక మీద వున్నవాడికి! ఏవయ్యా! చెప్పవేం?" అన్నాడు వీర్రాఘవులు ఆ అటకమీద వున్నవాణ్ని జనానికందరికీ చూపుతూ.

చెప్పటానికింకేముందే?

యుక్తి రక్తి కట్టింది.

చెంచమ్మ కళ్ళలోనీళ్లకు బదులు నవ్వులు ప్రతిఫలించాయి. ★

★ జీవనలీల ★

(31 వ పేజీ తరువాయి)

హారూని తన ప్రపంచంలోకి తీసుకెళ్లాడు. శూన్యంచేసిపోదగినంత స్థానాన్ని హారూ ఎన్నడైనా అక్కడ అసలు భుక్తపరుచుకు ఉన్నాడా అన్నది కూడా సందేహమే.

శశి నిశ్శబ్దంగా చాలాసేపు వాళ్ళ ఆలోచనలకి చెవి ఒగ్గి వింటూ కూర్చున్నాడు. చివరికి ప్రొద్దుపోతోంది అన్న సంగతి గుర్తుకి తెచ్చుకుని, "ఇహ మీరలా ఊరికే కూచోవద్దు నితాయీ! రసికబాబు తోటలోంచి వెదురుకర్రలు రెండుకొట్టుకువచ్చి, 'పాడె' ఒకటి సిద్ధం చేయండి" అన్నాడు శశి.

"తిన్నగా శ్మశానానికే తీసుకువెడదామా యేం చిన బాబూ?"

"ఉహూఁ వాళ్ల యింటిదగ్గిర దింపాలి ఒకసారి."

హారూని నేరుగా శ్మశానికే తీసుకువెళ్లితే చాలా వరకు గొడవలేకుండా పోతుంది. కాని హారూకూతురు 'మతి' జ్వరంతో ఉంది. అందరూ శ్మశానానికి వచ్చినా, ఆమె రాలేదుగదా! ఆమెకి ఓసారి చూపించకుండా హారూని దహనం చెయ్యటం అనేది శశి అసలు ఊహించనే లేకపోయాడు. మతికి ఈ సంగతి కొన్నాళ్ల వరకైనా చెప్పకుండా దాచాలన్న ఇంగితమైనా ఇంట్లో ఎవరికైనా ఉంటుందో లేదో సందేహమే. తండ్రి తనకి సంబంధం చూడటానికై వెళ్ళి, తిరిగి వస్తూనే దారిలో అపమృత్యువు పాలపడ్డాడన్న సంగతి మతికి తెలియవచ్చు. జ్వరంతో ఉన్నది అలాగే ఈ రాత్రి శ్మశానానికి పరుగెత్తుకుని రావొచ్చు. కదలనీయకుండా బలవంతాన ఇంట్లో ఉంచినా, ఆమె అందర్నీ — ఆఖరికి విధిని కూడా క్షమిస్తే క్షమించవచ్చు కాని, శశిని మాత్రం ఒకపట్టాన క్షమించదు.

"మీరుండి కూడా నాకు ఒకసారి చూపించకుండా, వాళ్లచేత దహనం చేయించేశారా?" అంటుంది.

రసిక బాబుగారితోటలోంచి వెదురు బొంగులు కొట్టుకువచ్చి, పాడె కట్టారు. తర్వాత హారూని దానిమీద పడుకోబెట్టి, 'గోవిందా గోహోవిందా' అంటూ శవాన్ని పైకి ఎత్తారు.

"గోవింద కొట్టకండిప్పుడు. హారూ శ్మశానానికి వెళ్లడం లేదింకా. ఇంటికి వెడుతున్నాడిప్పుడు" అన్నాడు శశి.

శశి ఆమాటని బుద్ధిపూర్వకంగా అనలేదు. తనమాటకి తనకే కళ్లలో నీళ్లు తిరిగాయి.

దారి విశాలంగా లేకపోలేదు. కాని బురద. వర్షాకాలంలో కొన్నిచోట్ల చీలమండలోతు బురద — కొన్ని కొన్ని చోట్ల మోకాలిపొడుగున జారుతూ ఉంటుంది. అన్నిటికంటె ఎద్దుబళ్ళ రద్దీ మూలంగానే దారి ఇలా మరీ పాడైపోయింది. వర్షాలు వెనకపట్టి, దారి కొంచెం ఎండాక కనుక చూస్తే, నాగలితో దున్నినట్లుంటుంది. శీతకాలం రాగానే మళ్ళీ అంతా చదును అవుతుంది నిజమే. కాని, మిట్ట పల్లాలన్నీ నలిగి నలిగి అరికాళ్ళు మునిగేటంత దుమ్ము తయారవుతుంది. ఫాల్గున, చైత్ర మాసాల్లో ఆ దుమ్మంతా రేగి, దారికటూ యిటూ ఉన్న చెట్ల రంగునే మార్చి వేస్తూంటుంది.

ఊళ్ళోకి వెళ్ళేముందు, ఆ కాలవ నానుకుని ఓ పిల్లకాలవ ఉంది. దానిమీద ఓ కర్రల తాగాడికూడా ఉంది. దాని క్రింద వలవేసి పెద్ద బెస్త నవీన్ మధ్యాహ్నం మూడు గంటల్నుంచి — రొమ్ము లోతు నీళ్లలో నిలబడి ఉన్నాడు.

"చేపలేమైనా పడ్డాయిటోయ్?" అంటూ బిగ్గరగా కేకేసి అడిగాడు నితాయి.

"సేపలెక్కడుండాయ్ గోష్ గారూ? ఇక్కడ నీలు జాస్తి గందా!" అన్నాడు బెస్త...

"పడితే నాకు రెండు యివ్వు — కుర్రాడికి రేపు పథ్యం పెట్టించాలి." నవీన్ అబద్ధమాడాడు. "నీల్లలో నిలుసుండికూడా నిజం సెప్పకుండా అబద్దం సెపుతానా బాబూ? ఇంత నీరుండేసోట సేప పడనే పడదు. కనపట్టంలా?"

హారూ చచ్చిపోయాడని విని అతనేం కలతపడలేదు.

"పాపం, సాలా మంచోడు. యిరోదులంటూ లేరు మానవుడికి," అన్నాడు.

తర్వాత మళ్ళీ — "ఈ యేడు — తెలుసా గోష్‌గారూ? వోరి అదుష్టం బాగుళ్ళా. మూడు వోనలైనా కురిశాయో లేదో, అప్పుడే ఎనక పట్టేశాయ్," అన్నాడు.

ఓ పగలని లేదు, రాత్రని లేదు, నేలమీద, నీళ్లమీద నవీనుడిది నిర్విరామ జీవన సంగ్రామం. అతడికి శరీరంతో పాటు మనసు కూడా ఎండిపోయింది. హారూ అపమృత్యువార్తవిని విచలితుడయేటంత వెసులుబాటు లేదతడికి. అయితే అతడికి మమకారం అంటే ఏమిటో తెలియదని కాదు.


పదేళ్ళకొడుకు సాయంత్రంనుంచి ఆ తాగాడిమీద ఊరికే అలా నుంచుని ఉన్నాడు. నీళ్ళలోదిగి తండ్రిలాగా తానూ చేపలుపట్టాలని ఉంది వాడికి. కాని ఏమయినా అందుకు ఒప్పుకోలేదు నవీనుడు.

"వాయువు కమ్ముతుంది బాబూ! రేపొద్దున్నే వచ్చినప్పుడు దిగుదువుగాని."

"పొద్దుటేలప్పుడు నీలుండవుగా!"

"ఆఁ. ఎందుకుండవు. నువ్వు మునిగేంత నీలుంటాయ్. తెలుసా?"

తాగాడి దాటాక కొంతదూరంవరకు దారి కటూ యిటూ ఒత్తిదున్నినచేలే. ఇహ అక్కడినుంచి ఊరు మొదలవుతుంది. ఇటు వైపున ఇళ్ళు తక్కువ. దారికి కుడివైపున, పొదలమధ్య విసిరేసినట్లు సగం పడిపోయిన గుడిసెలున్నాయి కొన్ని. వానతో అవి బయటా లోపలాకూడా తడిసిపోయాయి. అక్కడ ఏడెనిమిది కుటుంబాల దొమ్మరివాళ్లున్నారు. ఊళ్లో ఉన్న అన్నికులాలవారిలోకీ వాళ్ళే అందరికంటె పేదవాళ్లు, అందరికంటె తక్కువజాతివాళ్లు, అందరికంటె దొంగలూ... పగటిపూట వాళ్ళు గృహస్థుల యింటికప్పులూ అవీ మరామత్తు చేస్తూ ఉంటారు. రాత్రిళ్ళు అవకాశం దొరికిందంటే, ఆ యిళ్ళకే - కన్నాలు వేస్తూ



★ జీవనలీల ★

ఉంటారు. వాళ్ళలో ఎవరో ఒకరు అర్నెల్లూ, ఏడాదీ జైలులో ఉండి వస్తూనే ఉంటారు. విడుదలయి ఊళ్ళోకి వచ్చాక, "అత్తారింటినుంచి తిరిగి వచ్చినట్లుంది బాబాయ్! భలేహాయిగా ఉందక్కడ," అంటూ ఉంటారు.

ఆ యిళ్ళు కాసినీ దాటితే - ఇవి అన్నీ దగ్గిరదగ్గిరగా ఉండే ఇళ్ళు వస్తాయి. ఆ యిళ్ళ సిరిసంపదలు పైకి కనిపిస్తూనే ఉంటాయి. దారికి రెండువైపులా పల్లెలవైపు వెళ్ళే చిన్న చిన్న దారులు కనిపిస్తాయి. అక్కడక్కడ అరటితోటలు, పోకతోటలూ, చిన్న చిన్న వెదురుపొదలూ కుడివైపున, ఎడమవైపునకూడా కనిపిస్తాయి. మామిడితోటలు రాత్రిళ్లు అరణ్యంలాగా కనిపిస్తాయి. కొన్ని కొన్ని యిళ్లముందు, కామినీ, గంధరాజ్, జపాకుసుం — మొదలైన పూలతోటలు పెంచాలనే కొద్దికొద్ది ప్రయత్నాలు పొడతాయి. క్రమంగా ఒకటి రెండు పెద్ద భవంతులు ఎదురౌతాయి. భవంతులంటే అంతా ఇటికలతో కట్టినవేం కావు. మధ్యభాగం మాత్రం ఇటుకలతో కట్టి, చుట్టూ రెల్లు వసారాలు దింపి, వెదురుబద్దల దళ్లు కట్టినవి.

నిర్జనంగా ఉన్న మార్గాన శవ వాహకులు తమలో తామే రొదచేసుకుంటూ నడుస్తున్నారు. శివ దైన్యం తుడిచేసుకోటానికి వీల్లేనిది. చేత్తో లాంతరు పట్టుకుని అందరికీ ముందు నడుస్తున్నాడతడు. నితాయీ, సుదేవ్ - వాళ్ళంతా ఏవో మాట్లాడుకుంటూనే ఉన్నారు. ఏం మాట్లాడకుండా ఉన్నది శివ ఒక్కడే. దారిప్రక్కన ఏ ఇంట్లోనయినా దీపం కన్పిస్తే ఇంట్లోవాళ్లని కేకేసి పిలుద్దామనిపిస్తోంది. ఒక నిమిషం ఆగి, అకారణంగా 'ఇంట్లో అందరూ కుశలమేకదా' అని అడిగి తెలుసుకుంటాడు. అతడి పిలుపు విని గొలుసు తీసే వాళ్ల కుటుంబంలోని కబుర్లు తెలుసుకొందే, పోరూ యింటివైపుకి వెళ్లటానికి తగినశక్తి రావటం లేదతడికి.

కొంచెం ముందుకు వెడితే బజారు.

ఇక్కడ ఊరు ఇరుకుగా ఉంటుంది. దుకాణాలూ అవీ తక్కువేమీ లేవు. కాని వానకురిసిన రాత్రి—ఈదురుగాలి ప్రారంభమయేలోగానే దుకాణాలన్నీ మూసేశారు. దారికి ఎడమవైపున, ఖాళీ ప్రదేశంలో కొన్ని రేకుల షెడ్లున్నాయి. రెండు రోజులుపోయాక అక్కడ సంతె జరుగుతుంది. ఎక్కడినుంచో ఓ సన్యాసివచ్చి ఓ షెడ్ క్రింద చేరాడు. అతడిముందు నెగడు వెలుగుతోంది. ఆ నిప్పుమీద సన్యాసి రొట్టెలు కాల్చుకుంటున్నాడు, అవతల షెడ్డులో బొచ్చు ఊడిపోయిన కుక్క ఒకటి నాలికచాచి రొప్పుతూ, అతడికేసి చూస్తోంది. శివ గబగబా ముందుకు నడిచాడు. అతడికాళ్లు మాటిమాటికీ జారి, బురదనీళ్లతో నిండిన పూటీ గోతుల్లో పడుతున్నాయి. అతడి మనస్సు మనస్సులో లేదివాళ.

శ్రీనాథదాసు చిల్లరకొట్టు దాటి, కాయస్థుల వీధికూడా దాటి వచ్చాడు. పోరూయిల్లు ఈవీధికొసని ఉంది. ఆయిల్లు దాటితే ఇక యిళ్లు ఉండవు. రెండుమైళ్ళ దూరంవరకూ అంతా ఒకటే ప్ర—

వీధిమలుపులో పొగడచెట్టు మొదట్లో చుట్టూ తిన్నెకట్టి ఉంటుంది. సాయంకాలమప్పుడు రోజూ యిక్కడ సర్కారుద్యోగులు చేరి కూచుంటూ ఉంటారు. లాంతరు అక్కడ క్రిందపెట్టి, శివబీడీ ఒకటి ముట్టించాడు. అటూ యిటూ చూస్తే క్రింద రాలిపోయిఉన్న ఆకులతో పాటు - తిన్నెమీద పాతగుడ్డ చుట్టిఉన్న బొమ్మ ఒకటి పడి ఉంది. ఆ బొమ్మని శివ గుర్తుపట్టగలిగాడు. వైశాఖమాసంలో పాజిత్ పూర్ లో 'మేలా' జరిగినప్పుడు — శ్రీనాథ్ దాసు కొట్లో ఓగంట విశ్రాంతి తీసుకున్నందుకు బదులుగా అతని కూతురికి తాను కొనియిచ్చిన బొమ్మ అది. సాయంత్రం వాన వెలిశాక శ్రీనాథ్ కూతురిక్కడికి ఆడుకోటానికి వచ్చి, ఆ బొమ్మనిక్కడ పారేసుకుంది.

బొమ్మ పోయిందని రాత్రి ఆ పిల్ల ఏడుస్తుంది. ప్రొద్దున్నే పొగడచెట్టు క్రిందికి బొమ్మను వెతుక్కుంటూ వస్తే అది అక్కడ ఉండదు. ఆ బొమ్మని ఎవరు తీసుకున్నదీ ఆ పిల్లకి తెలియదు.

యామినీ కవిరాజు (కవిరాజంటే నాటు వైద్యుడు) భార్య తెల్లవారకట పొగడచెట్టు కిందికి ఊడవటానికి వచ్చినప్పుడు ఆబొమ్మను

తీసుకుంటుందని శశికి ఉత్తి అనుమానం.

యామినీ కవిరాజు భార్య దొంగదీ కాదు, పిచ్చిది కాదు. మట్టిబొమ్మ కోసమని ఆ మేమీ ఆశపడదు. కాని నమస్కారం చేసి (చెట్టు కింద ప్రతిష్ఠించి ఉన్నది దైవశక్తి కలదై ఉంటుందనీ...) తల యెత్తేసరికి ఎదురుగా అంత పెద్దబొమ్మ కంటపడితే — అదే భగవంతుని ప్రసాదం అన్న ఆలోచన రావటంలో ఆశ్చర్యం ఏముంటుంది!

ఆ బొమ్మని ఇంకొంచెం చెట్టుదగ్గరగా త్రోసేసి, దీపంతీసుకుని, శశి మళ్ళీ ముందుకు వెళ్ళాడు.

“కాస్త జాగ్రత్తగా అడుగుతీసి అడుగు వేస్తూ నడు నిత్యా! కిందపడి పోయీ ఒళ్ళంతా బురదవకుండా చూడు. అబ్బ ఎంత పాడుదారి,” అన్నాడు.

కాయసుల వీధిలో రెండువైపులా ఉన్న వెదురు గుబుళ్ళలో దోమలు జుయ్‌మంటున్నాయి. యామినీ కవిరాజు గొడ్లచావిడి వెనక మూడు నెలలనుంచీ కుప్ప వేసిఉన్న పేడ మురిగిపోయింది. దారువులో ఏడాది నుంచీ అడివిలా పెరిగిన కలుపు మొక్కలు వాననీటికి మునిగి కంపుకొడుతున్నాయి.

ఇంకా రెండడుగులు వెళ్ళేసరికి హోరూ భార్య కోకాలు అక్కడికే వినిపించసాగాయి...

(ఇంకా వుంది)

అనుభూతుల నీడలు

(12 వ పేజీ తరువాయి)

భారతీయుల కర్మ సిద్ధాంతమే కారణమైతే నోరులేనివాళ్ళు జీవించడం అనవసరం. వాళ్ళకి యీ ప్రపంచం సరిపడదు.

తాత మాటలమీద నాలో నేను వ్యాఖ్యానించుకుంటూండగా దూరంగా నవ్వు వినిపించింది. కాలవ గట్టుమీద కూర్చున్న యిద్దరూ తాతతో,

“పాపం, ఇలాంటి ఏలయీ మా రాజులికి ఆ పిల్లల్ని చూడాల్సిన అవసరమేటొచ్చిందో?”

ఛీ! మనుష్యాకృతిగా ఒక వ్యక్తిమీద సానుభూతి చూపించడానికికూడా ఈ సంఘం అనుమతి నివ్వదు. అర్థం చేసుకోదు. హృదయం మీద చెవి ఆన్చి వినదు.

ఈ మొండి గోడలూ, యీ శిథిలాలూ మునుపు ఇక్కడవున్న వాళ్ల మొండి బతుకులకు స్మారక చిహ్నాలు. గుడ్డి వెన్నెలలో శ్మశానంవంటి యీ శిథిల రంగంమీద పిశాచాలు నాట్యం చేస్తున్నట్లు జుట్టు విరబోసుకుని గాలికి వెర్రిగా వూగే కొబ్బరిచెట్లూ, వికృతగానం చేసే గబ్బిలాలూ, నేనూ మిగిలిపోయాం. ఈ రంగంనుంచి మానవులందరూ ఎక్కడికో నిష్క్రమించారు. వాళ్ళ జీవితాలు అప్పుడే స్మృతి పథంలో ‘చరిత్ర’ రూపాన్ని పొందాయి. చివరకు మిగిలినవి ఈ పరిసరాలతో నాకు కలిగిన అనుభూతులకు సంబంధించిన నీడలు! ★

ఆంధ్రా స్పోర్ట్స్ క్లబ్

(4-వ పేజీ తరువాయి)

ప్రముఖపాత్ర లభింపచేసినందుకు గర్వించి తృప్తిపడవచ్చు. శ్రీ సి. ఎన్. నాయుడు సి. కె. నాయుడుగారి కుమారుడు — వంటి వారి బలిమి లిమ సంస్థను పటిష్ఠం చేసినందుకు. ప్రవాసాంధ్రుల శక్తి సామర్థ్యాలను కేంద్రీకృతం చేసినందుకు గర్వించవచ్చు. అంతవరకే ఈ సంస్థ కార్యక్రమాలు పరిమితమైతే ఈ కలం ఇలా పరుగులిడదు: ఈ వ్యాసం ఇలా వ్రాయబడదు.

1957 వ సంవత్సరం డిసెంబర్ నెలలో తెలిసింది. ధనాభావంవల్ల ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ రంజీ ట్రోఫీ పోటీ ఆటలలో పాల్గొనలేక పోవచ్చునని, ఒక నెలలో, జనవరి నెలలో, పోటీలు, ప్రత్యర్థులు సామాన్యులు కారు: అంతకుముందు రెండేండ్ల క్రితం రంజీ ట్రోఫీ పోటీలో విజేతలు, మదరాసు క్రికెట్ సంఘంవారు. ‘ఆంధ్ర స్పోర్ట్స్ క్లబ్’ అధ్యక్షులు శ్రీ సాదత్ ఆలీ ఖాన్, పలువురు పార్లమెంటు సభ్యులు, ఢిల్లీ ఆంధ్రులు కలిసి సమిష్టి పత్రికా ప్రకటన చేశారు. ఆంధ్ర క్రికెట్ సంఘానికి ధన సహాయం చేయవలసిందని ప్రభుత్వాన్ని, ప్రజలను అర్థించారు. నలభై ఎనిమిదిగంటలు గడవక పూర్వమే ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డి ఐదు వేల రూపాయలు వార్షిక విరాళాన్ని ప్రకటించారు. ఢిల్లీ ఆంధ్రుల ఆశాభావం, ముఖ్యమంత్రి సహృదయత ఊరికే పోలేదు. 1958 జనవరిలో జరిగిన పోటీలలో మదరాసుపై ఆంధ్ర విజయం సాధించింది.

ఈ విధంగా ఢిల్లీతో హైదరాబాదు అన్ని విషయాలలో సహకరిస్తే ఎంత బాగుంటుంది?

భారతదేశంలో క్రీడారంగ అభివృద్ధి కార్యక్రమాలవిషయంలో భారతప్రభుత్వం చాలా ఉత్సాహం చూపిస్తోంది. నిజంగా క్రీడారంగాభివృద్ధిని ప్రోత్సహించే సంస్థలకు విరాళాలు అందచేస్తోంది. అంతర్జాతీయ క్రీడారంగంలో మన ఆటగాళ్ళు ఎందుకు విజయాలను సాధించలేకపోతున్నారో విచారించడానికి ఒక సంఘాన్ని నియమించడమే దీనికి తార్కాణం. ఆంధ్రప్రదేశ్‌లో సమర్థులైన ఆటగాళ్ళు లేకపోలేదు. హైదరాబాదు నగర పోలీసు ఫుట్‌బాల్ దళానికి ప్రభుత్వం సహాయం చేయకపోతే, ఆదళం సాధించిన విజయపరంపర సాధ్యమయ్యేదా?

సమర్థులు శక్తిమంతులైన ఆటగాళ్ళు భారత జాతీయపతాకను అంతర్జాతీయ రంగంలో నిలబెట్టాలనే కేంద్రప్రభుత్వం వాంఛిస్తోంది. “మీకు కావలసిన డబ్బు అడగండి; ఇస్తాం. కాని మీ రాష్ట్రప్రభుత్వానికి చెందిన స్పోర్ట్సు కౌన్సిల్ ద్వారా రావాలి మీ అభ్యర్థన” అంటుంది కేంద్రం. ఆంధ్రప్రదేశ్‌కి ఇంతవరకు స్పోర్ట్సుకౌన్సిల్ అంటూ ఏర్పడలేదు.

ఆంధ్రప్రదేశ్‌కి స్పోర్ట్సుకౌన్సిల్ కావాలని ఆంధ్ర స్పోర్ట్సు క్లబ్ అభ్యర్థించింది. ప్రప్రథమంలో క్రికెట్ కేంద్రసంస్థ మాజీ అధ్యక్షులు, ఆంధ్ర క్రికెట్ అధ్యక్షులు ‘విజీ’ ఈ అభ్యర్థనను సమర్థిస్తూ ప్రకటన చేశారు. ఆంధ్ర అథ్లెటిక్ అసోషియేషన్ ఒక ప్రకటన చేసింది. “ఇదుగో సాధించేస్తున్నాం” అన్నారు రాష్ట్ర విద్యామంత్రి- పదిహేను నెలల క్రిందట!

లండన్ బ్రిడ్జి క్రింద థేమ్సునది ప్రవహిస్తూనే ఉంది. గలగలా గోదారి, కృష్ణమ్మ బంగాళాఖాతం చేరుకొంటూనే ఉన్నాయి. కేంద్రప్రభుత్వం మిగిలిన రాష్ట్రసంస్థలకు ఏటేటా సహాయం చేస్తూనే ఉంది. “కోడి, కుంపటి నాదగ్గరే ఉన్నాయి: ఎల్లా తెల్లారుతుందో చూస్తాను” అంటేమాత్రం లాభం?

క్రియారూపంలో ఆంధ్రులకి సహాయం చేయ పూనుకున్న సంస్థ ఆంధ్రా స్పోర్ట్సు క్లబ్. ప్రచారసాధనాలతో నిమిత్తం లేకుండా కృషిచేస్తూన్న సంస్థ. వ్యక్తులు, సంస్థలు కష్టించి పనిచేస్తే, ప్రచారం దానంతటదే వస్తుంది. దీనికి ఈ వ్యాసమే తార్కాణం. ★



సినిమా

నటన, చిత్రణ, ఛాయాగ్రహణం మొదలయిన విభాగాలన్నింటా స్థాయి నానాటికీ పెరుగుతూ వుండగా, కథల విషయంలో తెలుగు సినిమా వెనకబడుతూ ఉండడం శోచనీయమని అంతా అంగీకరిస్తారు. ఈనాటి సాంఘికాల తరహా చూస్తే ఏనాటి జానపదాలో అనిపిస్తుంది. జానపదాలు అనడం మహాపాపం అని కాదు; మంచి జానపదాలు స్వాప్నిక జగతికి ద్వారాలు తెరిచి ప్రేక్షకుడిని షికారు తీసుకెళ్ళగలవు. వీటిలో అరుచీ, వెచ్చదనమూ వుండవు. కాగా, నిసలైన జానపద గాథలకు ఉండే అందచందాలూ, స్ఫుటమైన రూపురేఖలూ, తలా తోకా కూడా సక్యంగా వుండవు. చొక్కా-లాగూ తొడిగి లీలా మోహన్ అని ఒకళ్లనొకళ్ళు పిల్చుకుని, "నన్ను అర్థం చేసుకోటం లేదు" లాంటి మాటలు అన్నంత మాత్రాన అవి సమకాలిక జీవితాన్ని ప్రతిబింబించవు. సాంఘిక చిత్రాలు అనిపించుకోవు.

కథావస్తువు నిర్ణయం దగ్గరనించి, కథ కట్టుకు రావడం దానికి గమ్యస్థానం ఇదమిత్థమని నిర్ధారించడం వరకు అంతా ఏనాడో ఎవరో రాసిన మూస ఆధారంగానే జరుగుతోంది. సినీజన పరిభాషలో 'ట్రీట్‌మెంట్' అనబడే ముద్దంలో కథాంశం, సజీవమైన పాత్రలూ సమర్థుల నటన మొదలైనవన్నీ కృష్ణార్పణం అవుతున్నాయి. ఆదిలో మంచి అనిపించుకున్న కథలుకూడా ఈ 'సినీవైద్యం' పూర్తి అయేసరికి అందవికారంగా తయారవుతున్నాయి.



శరత్ ఫిలింస్ వారి "పులి చేసిన పెళ్లి" చిత్రంలో రాగిణి.

కథా, కమామిషూ

ఇందుకు ఏ ఒకరూ బాధ్యులు కారనడం సరియైన జవాబు కాదు. ఒక్కొక్కసారి ఏ ఒక్కరో మాత్రమే బాధ్యులు కాకుండా ఉండడమే కారణమనిపిస్తుంది. మొత్తానికి ఎవరు బాధ్యులైనా కాకపోయినా, నేటి చిత్రాలు చూస్తూ ఉంటే సామర్థ్యం లేకపోవడమొక్కటే కారణం కాదని గట్టి నమ్మకం కలుగుతుంది.

'సినిమా కథ' అనే దానిపట్ల చలనచిత్రకారుల వైఖరి మారాలి. పరిపాటి అయిన పద్ధతులు మారాలి. కొత్తపద్ధతి అనగానే, దాన్ని అనుమానంతో చూసేతత్వం పోవాలి. ఈ వాక్యాలు కొత్తగా నీతిగీతలుగా, నినాదాలుగా కనిపించినా వినిపించినా అందుకు ఈ వాక్యకారుడు బాధ్యుడు కాదు. ఒక్కొక్క కొత్తచిత్రం వచ్చినపుడు, చూస్తున్న

ప్రేక్షకులు ఎందరో ఆరంభంలోనూ మధ్యలోనూ, చివరా, ఇంకా ఎక్కడపడితే అక్కడా వెలిబుచ్చే భావాలకు ఇవి అతీతాలు కావు. పరిస్థితులు వాదప్రతివాదాల స్థాయి దాటిపోతే నిష్ప్రహావల్ల ఆ వాదాలే వివాదాలు అవుతాయి.

చలనచిత్రకారులు ఏమనుకున్నా, సినిమా చూడవచ్చేవాడు మొదట్నించి చివరదాకా శ్రద్ధగా గమనించేది కథనే. దాని నడక, దానితీరూ మాత్రమే అతడి ఆసక్తిని ఆకట్టి నిలబెట్టేవి. ఇదే మిగతా వాటికి ఆలంబనం, ప్రాతిపదిక. ఈ సత్యాన్ని, శాస్త్రీగా మంచి చిత్రాలు తీసేవారే కాక, సిసిల్ బి.డిమిల్ వంటి బాక్సాఫీస్ నిర్మాతలు కూడా మన్నించారు.

కాలుకు డాన్సులూ, వాళ్ళనీ వీళ్ళనీ కొట్టే మాటలు కాలుకు, పాటలూ రెండూ ఉన్నంతసేపూ కథ ఎలాపోయినా ఫరవాలేదన్న ధోరణి సరికాదు. ఒక పాటలో అపశ్రుతి పలికితే, శ్రోత ప్రాణం ఎలా విలవిలలాడుతుందో అలాగే సినిమా కథలో తప్పటడుగుపడినా, ఆగిపోయిన కథ ఘోరంగా సాగిపోయినా, నడుస్తున్న కథ హఠాత్తుగా ఏపాటలో డాన్సులో మూర్ఛపోయినా, ప్రేక్షకుడికి ప్రాణం చివుక్కుమంటుంది. ప్రతిచిత్రంలోనూ పదే పదే ఆవిధంగా జరిగితే చికాకు, బాధ కలుగుతాయి. ఇలాంటి భావాలు చాలా మందికి కలగడంవల్ల సంభవించిన ఫలితాలు ఏమిటో, కథ తప్ప మిగతావన్నీ బాగున్న చిత్రాలు తీసిన వారికీ, చూసిన వారికీ తెలుసును......

అయినా ఈనాడు కథ ప్రాధాన్యం క్రమేపీ తగ్గి, దానిపట్ల నిర్లక్ష్యం పెరుగుతున్నట్లు కనిపిస్తుంది. దాదాపు నూటికి తొంభై కథలమాతృకలు కేవలం నటీనటుల పేర్లు, "మున్నటి" హిట్ చిత్రాలూ, అందులో బాగున్నాయనిపించుకున్న పాత్రలూను. ఈనాడు చాలమంది రచయితలను కేవలం మాటలు, పాటలు రాయడానికి వినియోగిస్తున్నారు. తత్ఫలితంగా కథలు ప్రజల జీవితంలోంచి రావటం లేదు. కేవలం తాజా హిట్ చిత్రాలకి పుట్టుతున్నాయి. బాక్సాఫీస్ సూత్రం మధ్య పెరుగుతున్నాయి. బాక్సాఫీసు డైలాగులు తొడుక్కు ఇవతలికి వచ్చేస్తున్నాయి. అవి వాటికి సరిపోతాయా లేదా అనికూడా చూచుకోవు.



సంగీతావారి "ఇంటిగుట్టు"లో రాజసులోచన, ఆర్. నాగేశ్వరరావు

దానా డీనా క్రమేపీ, కథలకు కరువు కేది మళ్ళీ పుంజుకుంటూంది......

బాధ్యతగల పెద్దలు ఈ దుస్థితి నివారించ డానికి గట్టిగా ప్రయత్నించడం పరిశ్రమకు శ్రేయస్కరం.

హాలీవుడ్‌లో కథలకు లక్షలకొద్దీ డబ్బు ఖర్చు పెడతారు. పెద్ద పెద్ద రచయితలు నవలలూ నాటకాలూ రాసిపూర్తిచేస్తూ వుండగానే బేరాలు జరిగిపోతాయి. జాన్ ఒహారా ఇప్పుడే పూర్తి చేస్తున్న కొత్త నాటకం "ఫ్రంది టెరస్"ను లక్ష పైచిలుకు డాలర్లకి కొనడానికి ట్వంటియత్ సెంచరీఫాక్స్‌వారు బేరం పెట్టారు.

మనకి సినిమా పరిశ్రమలోనే సమర్థులైన రచయితలు, కష్టసుఖాలు తెలిసిన వారు ఎందరో ఉన్నారు. సినిమా అవతల పెద్ద పెద్ద రచయితలు ఎందరో ఉన్నారు. కథారచన ఘట్టానికి ఇతోధిక ప్రాధాన్యం ఇచ్చి, వారి ప్రజ్ఞను వినియోగించుకుంటే, కొత్త కొత్త కథలు వస్తాయి. తెలుగు సినిమా అవధులు పెరుగుతాయి. కొత్తదారులు కనిపిస్తాయి. కొత్త పద్ధతులకు, శిల్పానికి అప్పుడే అవకాశం ఏర్పడుతుంది. ★



మంచిమనసు - మంచిరోజా.

డాక్టరు అయిన చిన్నవాడు, లాయరు గిరీ చేస్తున్న అమ్మాయిని పెళ్లాడితే, వాళ్ళ కాపరం ఏమంత అమోఘంగా ఉండదనీ ఆ దాంపత్యానికి "చిలకా గోరింకలు" అనే ఉపమానం అద్భుతంగా అతకదనీ అంటాడు డాక్టరు రమణమూర్తి "మంచి మనసుకు మంచిరోజులు" (శ్రీ ప్రొడక్షన్స్) చిత్రం ఆరంభంలో. అందువల్ల డాక్టరు రమణమూర్తి లాయరు రాణీని పెళ్లిచేసుకోరాదు అన్న నీతిని నిరూపించి ప్రబోధిస్తారేమోనని భయపడనక్కరలేదు. ఈ చిత్రంలో కథకి అలాటి దురుద్దేశాలు ఉన్నట్టు లేవు. అసలు ఏవుద్దేశాలూ లేనట్టున్నాయి. ఐతే నీతులు చెప్పి తీరాలన్న నియమాన్ని వదలివేసి, జీవితాన్ని చిత్రించి వ్యాఖ్యను వదలివేసే ప్రయత్నంలో ఒక చిన్న ముందడుగు వేసిన నిర్మాతలు అభినందనీయులు.

కాదూ కూడదూ అని వెతికితే, ఈ చిత్రంఆరంభంలో కనబడే చూడచక్కని సామూహిక నృత్యానికి అలంబనంగా వినబడే (సంక్లిష్టమకుటాలలో మకుటాయమానమైన మకుటంగల) 'భాగ్యమె భాగ్యం' అనేపాటలో కొన్ని 'క్లూ'లు దొరుకుతాయి! మంచి మనసూ, మంచి రోజులూ, అనుకూలదాంపత్యం పర్యాయాలు మంచివని. ఒకే అంతకన్న డా॥ రమణమూర్తి, లాయరు రాణిని పెళ్లాడను అనడంవల్ల ఎన్ని కష్టాలు పడాలో చిత్రించడమే దీని లక్ష్యం అనుకుంటే, ఈ చిత్రకథ రూపురేఖలను సమగ్రంగా దర్శించగలం. అతను అలా అనడంవల్ల రాణికి కోపంవచ్చింది. కోపం పగగా మారింది. పగ సినిమా కథంత పని చేసింది.

యాదాలాపంగా మొదలై, దాదాపు జీవితంలాగే యాదాలాపంగా తప్పిగాసాగి, మనం అనుకున్నచోట ఆగిపోయే ఈ కథకు, శక్తినీ, చైతన్యాన్నీ సమకూర్చినది రైతుబిడ్డ, రాజుగా ఎన్. టి. రామారావు ప్రదర్శించిన నటన. ఆ పాత్ర రూపకల్పన కొంతవరకు కథానాయకుడి ఫక్కీలో ఉన్నా, దాన్ని ఈ కథలో పూర్తిగా సక్రమంగా, సహజంగా ప్రయోగించడం జరుగకపోయినా, ఆ పాత్రను కథకన్న ఠీవిగా ఎత్తుగా నిలిపి నడిపాడు రామారావు. ఇలాగే విడివిడిగాచూచి ఆనందించ తగినవి ప్రహసనం మోస్తరులో రూపొందిన కొన్ని కొన్ని సన్నివేశాలూ, రేలంగి, వల్లరామ్మూర్తి, రాజనాల, శివరాంల నటనాను.

కథకు ముఖ్యమైన డాక్టరు, అతనిభార్య జానకి భూమికలుకూడా, అప్రయోగం వల్ల కొంత దెబ్బతిన్నా ఆయానటుల శక్తిసామర్థ్యాలవల్ల ప్రేక్షకుల అభిమానానికి సానుభూతికీ పాత్రంఅయ్యాయి. ముఖ్యంగా మంచి విగ్రహమూర్తి, అప్యాయత తొణికిసలాడే కంఠస్వరం, పలుకులో మార్దవంగల రమణమూర్తి డాక్టరు భూమికను ప్రశంసనీయమైన స్టాయిలో, అందమైన విగ్రహంతో నిర్వహించాడు. సినిమా కష్టాలకు ఈపాడు కొంత 'వారా' ఇచ్చి మరీ సామభూతి చూపే ప్రేక్షకులుకూడా ఇందులో డాక్టరు కష్టసుఖాలను మిగతా వారికన్న దయ్య్ర

మంచి మనసుకు

అర్థం చేసుకుంటారు మహా అయితే "మీ బావమరది ఖైదునుండి రేపే విడుదల అవుతున్నాడని తెలిసికూడా హైదరాబాద్ ఎందుకు వెళ్లావయ్యా" అని అడుగుతారు.

అలా వెళ్లడానికి డాక్టరూ బాధ్యుడు కాడు; అతనిచేత ఆమాట అనిపించిన రచయితా కాదు. అద్యంతం ప్రేక్షకులను అలరించే ఉత్సాహంతో, ఒక్క మాటలో దక్కని 'చిన్నకథ'ను స్ఫురింపచేయగల పనివాడితనంతో ("పిల్లలకోసం నా అవిడ మోజా కాదుగాని, మధ్య అపాలూ దిన్నక్తులూ మింగలేక నేను చస్తున్నాను డాక్టరుగారూ" అంటాడు పిలని పెంపకం అడగబోయిన ఒక నిస్సంతు గేస్తు) సంభాషణలు వ్రాసిన సముద్రాల జూనియర్ నిష్కారణం ఇలా డాక్టర్ని హైదరాబాదు పంపుతాడని నమ్మలేము; అలాగే మరి కొన్ని సన్నివేశాలలో ఒక్క మాటతో తెమిలిపోయేదానికి సినిమా డైలాగులు సరఫరాచేసి (మీరు నన్ను అర్థం చేసుకోండి; పొరబడుతున్నారు లాటివి) కథలో అప్రస్తుతులు పలికించడు. కథ బలీయం కాబట్టే ఇదంతా జరిగింది.

కథలో భూస్వామందు వెంకటప్పయ్య (రేలంగి)కీ, రైతు యువకుడు రాజుకీ పోట్లాట వస్తుందిపంటకౌలవల విషయంలో. వెంకటప్పయ్య తుపాకీ కాల్పబోతాడు. అతని కొడుకు గనక గుండుని తీసిఉండకపోతే ఈ చిత్రం, హంతకుడు, నిర్దోషి అంటి పేర్లతో విడుదల అయేది. రాజు తన చెల్లెలు జానకికి ముద్దుటగా పెళ్ళి చేయిస్తూఉంటే, వెంకటప్పయ్య కసికొద్దీ, పాతబాకీమీద దావా తెచ్చి ఆస్తి జప్తుచేయించి పెళ్ళి చెడగొడతాడు. రాజు, అడ్డొచ్చినవాళ్లమీద చెయిచేసుకున్నందువల్ల ఖైదుకి వెళ్తాడు. ఆ స్థితిలో అనాథబాలిక జానకికి వెంకటప్పయ్య కొడుకు డాక్టర్ రమణమూర్తి ఆశ్రయం ఇస్తాడు. అతను అంతకుముందే, మనసులో

అభిగంచులూ ఎలా ఉన్నా కృత్తులు పొందక న్న పిల్లమీద, మేనకోడలు రాణి (ఆమె లాయరు)ని పెళ్లాడడానికి ఒప్పుకోడు. అందువల్ల రాణి, ఆస్పత్రిలో పనిచేస్తున్న జానకిని వెళ్లగొట్టిస్తుంది. అనుమానంతో దీ వెంకటప్పయ్య కూడా కొడుక్కి వేరే సంబంధం చూస్తాడు. కాని, డాక్టరు చివరకి జానకినే పెళ్లాడతాడు. ఇద్దరూ

మంచి రోజులు

సుఖ్ఖరంగా కాపరం చేస్తూ ఉంటారు. అత్తమామలుకూడా జానకిని ఆదరిస్తారు. కేడీ లేవో ఆమె అన్న ఖైదునించి విడుదల అయి వస్తాడు. ఆ సంగతి తెలిసినా డాక్టరు హఠాత్తుగా హైదరాబాదు వెళ్తాడు. అంత హఠాత్తుగానూ, రాజు ఖైదులోంచి వచ్చేసి తన పగవాడింటి కోడలైనందుకు చెల్లెల్ని తిట్టిపోసి గొడవచేసి పోతాడు. లాంగ్ షాట్ లోంచి ఈ సన్నివేశం చూసిన వెంకటప్ప

నటులు: ఎన్. టి. రామారావు, రమణమూర్తి, రేలంగి, అల్లురామలింగయ్య, పేకేటి శివరాం, నల్ల రామ్మూర్తి, వేళంగి, రాజబాల కె. వి. ఎస్. శర్మ, మిక్కిలినేని, రాజసులోచన, గిరిజ, సూర్యకాంతం, కంగారత్నం, ప్రమీల, అమ్మాజీ.

మాటలు సముద్రాల జూనియర్. పాటలు సముద్రాల రాఘవాచార్య, కొసరాజు. సంగీతం ఘంటసాల. నృత్యాలు పసుమర్తి కృష్ణమూర్తి. ఛాయాగ్రహణం కమల్ ఘోష్. దర్శకత్వం సి. ఎస్. రావు. అసోసియేట్ మల్లికార్జునరావు. నిర్మాతలు సుందర్‌లాల్ నహతా, అశ్వత్థ నారాయణ.

య్య దంపతులు జానకిశీలాన్ని శంకిస్తారు. ఆమెకూడా కథ ఎక్కడ ఆగిపోతుందోనని, సన్నివేశం ముదిరిపోయే దాకా అసలుసంగతి చెప్పక "నన్ను అర్థంచేసుకోండి", "మీరూనా అత్తయ్యా" వగైరా సినిమా డైలాగులు చెబుతుంది. మొగుడు వచ్చేదాకా కూడా ఉండనివ్వకుండా, కడుపుతో వున్న కోడల్ని ఇల్లువెళ్లగొడతారువాళ్లు. జానకి, ధర్మాసుపత్రిలో బిడ్డమనని ఎవరికో ఇచ్చేసి, తను తనివోయి సరాసరి అన్నయింట్లో చేపడుతుంది. ఈలోగా డాక్టరు తిరిగి ఇంటికొచ్చి



ఎ. వి. సుబ్బారావు, మంచిరాజు, చెడ్డ మనసు.

భార్య లేచిపోయిందని విని దిగులు పడుతూ వుంటాడు. అతని మనసు మార్చి మళ్లీ పెళ్లి చేద్దామని లాయరు రాణి ఒక 'కాబరే' డాన్సు చేసి చూస్తుంది కాని, దాంతో అతనికోపం రెచ్చిపోయి చివాట్లేసి పొమ్మంటాడు.

అతరవాత, వారు నమ్మినా మానినా రాణి (గిరిజ) ఇదివరకటి చిత్రాలలోలాగే అవమానించబడ్డ స్త్రీ ఏంచెయ్యగలదో మనకీ, డాక్టర్ని ఖూనీచెయ్యమని రాజుకీ చెబుతుంది. ఫాన్సీ డ్రెస్ వేసుకున్న రాజు, అంతపనీ చేసేవాణ్ణని చెప్పి ఆమెను కూడ లేని మరీ ప్రేమిస్తాడు. అనక, డాక్టరుదగ్గరకెళ్లి ఈ కుట్రసంగతి చెప్పి, అతని తన చెల్లెలున్న చోటుకి పంపిస్తాడు. ఈ తరహా సన్నివేశాల చిత్రణలో ప్రత్యేక ప్రజ్ఞగల సి. ఎస్. రావుగారు వీటిని అత్యంత ఆహ్లాదకరంగా చిత్రించారు. చివరకి, మంచిమనసుగల జానకి, ఆమెపాలిట 'మంచిరోజు' అయిన భర్త కలుసుకుంటారు రాజు రాణిని పెళ్లాడుతాడు. ఆ సందడిలో రేలంగి సంతోషం కొద్దీ, 'దుశ్శాసనుడి భుజాలు ఖండి' అంటాడు దర్జాగానే అయినా నిష్కారణంగా. ఆ డైలాగుకి, కవి వెంకట్రావుగారిని కడుక్కొచ్చి మరీ చప్పట్లుకొట్టడం మంచిది.


ఈవిధంగా బలం, జవం లేక్కువైన కథ వల్ల చిత్రం కడుపులమీద నడచినా, విడిగా చూచి ఆనందించతగ్గ అంశాలెన్నో ఉన్నాయి—నటన, హుషారైన సంభాషణలూ, మధురమైన సంగీతం, ఆహ్లాదకరమైన పాత్రలూ, సన్నివేశాలూ మెండైనవన్నీ. ఘంటసాల పాడిన రెండు పాటలూ, ఆయనా సుశీలా కలసి పాడినదొకటి, మిక్కిలినేని చెప్పిన బుర్రకథ, తల్లిప్రేమ గురించి బాలసరస్వతి పాడినపాట చాలహాయిగా ఉన్నాయి. ★

వి. ఎల్. నరసు స్మృతి

ప్రముఖ చలన చిత్ర నిర్మాత, నరసూ కాఫీప్లాంట్ అధిపతిఅయిన వి. ఎల్. నరసుగారు ఆగస్టు 17 ఉదయం సేలంలో మృతిచెందారు. ఆయనవయస్సు 68 ఏళ్ళు.

నరసుగారు కాఫీపొడి వ్యాపారం పైకి వచ్చిన కొద్దికాలంలోనే, సినిమా డిస్ట్రిబ్యూషన్ వ్యాపారం ఆరంభించి చాలకాలం నిర్వహించారు. తరువాత మద్రాసులో నరసూ స్టూడియో నెలకొల్పి, చిత్ర నిర్మాణం జయప్రదంగా నిర్వహించారు. ఇటీవలే ఆయన హిందీలో కూడా నిర్మాణం ఆరంభించి, 'నరసూ' సంస్థను దేశం మొత్తం పేరు తెచ్చుకునేలా నడుపుతూ వచ్చారు.

నరసుగారికి, భార్య, కొడుకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



పొన్నలూరు బ్రదర్స్ వారి 'శోభ' చిత్రం అగస్టు 10న విజయవాడ 'వినోదా పిక్చర్' పాలెస్‌లో శతదినోత్సవాలు జరుపుకొంది. జిల్లా మునసబు శ్రీమతి మంగళాంబ అధ్యక్షత వహించి బహుమతులు పంచిపెట్టారు. కృతజ్ఞత తెలుపుతున్న నటుడు శ్రీ రేలంగిని ఈ చిత్రంలో చూడవచ్చు.

కేసరి పాఠశాలలో 'శ్రీ నాగిరెడ్డి హాల్'

మద్రాసు త్యాగరాయ నగరంలోని కేసరీ ఉన్నత పాఠశాలలో అగస్టు 15న, 'విజయా'ధిపతి శ్రీ బి. నాగిరెడ్డి పేరిట నెలకొన్న విద్యామందిరానికీ, శ్రీమతి అంజలీదేవి పేరిట ఏర్పాటు అయిన లెబారెటరీకీ ప్రారంభోత్సవం జరిగింది. పుర ప్రముఖులు పలువురు ఆరోజు ఉత్సవానికి వచ్చి, విద్యాభివృద్ధికి చలనచిత్ర పరిశ్రమలో ఇద్దరు అగ్రగణ్యులు చేసిన ఈ దోహదాన్ని హర్షించారు.

మాంబళంలో తెలుగు పాఠశాల అభివృద్ధి, నగరంలో తెలుగువారందరికన్నా, మాంబళంలో తెలుగువారికి ఎక్కువ ఆనందాన్నిస్తుంది. ఇక్కడ ఉన్నవారు ఎక్కువగా సినిమా పరిశ్రమలో పనిచేసేవారే. అందుకే, కేసరి విద్యాసంస్థ కార్యదర్శి శ్రీ బండి శ్రీహరిరావు నాయుడుగారు తాము దీనిని (ఆంధ్ర) "హాలీవుడ్ స్కూలు" అంటామన్నారు. ఈ పాఠశాల వసతులు పెరగడంవల్ల, ఇక్కడి తెలుగువారు తమ పిల్లలను దూరంగా ఉన్న పాఠశాలకు పంపే అవసరం తప్పింది.

నాలుగు నెలలనాడు నాగిరెడ్డిగారు, ఈ బడిని చూడవచ్చినపుడు వసతులు పెరగడానికే విరాళం ఇస్తామన్నారు.

నాగిరెడ్డిగారిది ఒక చిత్రమైన పద్ధతి. ఆయనకి ఈ క్షణాన కలిగిన ఒక ఊహ ఉత్తరక్షణాన రూపుధరించి అమలుకు వచ్చేసరికి పరిమాణంలోను, ప్రమాణంలోనూ కూడా పెరుగుతుంది. ఇక్కడ ఒక పూల మొక్క వెయ్యాలనుకుంటే, అది వేసిన వేళకి, పరిమళాన్ని దశదిశలా తీసుకువెళ్ళి పదిమందికీ అందించడానికి మందమారుతం, అందుకోడానికి జనం కూడా ఉండేలా చూస్తారు. ఇవాళ చిన్న విందుకి ముచ్చటగా ముగ్గుర్ని పిలవాలనుకుని ఆయన 'కుడిభుజాలని' పిలిచి ఆ సంగతి చెప్పడం పూర్తి అయేసరికి మూడు వందలమంది జాబితా, విందుకు ముందు తేనీరు, ఆనక గానసభ, దానికి వేరే వేదిక తయారవుతాయి.

నాలుగు నెలలనాడు నాగిరెడ్డిగారు మాంబళంలోని కేసరీ స్కూలు చూడవచ్చారు. 'నేనో పాతిక వేలు ఇస్తాను' అని యాదాలాపంగా అని, మర్నాడు నాలుగు వేలు పంపించారు. ఆ మర్నాడు ఒక కంట్రాక్టర్ని పిలిపించి అక్కడ విశాలమైన హాలు కట్టమని పురమాయించారు. దానికి 30 వేలు అయింది. తరవాత అందులో బల్లలూ, కుర్చీలూ నాల్గు వేలు పెట్టి కొనిచ్చారు. ఒక టైపురైటరు ఇచ్చారు. పాఠశాల ఆవరణ చుట్టూ ముళ్ళకంచె వేయించారు. ఇవికాక ఇంకో నాలుగు వేలు నగదు యిచ్చారు.

నాగిరెడ్డి హాలులో ఇపుడు మూడు తరగతులు నడపడానికి కొత్త వసతులు ఏర్పడ్డాయి.

శ్రీమతి అంజలీదేవి ఈ మధ్యనే తిరుపతి విశ్వవిద్యాలయానికి పాతిక వేలు విరాళం ఇవ్వడం విదితమే. ఇపుడు ఈ పాఠశాలలో లెబారెటరీ ఏర్పాటుకు ఎనిమిది వేలు విరాళమిచ్చారు.

అగస్టు 15న జరిగిన ప్రారంభోత్సవ సభకు మద్రాసు మేయర్ శ్రీమతి తారాచెరియన్ అధ్యక్షత వహించారు. ఆమె శ్రీమతి అంజలీదేవి లెబారెటరీకి ప్రారంభోత్సవం జరిపారు. మద్రాసు ముఖ్యమంత్రి శ్రీ కె. కామరాజ్, శ్రీ నాగిరెడ్డి హాలుకు ప్రారంభోత్సవం జరిపారు. ముఖ్యమంత్రి, శ్రీ నాగిరెడ్డి చిత్రపటాన్ని కూడా ఆవిష్కరించి "విద్యాభివృద్ధికి ఇలా దోహదం చేసి ఇతరులకు మార్గదర్శకులైనందుకు" ఆయనను అభినందించారు. ★

(9 వ పేజీ తరువాయి)

(రాజాం (శ్రీకాకుళంజిల్లా) 190. కూనపురెడ్డి బాలసూర్యావతి (పేకిశెట్టిపాలెం తూ. గో. జిల్లా) 191 చిరతనగండ్ల కోదండరామయ్య (గుంటూరు) 192. ఆకులగాండ్ల లక్ష్మీప్రసాద్ (కర్నూలు) 193. భలిరిశెట్టి వెంకటేశ్వర్లు (తెనాలి) 194. ఇవటూరి శుభగౌరి (హైదరాబాదు) 195 పిలకవనజాక్షి (కొత్త కొలిగాం, (శ్రీకాకుళంజిల్లా) 196. బి. రామహనుమంతిరావునాయుడు (కరీంనగర్) 197. శేబీ పద్మ (పోలాకి, (శ్రీకాకుళంజిల్లా) 198. ఉమ్మెత్తల వెంకటరామారావు (గుంటూరు) 199 ఎ. రఘుకాంతరావు (సంగారెడ్డి, మెదక్ జిల్లా) 200. బొడ్డపాటి గౌరీశంకర్ (హైదరాబాదు.) ★

దేవేంద్రనాథ టాగూరు (గరికపట్టు, కృష్ణా జిల్లా) 16. బలిజేపల్లి సూర్యనారాయణమూర్తి (రామభద్రాపురము, శ్రీకాకుళం జిల్లా) 17. డి. మల్లికార్జునరావు (ఆదోని) 18. ఇందుకూరి, సూర్యనారాయణరాజు (మేపాడు, నెల్లూరుజిల్లా) 19 హరిగుంజే రావు (గుడివాడ) 20. కానం సవితాదేవి, (తాడేపల్లిగూడెం.)

21. బోయనేపల్లి సురేంద్రరావు (సూర్యాపేట, నల్లగొండజిల్లా) 22. సున్నమురళీకుమారి (విజయవాడ) 23. ఎ. వనమాల (గిద్దలూరు, కర్నూలు జిల్లా) 24. కాశీపట్నం కృష్ణారావు (న్యూఢిల్లీ) 25. మిట్టా, శ్రీధరశెట్టి (చిత్తూరు) 26, సూర్యదేవర నిర్మలకుమారి (తుమ్మపూడి, గుంటూరు జిల్లా) 27. ఎం. వెంకటేశ్వరరావు (తిరుత్తణి) 28. చివుకలకృష్ణ రామేశ్వర్, (ఒంగోలు) 29. వి. రంగారావు (బోడవాడ, నెల్లూరుజిల్లా.) ★

—వచ్చేవారం మరికొన్ని.

పుట్టిన తేదీలు పంపని సభ్యులు

[ఈ క్రింది సభ్యులు దరఖాస్తులలో తమ పుట్టిన తేదీలను ఇవ్వలేదు. వెంటనే వాటిని పోస్టుకార్డుల ద్వారా తెలియజేయవలసిందని కోరుతున్నాము. తేదీలు అందగానే సభ్యత్వపు కార్డులు పంపుతాము]

1. ఎం. విజయలక్ష్మమ్మ (దీవెందిన్నె, కర్నూలుజిల్లా) 2. మిక్కిలినేని జయంతి (హైదరాబాదు) 3. మేడూరు సుబ్బలక్ష్మి (పెద్దాపురము) 4. కోదాటి సుధాకరరావు (రేపాల, కృష్ణాజిల్లా) 5. పంగరం ఇందిర (మధిర ఖమ్మంమెట్టుజిల్లా) 6. పి. నరసింహారెడ్డి, (పెంచికలపాడు, గద్వాల్) 7. ఎ. లక్ష్మినారాయణ (గుంటూరు) 8. అంగర వెంకట వరహాలకుమార్ (సింద్రి, బీహార్) 9. దేశాయి అన్నపూర్ణమ్మ (విరుపాపురము, కర్నూలుజిల్లా) 10. రావుకూటం ప్రసాద్ (కడప) 11. ఎం. వి. రామయ్య (నెల్లూరు) 12. కె. సునీతమ్మ (కణికల్లు, అనంతపురము జిల్లా) 13. చివుకలవెంకటరమణ(ఒంగోలు) 14. కొత్తకమలాకరము(నిడుబ్రోలు) 15. అట్లూరు



న్యూఢిల్లీ లేఖ

(6-వ పేజీ తరువాయి)

నిచ్చారు దాంతో ఆహారం పండించే భూమిలో చాలమటుకు చెరుకుపంటకు వాడుకోవటం మొదలైంది.

ఇక పోతే రాష్ట్ర ప్రభుత్వాల సంగతి. అడిగినప్పుడల్లా కేంద్రప్రభుత్వమే ధాన్యం సప్లయి చేస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వాలు అధికంగా ఆహారంపండించే శ్రమ ఎందుకు పడతాయి? కేంద్ర ఆహారశాఖ ఏదో పని కల్పించుకుని చేస్తూ ఉండాలిగదా. లేకపోతే ఆ శాఖే ఎత్తెయ్యాల్సి వస్తుందే, ఖర్మ! అధికాహారోత్పత్తి ఉద్యమం ఏర్పాటే సరిగ్గా వేదసలు. ఇది ఎవరి తాత గారి సొత్తులాగానో తయారైంది. దాన్ని మూసెయ్యటానికి వీల్లేకుండా పోయింది. పూర్తిగా విఫలమైనాసరే, ఉన్న ఉద్యోగులకు ఉద్యోగాలు ఉంచటానికైనా అది అలా కొనసాగుతూ ఉండాల్సిందే నన్నమాట.

కమ్యూనిటీ అభివృద్ధి సంస్థను గూర్చి ప్రధాని నెహ్రూ ఈ మధ్య ప్రస్తావించారు. వీరి ప్రస్తావన వరుస్వరు ఫక్కీలో నడిచింది. "ఈ సంస్థను గూర్చి వచ్చిన విమర్శలు చాలావరకూ సహేతుకమైనవే కావచ్చు. కాని మనం ప్రారంభించిన వాటన్నిటిలోకీ ఇది విప్లవాత్మకమైన ఉద్యమం అనటంలో సందేహంలేదు. ఇది సాధించిన ఫలితాలు నిజంగా అద్భుతమైనవి."

ఇవాళ కాకపోతే రేపైనా ఒక భయంకర సత్యాన్ని మనం ఎదుర్కోక తప్పదు. శ్రేయోరాజ్య సిద్ధాంతంవల్ల ఆర్థికంగా, సాంఘికంగా మేలు జరిగిందా, కీడు జరిగిందా, అనేది సమస్య. దీనివల్ల స్వయంకృషి చచ్చిందా లేదా, శ్రమశిక్షణ, కష్టపడి పనిచేసే అలవాటు చచ్చాయా లేదా అనేది తేల్చుకోవలసిన విషయం. చూస్తేగాని నమ్మలేని భయంకర సత్యాలు కొన్ని ఉన్నాయి. రైతుకు నీళ్లవసరం. పొలంపక్క నుంచి నీళ్లు జలజల ప్రవహిస్తూనే ఉంటాయి. రైతు బోదకాల్వ తవ్వి ఆ నీళ్లు పొలానికి పెట్టుకోడు. ప్రభుత్వం వచ్చి అతనికా పనిచేసి పెట్టాలి. భారత ప్రభుత్వ సచివాలయంలో కూడా ఇదే తంతు. పని దగ్గిరికొచ్చే సరికి అదేం చిత్రమోగాని, మనవాళ్లకి "అహం" బొత్తిగా నశించి పోతుంది; ఉత్తమ పురుష ఏకవచనంకంటె ప్రథమ పురుష బహువచనం ముఖ్యమై పోతుంది. పని బాగా చేశామని గర్వపడే అలవాటు జనంలో నెమ్మదిగా తగ్గిపోతోంది. ఇదంతా పునర్విమర్శ చేసుకోవటం అర్జంటైన అవసరంగా కనిపిస్తోంది. ★

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad



"సంతోషానికి సాటి లేదు...!"

ఫోటో—ఎస్. వి. సత్యనారాయణ, సికింద్రాబాదు.


నేడే చూడండి!
ప్రభా ప్రొడక్షన్స్ వారి......
ఆడపెత్తనం
దర్శకుడు: ఆదుర్తి సుబ్బారావు.
సంగీతం: యస్.రాజేశ్వరరావు అండ్ యం.వేణు.
నిర్మాతలు:
వై. నారాయణస్వామి. M.A.LL.B. & యం. వెంకట్రామదాసు.
FLOODLIGHT